Follow: @ANNTELUGU

ANN తెలుగు

# మహా పత్రిక

20-03-2025

గురువారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 108 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

## రాహుల్‌గాంధీ ఆదేశాలతోనే ఎస్సీ వర్గీకరణ

**వర్గీకరణ చేసినందుకు కాంగ్రెస్ ను అభినందించాలి**

**బిజెపి పాలిత రాష్ట్రాల్లో చేయనిది మేం చేసి చూపాం**

**సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు**



**హైదరాబాద్, మహా:** ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆదేశాలతోనే తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ చేశామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి నేతృత్వంలో వర్గీకరణ కోసం అధ్యయనం చేశామని అన్నారు. బుధవారం ఎస్సీ సంఘాల ప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ చేసినందుకు కాంగ్రెస్, రాహుల్ గాంధీలను మాదిగలు అభినందించాలని చెప్పారు. భవిష్యత్‌లో న్యాయపరమైన చిక్కులు రాకుండా.. వన్‌మెన్ కమిషన్ వేశామని గుర్తుచేశారు.

మిగతా 5లో

టాప్ న్యూస్

## ఓం భూం.. బుష్..

- భట్టి విక్రమార్క బడ్జెట్ ఒట్టి డొల్ల
- తెలంగాణ బడ్జెట్‌పై బండి సంజయ్



05

## ఢిల్లీకి మూటలు పంపే బడ్జెట్


- మాజీమంత్రి కేటీఆర్ విసుర్లు
- ఇది పేదల కష్టాలు తీర్చే బడ్జెట్ కాదు



05

## రాష్ట్రాలకు మూటలు మోసిందే నువ్వు

- కేటీఆర్‌కు మంత్రి సీతక్క కౌంటర్
- మాది ఆహా ఓహో బడ్జెట్ కాదు.. వాస్తవిక బడ్జెట్



05

## 2025-26 బడ్జెట్ అంచనాలు

మొత్తం బడ్జెట్ రూ.3,04,965 కోట్లు

| శాఖ | బడ్జెట్ (కోట్లలో) |
|---|---|
| వ్యవసాయ | 24,439 |
| పశు సంవర్ధక | 1,674 |
| పౌరసరఫరాల | 5,734 |
| విద్యాశాఖ | 23,108 |
| కార్మిక ఉపాధికల్పన | 900 |
| పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి | 31,605 |
| మహిళా శిశు సంక్షేమం | 2,862 |
| షెడ్యూల్ కులాల సంక్షేమం | 40,234 |
| షెడ్యూల్ తెగలకు | 17,169 |
| వెనుకబడిన తరగతుల | 11,405 |
| చేనేత రంగానికి | 371 |
| మైనారిటీ సంక్షేమం | 3,591 |
| పరిశ్రమల శాఖ | 3,527 |
| ఐటీ శాఖ | 774 |
| విద్యుత్ శాఖ | 21,221 |
| వైద్య ఆరోగ్యశాఖ | 12,393 |
| మున్సిపల్ పరిపాలన పట్టణాభివృద్ధి | 17,677 |
| నీటిపారుదల | 23,373 |
| హోం | 10,188 |
| దేవాదాయ | 190 |
| అడవులు పర్యావరణ | 1,023 |
| క్రీడాశాఖ | 465 |
| పర్యాటక | 775 |
| రోడ్లు భవనాలు | 5,907 |

### వివిధ రంగాల్లో వృద్ధి రేటు

సేవారంగం **66.3%**

పారిశ్రామిక రంగం **16.4%**

వ్యవసాయ అనుబంధ రంగాలు **17.3%**

# రూ.3,04,965 కోట్లతో రాష్ట్ర బడ్జెట్



## సంక్షేమం.. ఆరు గ్యారంటీలకు పెద్దపీట

### ఆరుగ్యారంటీలకు కేటాయింపులు అదుర్స్

వ్యవసాయం, అనుబంధ రంగాలకు భారీగా నిధులు

పంచాయతీ రాజ్ శాఖకు సింహభాగం.. నీటిపారుదలకు నిధుల పారుదల

గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ప్రాధాన్యం

ఫ్యూచర్ సిటీ, హైదరాబాద్ అభివృద్ధిపైనా దృష్టి

పర్యాటకానికి ప్రాధాన్యం.. పరిశ్రమలకు పెద్దపీట

6 గ్యారెంటీలకు రూ. 56,084 కోట్లు

3,04,965 కోట్లతో రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన డిప్యూటీ సీఎం భట్టి

శాసన మండలిలో బడ్జెట్ ప్రవేశపెట్టిన మంత్రి శ్రీధర్ బాబు

తెలంగాణ ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క బుధవారం శాసనసభలో రాష్ట్ర ఆర్థిక పద్దును ప్రవేశపెట్టారు. రూ.3,04,965 కోట్ల అంచనా వ్యయంతో తొలిసారి కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టింది. బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి రాష్ట్ర తలసరి ఆదాయం, అప్పులు, రెవెన్యూ వ్యయం, మూలధన వ్యయంపై మాట్లాడారు. ఈసారి సంక్షేమ రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారు. గత ప్రభుత్వ పాలనలో ఛిద్రమైన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతున్నామని, తాత్కాలిక, దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని పనిచేస్తున్నామని తెలిపారు. ప్రజలకు నిజాలు చెప్పకపోతే స్వార్థపరులు చెప్పేవే నిజమని అనుకుంటారని అభిప్రాయపడ్డారు. మార్పు తెచ్చేలా బాధ్యతాయుత పాలన అందిస్తామని తెలిపారు. - మహా, హైదరాబాద్

వివరాలు 2&3లో

### గాంధీ, అంబేద్కర్, శ్రీశ్రీల మాటలను కోట్ చేస్తూ భట్టి ప్రసంగం



"నీకు కనిపించిన బలహీనుడైన నిరుపేద ముఖాన్ని గుర్తు తెచ్చుకో. నువ్వు తీసుకున్న చర్య అతనికి ఉపయోగ పడుతుందో లేదో అని నిన్ను నువ్వు ప్రశ్నించుకో గ్రామ స్వరాజ్యమే దేశ స్వరాజ్యం -మహాత్మా గాంధీ



"విద్య అనేది సింహం పాల వంటిది. వాటిని తాగినవాడు గర్జించకుండా ఉండలేదు.. సాంకేతిక శాస్త్రీయ శిక్షణను అందిందని దేశం. భవిష్యత్ అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికను పూర్తి చేసినట్టుగా భావించలేం -డాక్టర్ బీఆర్ అంబేద్కర్



"కూటి కోసం కూలి కోసం పట్టణంలో బతుకుదామని తల్లిమాట చెవిన పెట్టక బయలు చేరిన బాట సారికి ఎంత కష్టం.. ఎంత కష్టం.. - శ్రీశ్రీ

### తెలంగాణ బడ్జెట్ హైలెట్స్

- తెలంగాణ రాష్ట్ర జీఎస్‌డీపీ **16,12,579 కోట్లు**
- గత సంవత్సరంతో పోలిస్తే వృద్ధి రేటు **10.1 నమోదు**
- రాష్ట్ర తలసరి ఆదాయం **3,79,751 కోట్లు**
- వృద్ధి రేటు **9.6 శాతం**
- దేశ తలసరి ఆదాయంతో పోల్చితే తెలంగాణ రాష్ట్ర తలసరి ఆదాయం **1.8 రెట్లు ఎక్కువ**

## గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్‌కి టూలెట్ బోర్డు

**బీజేపీ నిరసన ఉద్రిక్తత.. మాజీ సీఎం కేసీఆర్ పై ఠాణాలో ఫిర్యాదు**




**గజ్వేల్, మహా :** గజ్వేల్ నియోజకవర్గం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద బుధవారం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి బీజేపీ నేతలు "టూలెట్ ఫర్ గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్" అనే బోర్డు తగిలించారు. అంతేగాక 'వాంటెడ్ గజ్వేల్ ఎమ్మెల్యే" బోర్డు కూడా ఏర్పాటు చేసి, నిరసన తెలియజేశారు.

మిగతా 5లో

## ప్రజారంజక బడ్జెట్

**టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్**

**తెలంగాణ అసెంబ్లీ:** ప్రజా పాలనలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రజారంజక బడ్జెట్ రూపొందించారని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ప్రశంసించారు. అన్ని రంగాల శ్రేయస్సే పరమావధిగా బడ్జెట్ రూప కల్పన జరిగిందన్నారు. రైతన్నలు ,మహిళలకు లబ్ధి చేకూరే విధంగా బడ్జెట్ రూప కల్పన జరిగిందని, యువతకు స్వయం ఉపాధి కల్పించే విధంగా బడ్జెట్ కేటాయింపులు జరిగాయన్నారు. రాజీవ్ యువ వికాసం పథకానికి బడ్జెట్ కేటాయింపులు హర్షించదగిన విషయమన్నారు.

మిగతా 5లో




## ఐపీఎల్ ప్రారంభ వేడుకలకు బాలీవుడ్ స్టార్లు

**ఈ నెల 22 నుంచి ఐపీఎల్ 18వ సీజన్**

**కోల్ కతాలో కేకేఆర్, ఆర్‌సీబీ మధ్య తొలి మ్యాచ్**

**మహా:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2025 మరో మూడు రోజుల్లో ప్రారంభం కానుంది. ఈ నెల 22న ఈడెన్ గార్డెన్స్ లో కేకేఆర్, ఆర్‌సీబీ మధ్య జరిగే తొలి మ్యాచ్‌తో 18వ సీజన్‌కు తెరలేవనుంది. అయితే, ఈ మ్యాచ్‌కు ముందు ఈడెన్ గార్డెన్స్ లో ప్రారంభ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు బీసీసీఐ, ఐపీఎల్ గవర్నింగ్ బాడీ నిర్ణయించాయి. ఈ మెగా ఈవెంట్‌లో బాలీవుడ్ బడా స్టార్లు మెరవనున్నారని తెలుస్తోంది. బాలీవుడ్ నుంచి సల్మాన్ ఖాన్, షారుఖ్ ఖాన్, సంజయ్ దత్, విక్కీ కౌశల్, వరుణ్ ధావన్, దిశా పటానీ, శ్రద్ధా కపూర్ రానున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



వివరాలు 8లో




# రూ.3,04,965 కోట్లతో రాష్ట్ర బడ్జెట్



**ప్రజాప్రయోజనాలేధ్యేయంగా,పారదర్శకత మరియుజవాబుదారీతనంతో సాగుతున్న మా ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ ప్రవేశపెడుతున్నందుకు సంతోషంగా ఉంది. సంక్షేమం-అభివృద్ధిని సమపాళ్ళలో రంగరించి జోడు గుర్రాల తరహాలో సుపరిపాలనా రథాన్ని పరుగులు పెట్టించడంలో సఫలీకృతం అయ్యామని రాష్ట్ర ప్రజలకు తెలియచేస్తున్నాను. . డా. బాబా సాహెబ్ అంబేద్కర్ గారు భారతదేశాన్ని ఒక రాజకీయ, సామాజిక, ఆర్థిక న్యాయం అమలు చేసే పటిష్టమైన ప్రజాస్వామ్య దేశంగా చూడాలనుకున్నారు. అందుకే, రాజ్యాంగ నైతికతను ఆయన పదేపదే నొక్కిచెప్పారు. రాజ్యాంగనిర్మాత సూచించిన ఆ నైతిక విలువలనే సరిగ్గా పాటిస్తూ, మా ప్రజాపాలన సాగిస్తున్నాం.**

తెలంగాణ ప్రజలు మమ్మల్ని నమ్మి కట్టబెట్టిన అధికారాన్ని, మేం ఎవరి వ్యక్తిగత ప్రయోజనాల కోసం తాకట్టు పెట్టకుండా, అధికార పీఠం హోదాగా భావించకుండా, ప్రజల జీవన స్థితిగతులు పెంచుతూ, మార్పు తెచ్చే బాధ్యతగా భావిస్తూ, వినమ్రంగా ప్రజలకు నిత్యం జవాబుదారీతనంతో ఉంటూ,విస్తృత ప్రజా ప్రయోజనాలే పరమావధిగా పాలన సాగిస్తున్నాం. దశాబ్ద కాలం పాలనా వ్యవస్థల విధ్వంసం ఆర్థిక అరాచకత్వంతో కూడిన పాలనతో ఛిద్రమైన తెలంగాణ పాలనా ఆర్థిక వ్యవస్థలని గాడిలో పెడుతూ,తెలంగాణ తాత్కాలిక, దీర్ఘకాలిక ప్రయోజనాలు, లక్ష్యాలను దృష్టిలో ఉంచుకొని, మా ప్రభుత్వం నిరంతరం పని చేస్తున్నది.



“నిజం కూడా ప్రతి రోజు ప్రచారంలో ఉండాలి, లేదంటే అబద్ధంనిజంగా మారి రాష్ట్రాన్ని, దేశాన్నే కాదు ప్రపంచాన్ని కూడానాశనం చేస్తుంది”. ప్రభుత్వం చేసేప్రతి చర్యను శంకిస్తూ, నిరాధారమైన విమర్శలు చేయడమే కొందరు పనిగా పెట్టుకున్నారు. సోషల్ మీడియాలో, సొంత పత్రికలలో అబద్ధపు వార్తలతో ప్రజలను మోసం చేస్తున్నారు. ఇటువంటి కువిమర్శలను సమర్ధవంతంగా తిప్పికొడుతూ, వాస్తవాలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయడం మా బాధ్యత. నిజం ప్రజలకు చెప్పకపోతే, స్వార్థపరులు ప్రచారం చేసే అబద్దాలే నిజాలుగా భ్రమించే ప్రమాదం ఉంది. అందుకే, ఎప్పటికప్పుడు సత్యాలను ప్రజల ముందు ఉంచుతూ ముందుకు సాగుతున్నాం. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా, సమాఖ్య స్ఫూర్తిని మా ప్రభుత్వం కొనసాగిస్తోంది. సమ్మిళిత అభివృద్ధి, సంక్షేమాలను ప్రజలకందించేందుకుగాను, ప్రజాస్వామ్యబద్ధంగా ముందుకు సాగుతున్నాం. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన అనే మూడు అంశాలతో తెలంగాణ నమూనా, నేడు దేశం మొత్తానికే ఆదర్శంగా నిలిచేవిధంగా కృషి చేస్తున్నాము.అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే గత పాలకులు సృష్టించిన సవాళ్లన్నింటినీఎదుర్కొని మా ప్రభుత్వం పరిపాలనా సత్తాను చాటుకుంది. అయితే, అదే సమయంలో లోక్ సభ ఎన్నికలు రావడంతో, ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున అభివృద్ధి పనులకు కొంత విరామం ఏర్పడింది. తెలంగాణ రాష్ట్ర దీర్ఘకాలిక అభివృద్ధి లక్ష్యాల సాధనకు మా ప్రభుత్వం కట్టుబడి ఉంది.

గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో "తెలంగాణ రైజింగ్ 2050" అనే ప్రణాళికతో మా పాలనని ముందుకు నడిపిస్తున్నాం. ఈ రోజు మన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పరిమాణం 200 బిలియన్ డాలర్లు.రాబోయే పదేళ్ల కాలంలో దీనిని ఐదు రెట్లు అభివృద్ధి చేసి 1000 బిలియన్ డాలర్ (ట్రిలియన్‌డాలర్) వ్యవస్థగా రూపాంతరం చెందే దిశగా మా కార్యాచరణ ఉంటుంది. హైదరాబాద్ మహానగరంలో రవాణా, మౌలిక సదుపాయాల విస్తరణ, పర్యావరణ పరిరక్షణ మరియు సాంకేతిక అభివృద్ధి ప్రధానాంశాలుగా అంతర్జాతీయ స్థాయిలో ఒక గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దేందుకుమాస్టర్ ప్లాన్ ను తయారుచేస్తున్నాం. దీనిలో భాగంగా హైదరాబాద్ని కాలుష్యరహిత నగరంగా తీర్చిదిద్దడానికి మూసీ నదీ పునరుద్ధరణప్రాజెక్టను ప్రారంభించాం. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పాటు క్లీన్ ఎనర్జీ, సుస్థిర అభివృద్ధితో తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలబెట్టేందుకు "మెగా మాస్టర్ ప్లాన్ 2050"ని రూపొందించాం. దీని కోసం సౌర, పవన ఇంధన ప్రాజెక్టుల స్థాపనను ప్రోత్సహిస్తున్నాం. ప్రతీ పౌరుడికి మెరుగైన వైద్యం అందించడానికి, ఆరోగ్య సేవలను మెరుగుపరచడానికి, మెడికల్ కాలేజీల ఏర్పాటుకు భారీ స్థాయిలో కేటాయింపులు చేసాం.

సమాజ పురోగతికి కీలకంగా మారిన విద్యా వ్యవస్థను పటిష్టపరచడంతో పాటు, డిజిటల్ విద్యను పెంపొందించి, పాఠశాలలకు మౌలిక సదుపాయాలను కల్పించాం. వెనుకబడిన వర్గాలకు చెందినప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు స్కాలర్‌షిప్‌లను అందిస్తున్నాం.

రైతుల సంక్షేమమే ప్రాధాన్యంగా పనిచేసే మాప్రభుత్వం, రాష్ట్ర రైతాంగానికి ఎప్పటికప్పుడు స్వల్పకాలిక, దీర్ఘకాలిక సహాయాన్ని అందిస్తూనే ఆధునిక వ్యవసాయ విధానాలను ప్రోత్సహించేందుకు సబ్సిడీలు, ప్రత్యేక ఇన్సెంటివ్ లను అందిస్తుంది. మార్కెట్లో సరైన మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు, మార్కెట్ యార్డుల్లో రైతుల కోసం అనేక సదుపాయాలను కూడా కల్పిస్తున్నాం. “నీకు కనిపించిన బలహీనుడైన నిరుపేద ముఖాన్ని గుర్తు తెచ్చుకో. నువ్వు తీసుకున్న చర్య అతనికి ఉపయోగపడుతుందో లేదో అని నిన్ను నువ్వు ప్రశ్నించుకో”మహాత్మగాంధి వారి మాటలే మాకు స్ఫూర్తి మంత్రం. నిరుపేదల కోసం, బలహీన వర్గాల కోసం మేము తీసుకున్న ప్రతి చర్య వెనుక ఉన్న ఆలోచన ఇదే. అభివృద్ధి ఫలాలు సమాజంలోని చిట్టచివరి వ్యక్తికి చేర్చే లక్ష్యంతో అభివృద్ధి మరియు సంక్షేమ రంగాలకు తగినన్ని నిధులనుప్రస్తుత బడ్జెట్ లో ప్రతిపాదిస్తున్నాం.

### రాష్ట్ర ఆర్థికస్థితి:

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో వేగంగా వస్తున్న మార్పుల ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొంటూ,తెలంగాణ ఆర్థిక వ్యవస్థ స్థిరమైన వృద్ధిని సాధిస్తోంది. 202425 ఆర్థిక సంవత్సరంలో, తెలంగాణ స్థూల రాష్ట్ర ఉత్పత్తి (GSDP) ప్రస్తుత ధరల ప్రకారం,పదహారు లక్షల పన్నెండు వేల ఐదు వందల డెబ్బై తొమ్మిదికోట్ల రూపాయలు (16,12,579కోట్లు). గత సంవత్సరంతో పోలిస్తే వృద్ధిరేటు 10.1 శాతంగా నమోదు అయ్యింది. ఇదేసమయంలో, దేశ GDPమూడు కోట్ల ముప్పై ఒక్కలక్షల మూడు వేల రెండు వందల పదిహేను కోట్ల రూపాయలు(3,31,03,215కోట్లు)కాగా, వృద్ధిరేటు 9.9శాతంగా ఉంది.

### తలసరి ఆదాయం

202425 ఆర్థిక సంవత్సరంలో, ప్రస్తుత ధరల ప్రకారం రాష్ట్ర తలసరి ఆదాయం మూడు లక్షల డెబ్బై తొమ్మిది వేల ఏడు వందల యాభై ఒక రూపాయలు (రూ. 3,79,751) కాగా, వృద్ధిరేటు 9.6 శాతం. దేశ తలసరి ఆదాయం రెండు లక్షల ఐదువేల ఐదు వందల డెబ్బై తొమ్మిదిరూపాయలు( రూ.2,05,579) కాగా వృద్ధి రేటు 8.8 శాతం. దేశ తలసరి ఆదాయంతో పోల్చితే తెలంగాణ తలసరి ఆదాయం ఒక లక్షా డెబ్బై నాలుగు వేల ఒక వంద డెబ్బై రెండు రూపాయలు (రూ.1,74,172), అంటే 1.8 రెట్లు ఎక్కువగా ఉంది.

## భూ భారతి

భూమి అనేది ఒక స్థిరాస్థి మాత్రమే కాదు, అది ఒక భావోద్వేగం. భూమితో ఉన్న అనుబంధం కన్నతల్లితో, సొంత ఊరితో ఉన్న అనుబంధంతో సమానం. ఒక వ్యక్తి తన భూమిని కోల్పోయినప్పుడు తన అస్తిత్వాన్నే పోగొట్టుకున్నట్లు భావిస్తాడు. అటువంటి, భావుకతతో ముడిపడి ఉన్న అంశంలో,గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన ధరణి ప్రాజెక్టులో చోటు చేసుకున్న అక్రమాల వల్ల సామాన్యులకు తీరని వేదన మిగిలింది. సమస్యల పరిష్కారాన్ని కోరుతూ, ప్రజలు చేసుకున్న ధరఖాస్తులు కూడా పరిష్కరించలేని దుస్థితి అప్పట్లోఏర్పడింది. వీటి పరిష్కరణను వేగవంతం చేయడానికి జిల్లా కలెక్టర్లకు మాత్రమే ఉన్న పరిష్కరణ అధికారాన్ని తహసీల్దార్/ఆర్.డి.ఓలకు బదిలీ చేస్తూ మార్గదర్శకాలను విడుదల చేసాం. తెలంగాణ ప్రభుత్వం ఒక చారిత్రాత్మక సంస్కరణగా భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చింది. ఈ చట్టంలోని నిబంధనలు పారదర్శకంగా, సమగ్రంగా భూవివాదాలకు తావులేకుండా, భూ యజమానుల హక్కులు పూర్తిగా పరిరక్షించడానికి రూపొందించబడ్డాయి. డిజిటల్ మ్యాపింగ్ వ్యవస్థ ఆధునిక సాంకేతికతను ఉపయోగించడం ద్వారా, భూ భారతి లావాదేవీలను సులభతరం చేసి, సక్రమమైన భూ రికార్డ్ వ్యవస్థను ఏర్పరచడానికి దోహదం చేస్తుంది. భూ పరిపాలనను మరింత బలోపేతం చేయడానికి, 10,954 గ్రామ స్థాయి అధికారుల పోస్టులను మంజూరు చేసాం. దీనితో, క్షేత్ర స్థాయిలో రెవెన్యూ అధికారుల పాత్రను పునరుద్ధరించి, భూ సమస్యలను వేగంగా పరిష్కరించే సమర్థవంతమైన పాలనావ్యవస్థను తెస్తున్నాం.



## నూతన రేషన్ కార్డుల జారీ

తెలంగాణ అవతరించిన తరువాత ఎంతో మంది పేదలు నూతన రేషన్ కార్డు కొరకు ఆశగా వేచి చూసినా గత ప్రభుత్వం వారిని పట్టించుకోలేదు. కనీసం కొత్త కుటుంబ సభ్యుల పేర్లను కూడా రేషన్ కార్డులో జత చేయలేదు. ప్రజల ఆకాంక్షలను గుర్తించిన మేము అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలని, వారికి సన్నబియ్యం కూడా ఇవ్వాలని నిర్ణయించాం. నూతన రేషన్ కార్డుల జారీ మరియు అదనపు కుటుంబ సభ్యుల పేర్లను నమోదు చేసే ప్రక్రియ ఈ సంవత్సరం జనవరి 26 నుండి ప్రారంభించాం. పౌర సరఫరాల శాఖకి ఈ బడ్జెట్ లో 5,734 కోట్ల రూపాయలు ప్రతిపాదిస్తున్నాము.



## సన్న వడ్లకు రూ.500 బోనస్

రాష్ట్ర రైతులనుండి కొనుగోలు చేసే సన్న ధాన్యానికి ప్రతి క్వింటాలుకు 500 రూపాయల చొప్పున అదనపు ప్రోత్సాహాన్ని (బోనస్) చెల్లిస్తున్నాం. దీని వల్ల రాష్ట్రంలో సన్న రకాల వరిసాగు గణనీయంగా పెరిగింది. గత ఖరీఫ్ తో పోల్చినప్పుడు, సన్న వడ్ల సాగు 25 లక్షల ఎకరాల నుండి 40 లక్షల ఎకరాలకు పెరిగింది. మా ప్రభుత్వం ఇస్తున్నబోనస్ మరియు ప్రతి చివరి వడ్లగింజ కూడా కొంటామని మేము చేసిన వాగ్దానమే దీనికి ప్రత్యక్ష కారణం. ఫలితంగా, రైతులకు చక్కని గిట్టుబాటు ధర లభిస్తున్నది. ఖరీఫ్ సీజన్ లో సన్నవడ్లు పండించిన రైతులకు,పన్నెండువందల ఆరు కోట్ల నలభై నాలుగు లక్షలు (1,206.44 కోట్లు) బోనస్చెల్లించడం జరిగింది. రైతుల సౌకర్యార్థం 2024-25 ఖరీఫ్ సీజన్ లో 8,332 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేసాం. అకాల వర్షా ల వల్ల ధాన్యం పాడవకుండా, పండిన ధాన్యాన్నిరైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే సమయంలో ఎటువంటి నష్టం జరుగకుండా, గంట గంటకూ వాతావరణ సూచనలను అటు రైతులకు, ఇటు కొనుగోలు కేంద్రాలకు తెలియజేస్తున్నాం. అధునాతన డ్రైయర్లు, ధాన్యం క్లీనర్లు, తగినన్ని టార్పాలీన్లను రైతులకు అందుబాటులో ఉంచడం జరిగింది. వ్యవసాయ మార్కెట్ యార్డులలో వసతుల అభివృద్ధికి 181.98 కోట్ల రూపాయల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులను చేపట్టాము.



## రైతు భరోసా

రాష్ట్రంలోని రైతులు ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పనిముట్లను కొనుగోలు చేసేందుకు, పెట్టుబడి సాయంగా మా ప్రభుత్వం 2025, జనవరి 26 తేదీన తెలంగాణ రైతు భరోసా పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం క్రింద రైతులకు ఏడాదికి, ఎకరానికి 12 వేల రూపాయలు అందుతాయి. ప్రజాధనం దుర్వినియోగం కాకుండా, అవకతవకలకు అడ్డుకట్ట వేసి సాగుకి యోగ్యమైన భూములన్నింటికీ రైతు భరోసా అందిస్తున్నాం. క్షేత్రస్థాయిలో సర్వే చేసి, గ్రామ సభలలో ధృవీకరించి, సాగుకు యోగ్యంకాని భూమిని గుర్తించడం ద్వారా,ఈ వృధాను అరికట్టాము. రైతు భరోసా పథకానికి పద్దెనిమిది వేల కోట్ల (18,000 కోట్లు)రూపాయలు ఈ బడ్జెట్ లో ప్రతిపాదిస్తున్నాము.

### ఇందిరమ్మ ఆత్మీయ భరోసా (రైతు కూలీ సంక్షేమం):

భూమి లేని వ్యవసాయ కూలీలు ఉపాధి దొరకని రోజుల్లో పస్తులుండే దీన స్థితి నుండి వారిని కాపాడేందుకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని అమలు పరుస్తామని ఎన్నికల్లో చేసిన వాగ్దానానికి అనుగుణంగా సంవత్సరానికి ప్రతి వ్యవసాయ కూలీ కుటుంబానికి 12వేల రూపాయలు చెల్లించే బృహత్తర పథకాన్ని అమలు చేస్తున్నాం. 2024-25 ఖరీఫ్ సీజన్ లో పది లక్షల ముప్పై ఐదు వేల నాలుగు వందల ఎనభై నాలుగు (10,35,484) మంది రైతులనుండి ధాన్యం కొనుగోలు చేసి,పన్నెండు వేల ఐదు వందల పదకొండు కోట్ల డెబ్బై ఆరు లక్షల రూపాయలు(12,511.76 కోట్లు) వారి ఖాతాలలో జమ చేయడమైనది. కేంద్ర ప్రాయోజిత పథకాల ద్వారా రాష్ట్ర రైతుల ప్రయోజనం కోసం అన్ని చర్యలు తీసుకొంటున్నాము. రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగును విస్తృతంగా చేపట్టాలన్న ప్రభుత్వ లక్ష్యంతో, ప్రోత్సాహక సబ్సిడీని అందిస్తున్నాం. ఆయిల్ పామ్ దిగుమతులపై కస్టమ్స్ సుంకం లేని కారణంగా మన రైతులకి సరైన ధర లభించనందున, కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి ఆయిల్ పామ్ దిగుమతులపై కస్టమ్స్ సుంకం విధించేలా కృషి చేసాం.



## రైతు రుణ మాఫీ

పెరుగుతున్న వ్యవసాయ పెట్టుబడికోసంరైతులు అప్పులు చేయక తప్పని పరిస్థితి ఏర్పడింది. గతంలో చేసిన అప్పుతీరితేనే రాబోయే పంట కాలానికి కావలసిన పెట్టుబడికి రుణం దొరుకుతుంది.మన రైతన్నలకు ఇచ్చిన మాటకు కట్టుబడి మా ప్రభుత్వంవారిని రుణ విముక్తులను చేసింది. వారికి 2 లక్షల లోపు రుణాలను మాఫీ చేసింది. ఇప్పటివరకు 25.35 లక్షల మంది రైతులకు ఇరవై వేల ఆరు వందల పదహారు కోట్ల ఎనభై తొమ్మిదిలక్షలు(20,616.89 కోట్లు) రుణ మాఫీ చేసాం. దీనివల్ల రైతులు మళ్ళీ వ్యవసాయ రుణాలు పొందడానికి మార్గం సుగమమైంది. ఈ భారీ రుణ మాఫీతో తెలంగాణ రాష్ట్రంలోని రైతుల ఆర్థిక మరియు సామాజిక స్థితిగతులు మెరుగుపరిచేందుకు బాటలు వేశాం. పశువులు వ్యాధుల బారినపడకుండా నిరోధించే టీకాలను ఉత్పత్తి చేసే తెలంగాణ పశు వైద్య టీకా ఉత్పత్తి కేంద్రం హైదరాబాద్, శాంతినగర్ లో ఉంది.ఈ వెటర్నరీ బయోలాజికల్ రీసర్చ్ ఇన్స్టిట్యూట్ ని మామిడిపల్లికి తరలించి, 300 కోట్ల రూపాయలతో భారీగా విస్తరింపజేస్తున్నాం. అంతేకాకుండా, క్రొత్త వ్యాక్సీన్ల ఆవిష్కరణకుఅవసరమైన పరిశోధనలు చేపట్టే నిమిత్తం, 100 కోట్ల రూపాయలతో అధునాతన యంత్రాలను తెప్పిస్తున్నాం. నూతనంగా ఏర్పాటయ్యే ఈ టీకాల కేంద్రంలో బ్యాక్టీరియల్, వైరల్ వ్యాక్సిన్ ప్రొడక్షన్ ప్లాంట్లు, క్వాలిటీ కంట్రోల్, యానిమల్ టెస్టింగ్ ల్యాబ్ లు, ఆర్ అండ్ డి, యానిమల్ బ్రీడింగ్ సెంటర్ వంటి వాటితోపాటు, స్టాఫ్ క్వార్టర్స్ కూడా నిర్మిస్తాం. మన రాష్ట్రం నుండి భారీగా చేపల ఎగుమతిని ప్రోత్సహించడానికి రంగారెడ్డి జిల్లా కొహెడలో ఎక్స్పోర్ట్ ఓరియెంటెడ్ హోల్సేల్ చేపల మార్కెట్ ను 47 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించాలని ప్రతిపాదించాం.

# జోడు గుర్రాల తరహాలో.. సుపరిపాలనా రథం

## వివిధ రంగాలలో వృద్ధి రేటు

2024-25లో తెలంగాణ జోడింపబడిన స్థూల విలువలో (GSVA) సేవా రంగం 66.3 శాతం, పారిశ్రామిక రంగం 16.4 శాతం, మరియు వ్యవసాయ, అనుబంధ రంగాలు 17.3 శాతం వాటాను కలిగి ఉన్నాయి. వ్యవసాయ, అనుబంధ రంగాలు GSDP లో తక్కువ వాటా కలిగి ఉన్నప్పటికీ, రాష్ట్ర మొత్తం శ్రామిక రంగంలో42.7 శాతంమందికి ఉపాధి కల్పిస్తున్నాయి. ఉచిత కరెంట్,రైతు భరోసా, పంట రుణ మాఫీ, నీటి పారుదల ప్రాజెక్టులపై పెట్టుబడులువంటి ప్రభుత్వ పథకాలురైతాంగానికి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాయి. అదే సమయంలోవ్యవసాయ రంగాన్ని పటిష్టవంతం చేసేందుకుగాను, పండ్ల తోటలు, పశు సంరక్షణ, చేపల పెంపకం వంటి అనుబంధ వ్యవసాయ కార్యకలాపాలను ప్రోత్సహిస్తున్నాం. రాష్ట్ర పరిశ్రమలు 22.5 శాతంమందికి ఉపాధి కల్పిస్తున్నాయి. "చైనా +1" వ్యూహాన్ని అవలంబించడం ద్వారాతెలంగాణను ఫార్మాస్యూటికల్స్, బయోటెక్నాలజీ, విద్యుత్ వాహనాలు, పునరుత్పాదక శక్తి రంగాలలోగ్లోబల్ తయారీ కేంద్రంగాఅభివృద్ధి చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం. పరిశ్రమల కారిడార్లు, ప్రత్యేక ఆర్థిక మండళ్ళ అభివృద్ధి, మరిన్నిపెట్టుబడులను ఆకర్షించి, ఉద్యోగ అవకాశాలను పెంపొందించడానికి తోడ్పడతాయి. తద్వారా, ఆర్థిక వ్యవస్థ మరింత స్థిరంగా, వేగంగా అభివృద్ధి చెందుతుంది. రాష్ట్రంలో సేవా రంగం అత్యధిక క్రొత్త ఉపాధి కల్పించే దిశగా కొనసాగుతోంది. ఇది మొత్తం శ్రామిక రంగంలో 34.8 శాతంవాటాను కలిగి ఉంది. హైదరాబాద్నగరంఐటీ రంగంలో అగ్రగామిగా, ముఖ్యంగాసాఫ్ట్‌వేర్ సేవలు, ఫిన్‌టెక్, లాజిస్టిక్స్, పర్యాటకంవంటి రంగాలలో ఉపాధి వృద్ధికి ప్రధానంగా దోహదపడుతోంది. తెలంగాణ లో శ్రామికశక్తి68.7 శాతంఉండగా, దేశీయ సగటు 64.3 శాతంమాత్రమే ఉంది. దీనిలో, మహిళల ఉపాధి శాతం 52.7 శాతం ఉండగా, ఇదిదేశ సగటు 45.2 శాతంకంటే అధికం.మహిళలు మరియు వెనుకబడిన వర్గాలకు తెలంగాణ ప్రభుత్వం ఉపాధి అవకాశాలు కల్పించడంలో ఎంతగా విజయవంత మయ్యిందో ఈ గణాంకాలుతెలియజేస్తున్నాయి.

## 16వ ఆర్థిక సంఘం

రాష్ట్ర ప్రభుత్వం16వ ఆర్థిక సంఘానికి సమగ్ర నివేదికను సమర్పించింది.ఇందులోకేంద్ర పన్నుల పంపిణీలో రాష్ట్రాలకు న్యాయమైన వాటా కల్పించాలని, అలాగేరుణ స్థిరత్వం, మౌలిక సదుపాయాల అభివృద్ధిమరియు సామాజిక సంక్షేమ కార్యక్రమాలకు మరింత ఆర్థిక సహాయం అందించాలనివిజ్ఞప్తి చేసింది.కేంద్ర ప్రభుత్వం విధిస్తున్న సెస్సులు, అదనపు చార్జీల వల్ల రాష్ట్రాలకు వస్తున్న ఆదాయం గణనీయంగా తగ్గుతుంది అన్న విషయాన్ని కమీషన్ కు వివరించాం. ప్రస్తుతం రాష్ట్రాలకు ఇస్తున్న 41 శాతం పన్నుల వాటాను 50 శాతానికి పెంచాలని ప్రతిపాదించడం జరిగింది. తెలంగాణతో సహా దక్షిణాది రాష్ట్రాలకు పన్నుల పంపిణీలో తగ్గుతున్న వాటాపై ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది. తెలంగాణకు 14వ ఆర్థిక సంఘం ద్వారా 2.437 శాతం నిధుల పంపిణీ జరిగితే, 15వ ఆర్థిక సంఘం కాలంలో ఇది 2.102 శాతానికి తగ్గింది.

అభివృద్ధిలో ముందున్న రాష్ట్రాలకు తక్కువ నిధులు కేటాయించడం అన్యాయమని, దేశ ఆర్థికవృద్ధికి దోహదపడుతున్నరాష్ట్రాలను ప్రోత్సహించే విధంగా పన్నుల పంపిణీ విధానాన్ని మరింత హేతుబద్ధంగా మార్చాలని తెలంగాణ ప్రభుత్వం వాదిస్తోంది. తెలంగాణ ప్రభుత్వం సమాంతర పన్నుల పంపిణీ సూత్రంలో సంస్కరణలు తీసుకురావాలని సూచించింది. ప్రస్తుతం ఉపయోగిస్తున్న "తలసరి ఆదాయ దూరం" అనే ప్రాతిపదిక ప్రాధాన్యతను తగ్గించి, GSDP కి 50 శాతం వెయిటేజినిఇవ్వాలని కోరింది. దేశ ఆర్థిక వృద్ధికి గణనీయంగా సహకరిస్తున్న రాష్ట్రాలకుమరింత హేతుబద్ధంగా వనరులను అందించడం ద్వారా దేశ అభివృద్ధిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ సూచన ప్రతిపాదించబడింది. మన న్యాయమైన వాటాను సాధించడంతో పాటు, ఆర్థిక వనరులను సద్వినియోగం చేసుకుని,ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది.



## విద్య




**యంగ్ ఇండియా ఇంటి గ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ :** విద్యతోనే సామాజిక అభివృద్ధి సాధ్యం. ముఖ్యంగా, పేద మరియు వెనుకబడిన తరగతులకు చెందిన పిల్లల సురక్షిత భవిష్యత్తుకి విద్య ఒక దారిని చూపుతుంది. ఇది ప్రగాఢంగా నమ్మిన UPA ఛైర్ పర్సన్ శ్రీమతి సోనియా గాంధీ గారు మరియు ఆనాటి భారత ప్రధాని దివంగత డా. మన్మోహన్ సింగ్ గార్ల నాయకత్వంలోఉచిత విద్యా హక్కు చట్టం 2009 లో చేసారు. ప్రస్తుతం తెలంగాణలో 1,023 ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలు ఉండగా, వీటిలో 662 పాఠశాలలకు స్వంత భవనాలు లేవు. అనేక గురుకులాలు అరకొర సౌకర్యాలున్న భవనాల్లో, వందలాది మంది విద్యార్థులతో, సరైన టాయిలెట్ సదుపాయం కూడా లేకుండా నడుస్తున్నాయి. వర్గాల వారీగా ప్రత్యేక రెసిడెన్షియల్ స్కూల్స్ ఉన్నప్పటికీ, వాటి మధ్య విద్యా ప్రమాణాల విషయంలో, మౌలిక వసతుల విషయంలో సారుప్యత లేదు.ప్రపంచ వ్యాప్తంగా విద్యావ్యవస్థలో పెను మార్పులు చోటుచేసుకున్నప్పటికీ, మన ప్రభుత్వ పాఠశాలలు దశాబ్దాల కాలం వెనుకబడి ఉన్నాయి. ఈ పరిస్థితులను సరిదిద్దడానికిసామాజికవేత్తలు, విద్యావేత్తలతో చర్చించి, మన ప్రభుత్వవిద్యా వ్యవస్థను మరియుభావితరాలను అత్యుత్తమరీతిలో తీర్చిదిద్దే విధంగాయంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ని రూపొందించాం. కులం, మతం లేదా ఆర్థిక స్థితిగతులకు అతీతంగా, విద్య మాత్రమే కాకుండా, విద్యార్థుల యొక్క మానసిక, శారీరక అభివృద్ధికి,అంటే హోలిస్టిక్ డెవలప్‌మెంట్కి దోహదపడే విధంగా ఈ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నాం. ఈ పాఠశాలలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలతో పాటు ఇతర వర్గాలకు చెందిన విద్యార్థులను ఒకే గొడుగు కిందకుతెచ్చి సమాన విద్యా అవకాశాలను కల్పించడం,ఒక గొప్ప సామాజిక ఐక్యతకు పునాది అవుతుంది. “Education is the milk of a lioness. The one who drinks it, can't stay without roaring” Dr. B.R. Ambedkar. విద్య అనేది సింహపు పాల వంటిది, వాటిని త్రాగిన వారు గర్జించకుండా ఉండలేరు. డా.బి.ఆర్.అంబేద్కర్ కలలు కన్న విద్యావ్యవస్థను మేము సృష్టించబోతున్నాము. దీనికోసమే రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి 58 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణానికి 11,600 కోట్ల రూపాయల అనుమతులు మంజూరు చేయడం జరిగింది.మేము తీసుకున్న ఈ నిర్ణయంఒక చారిత్రాత్మకం.ప్రతి నియోజకవర్గంలో కనీసం ఒక యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ ని ప్రారంభిస్తాం. ఈ ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ 20 నుంచి 25 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించబడతాయి. విద్యారంగంలో వస్తున్న మార్పులకి అనుగుణంగా, ఆధునిక వసతులతో ప్రైవేట్ పాఠశాలలకు ధీటైన విద్యను అందించేందుకు వీటిని అభివృద్ధి చేస్తున్నాం.

## యువత - ఉద్యోగాలు

“No plan for the future development of the country can bedeemed to be complete, which does not provide for technical and Scientific training” - Dr. B.R Ambedkar. “సాంకేతిక మరియు శాస్త్రీయ శిక్షణను అందించని దేశం, భవిష్య అభివృద్ధికి సంబంధించిన ఏ ప్రణాళికను పూర్తి చేసినట్లుగా భావించలేము”. డా.బి.ఆర్.అంబేద్కర్ గారు దూరదృష్టితో అర్థ శతాబ్దానికి పూర్వం చెప్పిన ఈ మాటలు నేటికీ మన సమాజానికి వర్తిస్తాయి. అందుకే, యువతలో శాస్త్ర సాంకేతిక నైపుణ్యతను పెంపొందించే ఉద్దేశ్యంతో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని స్థాపించాం. బోధనాంశాలకు, పారిశ్రామిక అవసరాలకు మధ్య ఉన్న అంతరాన్ని తొలగించి నిరుద్యోగ యువత ఉపాధి అవకాశాలను పెంపొందించే లక్ష్యంతో ఈ యూనివర్సిటీ పనిచేస్తుంది. మహాత్మాగాంధి గారు స్వాతంత్ర్య సమరోద్యమంలో యువతను చైతన్య పరచడానికి నడిపిన యంగ్ ఇండియా పత్రిక పేరునే ఈ యూనివర్సిటీకి పెట్టడం గమనార్హం. ఈ యూనివర్సిటీని ముచ్చర్లలో 150 ఎకరాలలో నిర్మించి, ఏడాదికి 30 వేల ఉద్యోగాలు కల్పించాలని ప్రభుత్వ లక్ష్యంగా పెట్టుకున్నాం. సింగపూర్ ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ITE) ప్రపంచంలోనే మేటి సంస్థ. వారి భాగస్వామ్యంతోయంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటిమాస్టర్ ట్రైయినర్లకు శిక్షణను ఇస్తున్నాము. వివిధ పరిశ్రమల భాగస్వామ్యంతో ఈ యూనివర్సిటీలో అందించే కోర్సులు అటు యువతకు, ఇటు పరిశ్రమలకు ఎంతో ఉపయుక్తంగా ఉండేలా రూపొందించాం. ఈ యూనివర్సిటీలో ప్రస్తుతం ఐదు కోర్సులు ప్రారంభమైనాయి. ముమ్ముందు యానిమేషన్, టూరిజం మరియు హాస్పిటాలిటి, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, నిర్మాణ రంగం, రిటైల్ రంగం, మీడియా, సినిమారంగం, నౌకా మరియు విమాన మెయింటెనెన్స్ రంగం, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వంటి అత్యాధునిక టెక్నాలజీ కోర్సులను కూడా ప్రారంభించబోతున్నాం. తెలంగాణ యువతను, విద్యార్థులను నిపుణులుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఫ్యూచర్ సిటీలో ప్రత్యేకంగా 200 ఎకరాలలో AI సిటీని నెలకొల్పాలని నిర్ణయించింది. ఈ సిటీలోప్రత్యేక AI విశ్వవిద్యాలయాన్ని, డేటా సెంటర్లను, కంప్యూటింగ్ సౌకర్యాలను, పౌరులకు అవగాహన కల్పించే కేంద్రాన్ని స్థాపించడానికి తగిన చర్యలు ప్రారంభించాం. కేంద్ర గణాంక శాఖ నిర్వహించిన పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (PLFS) ప్రకారం, తెలంగాణలో 2023 జూలై సెప్టెంబర్ కాలంలో నిరుద్యోగ రేటు 22.9 శాతం ఉండగా, 2024 జూలై సెప్టెంబర్ కాలంలో అది 18.1 శాతానికి తగ్గింది. మా ప్రభుత్వం చేస్తున్న నైపుణ్య శిక్షణా కార్యక్రమాలు,ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు, యువ పారిశ్రామికవేత్తలకుఇస్తున్న ప్రోత్సాహకాల వల్లనే ఇది సాధ్యమయ్యింది.

## అభయహస్తం

మేము ప్రవేశపెట్టిన అభయ హస్తంలోని ప్రతి అంశం సామాన్య ప్రజల కష్టాలను దృష్టిలో పెట్టుకొని రూపుదిద్దుకొన్నవే.ఒక నిరుపేద తన రోజువారి జీవితంలో ఏ కనీస సదుపాయాలు ఉండాలని కోరుకుంటాడో వాటినన్నీ అభయహస్తంలో భాగంగా చేర్చడం జరిగింది.మహాలక్ష్మి, రైతుభరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత క్రింద పించన్ల పంపిణీ వంటి పలు పథకాలను ప్రభుత్వం ఇప్పటికే సమర్థవంతంగా అమలు చేస్తోంది. మన ఆడబిడ్డలు పనికి వెళ్లాలన్నా, చదువుకోవడానికి బడికి వెళ్లాలన్నా లేదా మొక్కు తీర్చుకోవడానికి ఓ గుడికి వెళ్లాలన్నా వారు ప్రయాణ ఖర్చుల గురించి ఆలోచించకుండావెళ్లడానికి,మహాలక్ష్మి పథకం క్రింద 2023, డిసెంబర్ 9వ తేదీన రాష్ట్రంలోని మహిళలందరికీ ఉచిత బస్సు సౌకర్యాన్ని ప్రారంభించాం. నేటి వరకురాష్ట్ర వ్యాప్తంగా 7,227 బస్సుల్లో 149.63 కోట్ల ఉచిత ప్రయాణాలు మహిళలు చేసారు.దీని ద్వారా ఐదు వేల ఐదుకోట్ల తొంభై ఐదు లక్షలరూపాయలు(5005.95 కోట్లు) మహిళలకు ఆదా అయ్యింది. ప్రారంభ దశలో సాధారణ బస్సులలో 69 శాతంగా ఉన్న RTC ఆక్యుపెన్సి రేషియో 94 శాతానికి పెరిగింది. మహాలక్ష్మి ప్రత్యేక బస్సులలో ఈ ఆక్యుపెన్సీ రేషియో 100 శాతంగా నమోదవుతూ ఉంది. దీనివల్ల RTC ఆర్థిక పరిస్థితి కూడా మెరుగుపడింది. బస్సుల సంఖ్యను పెంచడమే కాకుండా, 6,400 మంది ఉద్యోగులను ఇప్పటికే అదనంగా నియమించడం జరిగింది.

## మహిళల ఆర్థిక భద్రత కోసం ప్రత్యేక బీమా పథకాలు

రుణ బీమా పథకం కింద ఒక్కో స్వయం సహాయక సంఘసభ్యురాలికి 2 లక్షల రూపాయల సహజ మరణ బీమామరియు 10 లక్షల రూపాయల ప్రమాద బీమాఅందించబడుతోంది. తద్వారా, స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఆర్థిక రక్షణ కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం.

### మహిళలకు వ్యాపార అవకాశాల్లో విస్తరణ

మహిళలు గొప్ప వ్యాపారవేత్తలుగా రాణించగలరని ఇప్పటికే రుజువైంది. రిటైల్,రవాణా రంగాలలో మహిళా పారిశ్రామికవేత్తలకుకొత్త అవకాశాలు కల్పిస్తున్నాం. ఇప్పటికే 32 మొబైల్ ఫిష్ రిటైల్ అవుట్‌లెట్‌లు ఏర్పాటు చేయబడ్డాయి. నారాయణపేటలో తొలి స్వయం సహాయక సంఘాలమహిళలు నడిపే పెట్రోల్ బంక్ ఒక కోటి ఇరవై మూడులక్షలరూపాయల (1.23 కోట్లు)పెట్టుబడితో ప్రారంభించబడింది.రాష్ట్రవ్యాప్తంగా ఇటువంటి మరిన్ని పెట్రోలుబంకులు ఏర్పాటు చేసేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. మండల మహిళా సమాఖ్యల ద్వారా 600 బస్సులను TGSRTCకి అద్దెకు ఇచ్చేందుకు నిర్ణయించాం. ఇప్పటికే 150 బస్సులను అద్దెకు ఇవ్వడం జరిగింది. స్వయం సహాయక సంఘాలకుసోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ల స్థాపన, నిర్వహణను అప్పగిస్తున్నాము.ఈ సంఘాల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేయడానికి SERP, TGREDCO, TGSPDCL మరియు TGNPDCL మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ప్రాజెక్టు ద్వారా 1000 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి అవ్వడమే కాకుండా మహిళలకు జీవనోపాధి లభిస్తుంది. కోటి మంది మహిళలకు ఇందిరా మహిళా శక్తి మిషన్ పథకం ద్వారా లక్ష కోట్ల రూపాయలవడ్డీ లేని రుణాలను అందిస్తాము. పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖకు ఈ బడ్జెట్ లో 31,605 కోట్ల రూపాయలు ప్రతిపాదిస్తున్నాము.

## పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి

“గ్రామ స్వరాజ్యమే దేశ స్వరాజ్యం”- మహాత్మాగాంధీ

ఈ స్ఫూర్తితో మా ప్రభుత్వం గ్రామీణ వికాసానికి శ్రీకారం చుట్టింది. గత ప్రభుత్వంలో నిర్వీర్యం అయిన గ్రామీణ వ్యవస్థను మరింత పటిష్టం చేయాలనే లక్ష్యంతో కార్యాచరణను రూపొందించుకున్నాం. 2024 25లో రాష్ట్ర ప్రభుత్వం MNREGS పథకం క్రింద రాష్ట్ర వాటాగా చెల్లించాల్సిన నిధులను సకాలంలో చెల్లిస్తూ, పలు గ్రామీణాభివృద్ధి పథకాలను సమర్థవంతంగా అమలు చేసింది. ఈ సంవత్సరంలో, ఇరవై ఐదులక్షల డెబ్బై ఆరు వేల (25.76 లక్షలు)కుటుంబాలకు ఉపాధి చేకూర్చాం. గ్రామీణాభివృద్ధిలో భాగంగా, 781 కోట్ల వ్యయంతో 26,055 సాంప్రదాయ నీటి వనరులను పునరుద్ధరించాము. 926 కోట్ల రూపాయల వ్యయంతో 82,286 గ్రామీణ రోడ్లను నిర్మించాము. 275 కోట్ల వ్యయంతో 51,216 పిల్ల కాలువల మరియు ఇతర కాలువల పూడికతీత పనులను పూర్తి చేసాం. 244 కోట్ల రూపాయలతో 63,854 భూమి అభివృద్ధి పనులను చేపట్టాం. అలాగే, 16,310 జల పరిరక్షణ పనులకు 155 కోట్ల రూపాయలు ఖర్చు చేయడం జరిగింది.

## ఇందిరా మహిళా శక్తి

మన దేశ తొలి మహిళా ప్రధాని ఇందిరాగాంధీ, తొలి మహిళా రాష్ట్రపతి ప్రతిభాపాటిల్ మరియు లోక్ సభ తొలి మహిళా స్పీకర్ మీరాకుమార్వంటి మహిళలు ఎంతో సమర్థవంతంగా పనిచేసి వారి పదవులకే వన్నె తెచ్చారు. మన దేశంలోని ప్రతి మహిళకు కూడా అదే సమర్థత ఉందని మా నమ్మకం.భారత దేశ సుస్థిరతకు కుటుంబ వ్యవస్థేపునాది, అందులో మహిళలదే ప్రముఖ పాత్ర.వారి ఆర్థిక స్వావలంబన కుటుంబ స్వావలంబనకు, దేశాభివృద్ధికి ఎంతో కీలకం. స్త్రీ శక్తే దేశ శక్తి అని విశ్వసించి ఇందిరా మహిళా శక్తి మిషన్ ను ప్రారంభించాం. ఈ మిషన్ తో తెలంగాణలోమహిళా సాధికారతకు నూతన శకం ప్రారంభమయింది. ఈ పథకంలో20 వేలకోట్ల రూపాయల రుణాన్నిఅందించాలనే లక్ష్యాన్ని పెట్టుకున్నాం. ఈ లక్ష్యాన్ని కూడా అధిగమించి, ఇరవై ఒక్క వేల ఆరు వందల ముప్పై రెండు కోట్ల (21,632 కోట్లు) రూపాయల రుణాలనిస్వయం సహాయక సంఘాలకు (SHGs) అందించాం. దీని ద్వారా, 2.25 లక్షలసూక్ష్మ పరిశ్రమలు స్థాపించబడి, మహిళలకు పెద్ద ఎత్తునఉద్యోగ అవకాశాలులభించాయి. ఇంతే కాకుండా, 214 ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు కూడా ప్రారంభించాం.

OPINION స్పందన

# ఉచితాలపై రేవంత్ వ్యాఖ్యలలో నిజమెంత?






- ఎస్.కే.జకీర్, సీనియర్ జర్నలిస్ట్

**''ఎవరో ఒకరు ...
ఎపుడో అపుడు..
నడవరా ముందుగా
అటో ఇటో ఎటో వైపు...
మొదటివాడు
ఎప్పుడూ ఒక్కడే మరి..
మొదటి అడుగు
ఎప్పుడూ ఒంటరే మరి..
వెనుక వచ్చువాళ్లకు
బాట అయినది''.**

ఒక తెలుగుసినిమా పాటలో ఒక చరణం ఇది. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో ఉచితపథకాలపై సాహసోపేతంగా చేసిన వ్యాఖ్యలు సహజంగానే దుమారం రేపుతున్నవి. 'ఉచితంగా లభించేది ఎప్పుడూ ప్రమాదకరమే.అందులో ఏదో మోసమో, తెలియని నిర్బంధమో ఉంటుంది'.అని క్రీస్తు పూర్వం 6 వ శతాబ్దానికి చెందిన ఈసప్ కథలలో మనం చూడవచ్చు. ''ఉచిత పథకాల వల్ల రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలోకి వెళ్తోంది.మౌలిక సదుపాయాల కోసం 500 కోట్ల రూపాయలు కూడా ఖర్చు చేయలేకపోతున్నాం. ఉచితాలు మేమొక్కరమే ఇవ్వడం లేదు.బీజేపీ కూడా ఢిల్లీలో ఇస్తోంది.దేశవ్యాప్తంగా ఉచిత పథకాలపై చర్చ జరగాలి.ఉచితాల వల్ల నిజంగా ప్రజలకు మేలు జరుగుతుందా? లేక దీర్ఘకాలికంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై భారం పడుతుందా? కేసీఆర్ అధికారంలోకి వచ్చినప్పుడు కేవలం రూ 69 వేల కోట్లు మాత్రమే అప్పు ఉండేది. పదేళ్లలో రూ.6 లక్షల కోట్లకుపైగా అప్పులు చేసి ప్రజలపై భారం మోపారు.దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే రూ.21 వేల కోట్లు రైతులకు అందించాం '' అని ఇండియా టుడే కాంక్లేవ్ 2025 లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తీవ్ర ప్రకంపనలు పుట్టిస్తున్నాయి.ఒక ముఖ్యమంత్రిగా ఇటువంటి వ్యాఖ్యలు చేయడానికి చాలా సాహసం కావాలి.ఇంకా చెప్పాలంటే తగిన దమ్మూ,ధైర్యమూ ఉండాలి.రేవంత్ తెగువకు ఇదొక తార్కాణం.

'ఎన్నికల ముందు ఇవన్నీ తెలియవా '? అనే ప్రశ్నకు " హామీలు ఇచ్చినప్పుడు నాకు తెలియదు,కానీ ఇప్పుడు ఉచిత పథకాలు మంచివి కావు అని అనిపిస్తుంది. ఇప్పుడున్న పథకాలే కష్టం మీద నడుస్తున్నాయి.ఇవి భవిష్యత్ లో నిలిపివేసే అవకాశం లేకపోలేదు'' అని సీఎం జవాబిచ్చారు.ఉచితపథకాలు అందుకుంటున్న వారికి,కొన్ని వర్గాల ప్రజలకు రేవంత్ రెడ్డి మాటలు ఎంతమాత్రం నచ్చకపోవచ్చు.పైగా సీఎంపై తీవ్ర ఆగ్రహమూ కలగవచ్చు.ఆయన మాట్లాడిన ప్రతి మాటా నిజమే.అయితే దాదాపు పదేండ్ల కాలంలో తెలంగాణను 'ఓటు బ్యాంకు రాజకీయాలు' ముట్టడించి,ఉక్కిరిబిక్కిరి చేశాయి.మనిషి పుట్టుక నుంచి మరణించే దాకా ఏదో ఒక పథకం అందేటట్లు కేసీఆర్ వ్యూహాత్మకంగా అమలుచేశారు.పథకాల పేరిట వాళ్లందరినీ తమ పార్టీకి కట్టిపడవేసే వ్యూహంతోనే సంక్షేమం పేరిట విచ్చలవిడిగా ప్రజాధనాన్ని పందేరం చేశారు.ఒక వైపు సంక్షేమం,మరోవైపు అభివృద్ధి పేరిట కార్యక్రమాలు కేసీఆర్ హయాంలో స్వైరవిహారం చేశాయి.గ్రామీణ కులవృత్తుల వారి జీవన ప్రమాణాలు పెంచడమనే పేరుతో కొన్ని కార్యక్రమాలు 'క్లిక్' అయిన మాట నిజమే.కానీ 'ఓటు బ్యాంకు' రాజకీయం గుప్పిట సంక్షేమ పథకాలు చిక్కుకున్నందుకే 'ఆర్థిక సంక్షోభ 'పరిస్థితులు తెలంగాణలో నెలకొన్నాయి.

ప్రజలు,ముఖ్యంగా ఆయా ఉచితపథకాల లబ్ధిదారులు కేసీఆర్ ను దేవునిగా పూజిస్తున్నారంటే ఆ పథకాల పుణ్యమే! ఖజానాలో డబ్బు ఎంత ఉంది? ప్రభుత్వానికి వస్తున్న ఆదాయం ఎంత? అని వెనుకా ముందు చూడకుండా 'ఓటు బ్యాంకు'లను సుస్థిరం చేసుకోవడానికి కేసీఆర్ ఎక్కువ ఆసక్తి చూపారు. దీనికొక బలమైన కారణమూ ఉన్నది.2014 నాటికి టిఆర్ఎస్ కు ఓటుబ్యాంక్ స్పష్టంగా లేదు.బొటాబొటీ మెజారిటీతో అధికారంలోకి రాగానే అదివరకే రూపొందించుకున్న 'రోడ్ మ్యాపు'ను కేసీఆర్ అమలు చేశారు.రాజకీయ సుస్థిరత కోసం వివిధ పార్టీలను నిర్వీర్యం చేసి,మరోవైపు ఉచిత పథకాల పేరిట 'ఓటు బ్యాంకు'నిర్మించుకోవడానికి ఆయన గట్టి ప్రయత్నాలు చేశారు.ఈ పథకాల కారణంగా తెలంగాణ వేగంగా 'అప్పుల ఊబి'లో కూరుకుపోతున్న సంగతి కేసీఆర్ గ్రహించలేదని అనుకోవడానికి వీల్లేదు.ఆయనకు అన్నీ తెలుసు.అప్పులు చేసినా వాటితో 'సంపద' సృష్టిస్తున్నట్టుగా భారీ ప్రచారానికి పూనుకున్నారు.అదే నిజమని నమ్మిన వాళ్ళు కోకొల్లలు.

> 'ఓటు బ్యాంకు' రాజకీయం గుప్పిట సంక్షేమ పథకాలు చిక్కుకున్నందుకే 'ఆర్థిక సంక్షోభ'పరిస్థితులు తెలంగాణలో నెలకొన్నాయి. ప్రజలు,ముఖ్యంగా ఆయా ఉచితపథకాల లబ్ధిదారులు కేసీఆర్ ను దేవునిగా పూజిస్తున్నారంటే ఆ పథకాల పుణ్యమే! ఖజానాలో డబ్బు ఎంత ఉంది?ప్రభుత్వానికి వస్తున్న ఆదాయం ఎంత? అని వెనుకా ముందు చూడకుండా 'ఓటు బ్యాంకు'లను సుస్థిరం చేసుకోవడానికి కేసీఆర్ ఎక్కువ ఆసక్తి చూపారు.

> 'కేసీఆర్ అప్పు చేసినా, రేవంత్ అప్పు చేసినా మాకెందుకు? మాకు అందవలసిన ఉచితాలు మాకు రావలసిందే' అనే ధోరణి జనంలో బాగా నాటుకున్నది.అందుకే 'ఉచితాల'పై బిఆర్ఎస్ పార్టీ,ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపైనా,ముఖ్యమంత్రి పైనా ప్రతి రోజూ విరుచుకుపడుతోంది.

> ఉచితాలపై చాలా రోజులుగా చర్చ జరుగుతున్నప్పటికీ రేవంత్ రెడ్డి దాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లారు . దేశ రాజకీయాలపై 'కొత్త ఎజండా' ను రేవంత్ ఆవిష్కరించారు.

> ఎవరు మాటలెక్కువ మాట్లాడగలుగుతారో,ఎవరు మాటలతో ప్రత్యర్థుల్ని చీల్చి చెండాడగలుగుతారో వాళ్లే తెలంగాణలో రాజకీయం చేయగలుగుతారు.వాళ్ళే సక్సెస్ కాగలుగుతారు. మార్చి 16 న అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏకధాటిగా దాదాపు మూడు గంటల పాటు మాట్లాడడం ఒక సంచలనం. ఇదివరకు ఇలాంటి 'మారథాన్' ప్రసంగాలకు కేసీఆర్ కేరాఫ్ గా ఉండేవారు.కేసీఆర్ ను మించిన సబ్జెక్టుతో రేవంత్ గడగడలాడిస్తుండడంపై బిఆర్ఎస్,బీజేపీ నాయకులు నివ్వెరపోతున్నారు.

హైదరాబాద్ నగరంలోని వెలుగు జిలుగులు చూసి మురిసిపోయిన వారెందరో లెక్క లేదు.జనానికి 'ఉచితాలు 'కావాలి తప్ప,దీర్ఘకాలిక ప్రయోజనాలు అవసరం లేదు.వాటి గురించి వాళ్ళు ఆలోచించరు.తాత్కాలిక తాయిలాలకు ప్రజలు ముచ్చట పడే విషయం రహస్యమేమీ కాదు.'కేసీఆర్ అప్పు చేసినా,రేవంత్ అప్పు చేసినా మాకెందుకు?మాకు అందవలసిన ఉచితాలు మాకు రావలసిందే' అనే ధోరణి జనంలో బాగా నాటుకున్నది. అందుకే 'ఉచితాల 'పై బిఆర్ఎస్ పార్టీ,ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపైనా,ముఖ్యమంత్రి పైనా ప్రతి రోజూ విరుచుకుపడుతోంది.కేసీఆర్ సీఎంగా ఉంటే అన్ని పథకాలు అమలయ్యేవని ఆయన పార్టీ నాయకులు బలంగా ప్రచారం చేస్తున్నారు.రేవంత్ రెడ్డి ఇందులో విఫలమయ్యారన్న విమర్శలనూ ఆ పార్టీ గుప్పిస్తున్నది.టన్నుల కొద్దీ బురదను సీఎం రేవంత్ పై చల్లుతోంది.

''పేదరికం అధికంగా ఉన్న భారత్‌లో ఉచిత పథకాలు అవసరమే.అయితే అవి హద్దుమీరితే దేశాభివృద్ధికి అవరోధంగా మారతాయి. విద్య, వైద్యం తదితర సేవలు ఉచితంగా అందించడం ద్వారా మరింత సత్ఫలితాలను సాధించవచ్చు.ఉచితాల విషయంలో అన్ని పార్టీలు ఒకే తీరుగా వ్యవహరిస్తున్నాయి.కొన్ని రాష్ట్రాలలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నారు. అంతకన్నా అదే ఖర్చుతో వారికి మరింత తోడ్పాటును అందించే మరొక పథకం అందించవచ్చు.ముందుగా అధ్యయనం ద్వారా ఏ పథకంతో ప్రజలు అధిక ప్రయోజనం పొందుతారన్న విషయంపై అవగాహనకు రావాలి''. అని 'భారత ఆర్థిక సమాఖ్యవాదంభవిష్యత్తు' అంశంపై జరిగిన ఒక కార్యక్రమంలో ఆర్ బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు అన్నారు.

''ఉద్యోగాల కల్పన ద్వారానే పేదరికాన్ని నిర్మూలించవచ్చు.ఉచితాలు ఇవ్వడం ద్వారా నిర్మూలించలేం .ఈ విషయంలో ఏ దేశం ఇప్పటి వరకు విజయం సాధించిన దాఖలాలు లేవు.ఉచితాలతో ఎలాంటి ప్రయోజనం ఉండదు'' ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి ఇటీవలే వ్యాఖ్యానించారు.ఉచితాలపై చాలా రోజులుగా చర్చ జరుగుతున్నప్పటికీ రేవంత్ రెడ్డి దాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లారు .దేశ రాజకీయాలపై 'కొత్త ఎజండా' ను రేవంత్ ఆవిష్కరించారు. కాగా ఎవరు మాటలెక్కువ మాట్లాడగలుగుతారో,ఎవరు మాటలతో ప్రత్యర్థుల్ని చీల్చి చెండాడగలుగుతారో వాళ్లే తెలంగాణలో రాజకీయం చేయగలుగుతారు.వాళ్ళే సక్సెస్ కాగలుగుతారు. మార్చి 16 న అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏకధాటిగా దాదాపు మూడు గంటలపాటు మాట్లాడడం ఒక సంచలనం.ఇదివరకు ఇలాంటి 'మారథాన్' ప్రసంగాలకు కేసీఆర్ కేరాఫ్ గా ఉండేవారు.కేసీఆర్ ను మించిన సబ్జెక్టుతో రేవంత్ గడగడలాడిస్తుండడంపై బిఆర్ఎస్,బీజేపీ నాయకులు నివ్వెరపోతున్నారు. ఇక సొంతపార్టీ కాంగ్రెస్ నాయకులు,మంత్రులు సైతం రేవంత్ ను అభినందిస్తున్నారు.మరే రాష్ట్రంలోనూ ఇలాంటి పరిస్థితి ఉండదు.నాయకుడుగా ఉన్న వ్యక్తి ఏం చేసినా, చేయకపోయినా,అద్భుతంగా మాట్లాడితే చాలు తెలంగాణలో రాజకీయనాయకునిగా స్థిరపడవచ్చు.మాటల మాంత్రికుడు కెసిఆర్ సానుకూల అంశం అదే.అద్భుతమైన మాటకారి అయిన కేసీఆర్ ఆ మాటలతోనే ఉద్యమం నడిపారు.ఆ మాటలతోనే పదేండ్లు పాలించారు.ఇదే ఫార్ములా ఫాలో అయ్యి రేవంత్ రెడ్డి కూడా టిడిపి నుంచి కాంగ్రెస్ లోకి వచ్చి ఏకంగా ముఖ్యమంత్రి అయ్యారు.

కేసీఆర్ హయాంలో ఉద్యోగులకు జీతాలు,ఆలస్యంగా అందేవి.నారాయణమూర్తి చెప్పినట్లుగా 'ఉద్యోగాల కల్పన' పెద్దఎత్తున జరగలేదు.పేదరికాన్ని నిర్మూలించడానికి ఉద్యోగ,ఉపాధి అవకాశాలు పెంచాలన్న స్పృహ లేకుండా 'సంక్షేమం' పేరిట బిఆర్ఎస్ పార్టీ తన 'శాశ్వత ఓటర్లను' తయారుచేసుకోవడానికే ప్రజాధనాన్ని పెద్దపెట్టున ఖర్చు చేస్తూ వచ్చారు.ఇబ్బడిముబ్బడిగా అప్పులు చేసి,ఉచితాల కింద పంచిపెట్టారు.''ధనిక రాష్ట్రమైన తెలంగాణ ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోవడం, కోరి తెచ్చుకున్న సమస్య.ఉత్పాదక రంగాలను నిర్లక్ష్యం చేసి,తాత్కాలిక తాయిలాలు ఇస్తూ,భారీ ప్రాజెక్టులు కట్టడం వల్లనే ఈ సంక్షోభం వచ్చింది'' అని లోక్ సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ ఒక ఇంటర్వ్యూలో చెప్పారు.

జయప్రకాష్ నారాయణ,ఇన్ఫోసిస్ నారాయణమూర్తి,ఆర్బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి వంటి వారు 'ఉచితాలు హద్దు మీరవద్దు' అని చేతున్న హితబోధ కేసీఆర్ కు,కేసీఆర్ పార్టీకి మింగుడుపడదు.'వాళ్ళెవరికీ తనంత తెలివితేటలు లేవ'ని కేసీఆర్ వాదించగలరు.తనకు తానే వ్యవసాయ శాస్త్రవేత్తగా,ఇరిగేషన్ రంగ నిపుణునిగా,ఆర్థిక వ్యవస్థను కాచి వడబోసిన వ్యక్తిగా,ఇంజనీరుగా పలు రూపాల్లో కేసీఆర్ దర్శనమిస్తుండే వారు.ప్రజలు తమను తిరస్కరించినందుకు కించిత్తు పశ్చాత్తాపమూ ఆయనలోకానీ,కేటీఆర్,హరీశ్ రావులో కానీ కనిపించడం లేదు.''ప్రజలు మోసపోయి ఓట్లేశారు'' అని బిఆర్ఎస్ నాయకులంతా మైండ్ లో ఫిక్స్ అయిపోయారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు పెడితే '80 నుంచి 100 సీట్లు గ్యారంటీ' అని ఆ పార్టీ మాధ్యమాలు హోరెత్తుతున్నాయి.దాదాపు 7 లక్షల కోట్ల అప్పుపై వడ్డీ కింద నెలకు 6,500 కోట్లు చెల్లిస్తున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్ చాలా సార్లు చెప్పారు.తాము అమలుచేసిన పథకాలు కొనసాగించడంలో ,అలాగే ఎన్నికల వేళ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో రేవంత్ విఫలమవుతున్నారన్న అంశాన్ని మాత్రమే బిఆర్ఎస్ ఫోకస్ చేయదల్చుకున్నది.తద్వారా ఈ ప్రభుత్వంపై,ముఖ్యమంత్రి రేవంత్ పై ప్రజల్లో వ్యతిరేకతను సృష్టించడానికి ఒక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకున్నట్టు కనబడుతోంది. ''కేసీఆర్ ఉన్నప్పుడే మంచిగుండె.శేతిల పైసలాడుతుండే.కాంగ్రేసోల్లచ్చినంక అణా పైస ఉంటలేదు''! అన్నది గ్రామీణ ప్రాంతాల్లో సామాన్య జనాల్లో ఉన్న టాక్.రైతుబంధు కేసీఆర్ హయాంలో భూస్వాములకు,కాంట్రాక్టర్లు,పెట్టుబడిదారులు ఇతర సంపన్నవర్గాలు, అనర్హులకు అమలైంది.దాని పేరిట జరిగిన ఖజానా దోపిడీ గురించి సీఎం రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి భట్టి,శ్రీధర్ బాబు పలు మార్లు వివరించారు.రాష్ట్రప్రభుత్వం దగ్గర డబ్బుల్లేని నిజాన్ని సీఎం వెల్లడించడాన్ని 'నేరం'గా బిఆర్ఎస్ నిర్వచిస్తోంది.సీఎం అలా మాట్లాడితే రాష్ట్రానికి పెట్టుబడులు,పరిశ్రమలు రావన్న వాదన తీసుకొస్తున్నది.ఇందులో ఎంత మాత్రం నిజం లేదు.తెలంగాణలో ఉన్న మౌలిక సదుపాయాలు,పారిశ్రామిక సానుకూల వాతావరణం,రాయితీలు,వేగంగా అనుమతులు వంటి పలు ప్రమాణాల ఆధారంగానే పెట్టుబడులు వస్తాయి. బిఆర్ఎస్ టార్గెట్ రేవంత్ రెడ్డి.ఆయనను ప్రతిరోజు డ్యామేజ్ చేయడమెలా?అన్నది ఆ పార్టీ మీడియా,లేదా ఆ పార్టీ ఆధారిత సోషల్ మీడియా మేధోమధనం చేసి వంటలు వండుతున్నారు.మరలా అధికారంలోకి రావాలంటే తమకు అడ్డుగోడగా తయారయిన రేవంత్ ను తొలగించుకోవాలి.అదీ కాన్సెప్టు.ఒక ముఖ్యమంత్రి అట్లా బహిరంగంగా రాష్ట్ర పరిస్థితిని బాహిర్గతం చేయవచ్చునా లేదా? అన్నది వేరే చర్చ. ఉచిత పథకాలపై తన పాలసీని కేసీఆర్ ప్రకటించాలి. జీతభత్యాలకే కష్టంగా మారిన పరిస్థితుల్లో ఉచితాలను కేసీఆర్ సమర్థించగలరా?నిధులు ఎట్లా సమకూరుతాయి?అప్పు ఎలా పుడుతుంది? 'పతార' ఎలా ఉంటుంది?

కేసీఆర్ పార్టీ లాగా రేవంత్ కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలు నడపదలచుకోలేదని ఆయన పరిపాలనా పంథా,వ్యవహార శైలి,చేపడుతున్న కార్యక్రమాలను బట్టి విశ్లేషించవచ్చు.అందుకే సీఎం ఉచితాల' తేనె తుట్టెను కదిపారు.స్కిల్ యూనివర్సిటీ,యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ళు,ఐటిఐల ఆధునీకరణ,హైడ్రా,మూసీ పునరుజ్జీవం,ఖాయిలా పడ్డ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రక్షాళన,ఉద్యోగాల భర్తీకి ప్రాధాన్యం,రాజీవ్ యువ వికాసం,తెలంగాణ సూపర్ గేమ్ చేంజర్ గా భావిస్తున్న రీజనల్ రింగ్ రోడ్ ... వంటి కార్యక్రమాలేవీ 'ఓట్లను రాల్చగలిగేవి' కావు.కానీ తెలంగాణ ఉజ్వల భవిష్యత్తు దీర్ఘకాలిక ప్రణాళికతో రేవంత్ రెడ్డి వెడుతున్నారు. దేశంలోని పేద ప్రజలకు ఆర్థికంగా అండగా ఉండేందుకంటూ పలు రాష్ట్ర ప్రభుత్వాలు ఉచిత పథకాలు అందిస్తున్నాయి.ఈ పథకాల సంఖ్య నానాటికీ పెరుగుతుండడంతో పలు వర్గాల నుంచి ఆందోళన నెలకొంటోంది. ఉచితాలతో ఎలాంటి ప్రయోజనాలు లేకపోవడంతో పాటు ఖజానా ఖాళీ అయి దివాలా తీసే ప్రమాదం ఉంటుందని,ప్రజలు పని చేయకుండా సోమరిగా మారిపోతారంటూ పలువురు నిపుణులు హెచ్చరిస్తున్నారు.రేవంత్ మాటలు కటువుగా ఉన్నప్పటికీ,తెలంగాణలోని రాజకీయ పార్టీలన్నీ 'ఉచితాల'కు లక్ష్మణ రేఖ గీయవలసి ఉన్నది.

> నాయకుడుగా ఉన్న వ్యక్తి ఏం చేసినా, చేయకపోయినా,అద్భుతంగా మాట్లాడితే చాలు తెలంగాణలో రాజకీయనాయకునిగా స్థిరపడవచ్చు. మాటల మాంత్రికుడు కెసిఆర్ సానుకూల అంశం అదే. అద్భుతమైన మాటకారి అయిన కేసీఆర్ ఆ మాటలతోనే ఉద్యమం నడిపారు.ఆ మాటలతోనే పదేండ్లు పాలించారు.ఇదే ఫార్ములా ఫాలో అయ్యి రేవంత్ రెడ్డి కూడా టిడిపి నుంచి కాంగ్రెస్ లోకి వచ్చి ఏకంగా ముఖ్యమంత్రి అయ్యారు.

> జయప్రకాష్ నారాయణ,ఇన్ఫోసిస్ నారాయణమూర్తి,ఆర్బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి వంటి వారు 'ఉచితాలు హద్దు మీరవద్దు' అని చేస్తున్న హితబోధ కేసీఆర్ కు,కేసీఆర్ పార్టీకి మింగుడుపడదు.'వాళ్ళెవరికీ తనంత తెలివితేటలు లేవ'ని కేసీఆర్ వాదించగలరు.

> కేసీఆర్ పార్టీ లాగా రేవంత్ కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలు నడపదలచుకోలేదని ఆయన పరిపాలనా పంథా,వ్యవహార శైలి,చేపడుతున్న కార్యక్రమాలను బట్టి విశ్లేషించవచ్చు.అందుకే సీఎం ఉచితాల' తేనె తుట్టెను కదిపారు.స్కిల్ యూనివర్సిటీ,యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ళు,ఐటిఐల ఆధునీకరణ,హైడ్రా,మూసీ పునరుజ్జీవం,ఖాయిలా పడ్డ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రక్షాళన,ఉద్యోగాల భర్తీకి ప్రాధాన్యం,రాజీవ్ యువ వికాసం,తెలంగాణ సూపర్ గేమ్ చేంజర్ గా భావిస్తున్న రీజనల్ రింగ్ రోడ్ ... వంటి కార్యక్రమాలేవీ 'ఓట్లను రాల్చగలిగేవి' కావు. కానీ తెలంగాణ ఉజ్వల భవిష్యత్తు దీర్ఘకాలిక ప్రణాళికతో రేవంత్ రెడ్డి వెళుతున్నారు.

**రచనలకు ఆహ్వానం**
ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.
**మీ రచనలు పంపాల్సిన చిరునామా:**
mahaapatrika@gmail.com
whatsapp- 74369 39999

# ఓం భూం.. బుష్..

- భట్టి విక్రమార్క బడ్జెట్ ఒట్టి డొల్ల
- తెలంగాణ బడ్జెట్‌పై బండి సంజయ్



**హైదరాబాద్, మహా:** రాష్ట్ర ఆర్ధిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను పరిశీలిస్తే.. డొల్ల అని తేలిపోయిందని కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శించారు. బడ్జెట్ తీరును విశ్లేషిస్తే.. అబద్ధాలు.. అంకెల గారడీ.. 6 గ్యారంటీలకు పాతరేసేలా రాష్ట్ర బడ్జెట్ ఉందని, ఓం భూం బుష్ అంటూ మాయ చేసేందుకే ప్రయత్నిస్తున్నట్లు స్పష్టంగా కన్పిస్తోందని ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా గత బడ్జెట్ కేటాయింపులు, ఖర్చులను పరిశీలిస్తే పొంతనే లేదని, అయినప్పటికీ బడ్జెట్ కేటాయింపులు పెంచి రాష్ట్ర ప్రజలను దారుణంగా మోసం చేసేందుకు బడ్జెట్‌ను సాధనంగా చేసుకోవడం సిగ్గు చేటన్నారు. 6 గ్యారంటీలను పూర్తిగా తుంగలో తొక్కేశారని ఆరోపించారు. ఎన్నికలకు ముందు మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా పేర్కొన్న కాంగ్రెస్ నేతలు అధికారంలోకి వచ్చాక చిత్తుకాగితంగా మార్చినట్లు ఈ బడ్జెట్ ద్వారా వెల్లడైందన్నారు. తెలంగాణ ప్రజల తలసరి ఆదాయం భారీగా పెరిగినట్లు బడ్జెట్‌లో గొప్పలు చెప్పిన సర్కార్.. అప్పుల వివరాలను కూడా బడ్జెట్ లో పొందుపరిచి ఒక్కో తెలంగాణ పౌరుడిపైనా, చివరకు పుట్టబోయే బిడ్డపైనా ఎంత అప్పు భారం ఉందో వాస్తవాలను వివరిస్తే బాగుండేదని అభిప్రాయపడ్డారు. మహిళలకు రూ.2,500, తులం బంగారం, స్కూటీ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ గత బడ్జెట్ లోనూ, ఈ బడ్జెట్‌లోనూ నయాపైసా కేటాయించలేదన్నారు. 2 లక్షల ఉద్యోగాల భర్తీ, రూ.4 వేల నిరుద్యోగ భృతిపై బడ్జెట్‌లో కేటాయింపులు జరపకపోవడం సిగ్గు చేటు అని తెలిపారు. ఇక విద్యా భరోసా ప్రస్తావనే లేదని, వృద్ధుల పెన్షన్ పెంపును ప్రస్తావించకుండా వారిని గాలికొదిలేసిందని అన్నారు. బడ్జెట్ కేటాయింపులకు, ఆచరణకు అసలు పొంతనే లేదన్నారు.

# ఢిల్లీకి మూటలు పంపే బడ్జెట్

## మాజీమంత్రి కేటీఆర్ విసుర్లు

### ఇది పేదల కష్టాలు తీర్చే బడ్జెట్ కాదు



**హైదరాబాద్, మహా:** తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదల కష్టాలు తీర్చే బడ్జెట్ కాదని, ఢిల్లీకి మూటలు పంపే బడ్జెట్ అని మాజీమంత్రి కేటీఆర్ విమర్శించారు. బడ్జెట్ ప్రసంగం అనంతరం మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. ఆరు గ్యారంటీ లు గోవిందా గోవిందా అని అర్థం అయ్యిందని, వంద రోజుల్లో 6 గ్యారంటీ లు అమలు చేస్తాం అని పాతర వేశారన్నారు. మహిళలకు రూ.2500 ఇస్తామని ఇవ్వలేదన్నారు. తొండ ముదిరితే ఊసరవెల్లి అయితదని పెద్దలు చెబుతుంటారు.. కానీ ఊరసవెల్లి ముదిరితే రేవంత్ రెడ్డి అయితడని ఈ బడ్జెట్ చూసిన తర్వాత అర్థమవుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సెటైర్లు వేశారు. సంక్షేమానికి సమాధి.. అభివృద్ధికి అడ్రస్ గల్లంతు.. ప్రజలకు ఇచ్చిన హామీలకు ఘోరీ కట్టి.. పార్టీ కార్యకర్తలకు మాత్రం వీళ్ల అబ్బ సొత్తు.. పప్పుబెల్లం లాగా 6 వేల కోట్లు పంచి పెడుతారట. కార్యకర్తలకు ఇస్తామంటే చూస్తూ ఊరుకోవడానికి ఈ రాష్ట్ర ప్రజలు సిద్ధంగా లేరు. పప్పుబెల్లంలాగా పంచి పెడుతామంటే.. అది యువ వికాసం కాదు కాంగ్రెస్ వికాసం అయితది అని కేటీఆర్ మండిపడ్డారు.

# రాష్ట్రాలకు మూటలు మోసిందే నువ్వు

## కేటీఆర్‌కు మంత్రి సీతక్క కౌంటర్

### మాది ఆహా ఓహో బడ్జెట్ కాదు.. వాస్తవిక బడ్జెట్



**హైదరాబాద్, మహా:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మంత్రి సీతక్క కౌంటర్ ఇచ్చారు. అసెంబ్లీ లాబీలో మంత్రి సీతక్క మాట్లాడారు. ఢిల్లీకి మూటలు మోసే బడ్జెట్ అని కేటీఆర్ వ్యాఖ్యలు చేయడం ఆయన మానసిక పరిస్థితికి అద్దం పడుతున్నాయని విమర్శించారు. ఇతర రాష్ట్రాలకు మూటలు మోసింది కేటీఆర్ అని, కేసీఆర్ మూటలు తీసుకున్న వారంతా ఆగం అయ్యారని ఆరోపించారు. అప్పుల గురించి కేటీఆర్ మాట్లాడడం మిలినీయం జోక్ అని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని మోయలేనంత అప్పుల కుప్పగా మార్చింది టీఆర్ఎస్ ప్రభుత్వమన్నారు. బీఆర్ఎస్ బడ్జెట్ అంతా కోతల బడ్జెట్.. అందుకే ప్రజలు వాతలు పెట్టారన్నారు. ఇది బీఆర్ఎస్ మాదిరి అహో ఓహో భజన బడ్జెట్ కాదన్నారు. మహిళా, రైతు, యువత, అట్టడుగు వర్గాల సంక్షేమ బడ్జెట్ ఇదన్నారు. వందశాతం ఇది వాస్తవిక బడ్జెట్ అని, వాస్తవాలను ప్రతిబింబించే విధంగా బడ్జెట్ ఉందన్నారు.

### గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్‌కి

# టూలెట్ బోర్డు

## బీజేపీ నిరసన ఉద్రిక్తత..

### మాజీ సీఎం కేసీఆర్ పై ఠాణాలో ఫిర్యాదు




(మొదటిపేజీ తరువాయి)

ఈ సందర్భంగా గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముందు బైఠాయించి ఆందోళన వ్యక్తం చేశారు. అంతేగాక కేసీఆర్ డౌన్, డౌన్ అని, కేసీఆర్ బయటికి రావాలి అని పలు నినాదాలు చేసుకుంటూ వాంటెడ్ గజ్వేల్ ఎమ్మెల్యే అనే ఫ్లకార్డులను ప్రదర్శించారు. రంగంలోకి దిగిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేశారు. దీంతో బీజేపీ నేతలు, పోలీసులకు మధ్య స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. అనంతరం పోలీసులు బీజేపీ నేతలను అరెస్ట్ చేసి, ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ నుంచి తరలించారు. కాగా గజ్వేల్ ఎమ్మెల్యేగా ఉన్న మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఎర్రవల్లిలోని తన ఫాంహౌజ్ కే పరిమితయ్యారని అధికారపార్టీ నేతలు ఆరోపిస్తున్నారు. ప్రతిపక్ష నేతగా ఉన్నకేసీఆర్ కేవలం రెండు సార్లు మాత్రమే అసెంబ్లీ సమావేశాలకు వచ్చారు. అది కూడా గవర్నర్ ప్రసంగానికి ఒకసారి, బడ్జెట్ రోజు మరోసారి మాత్రమే హాజరయ్యారు. గజ్వేల్ లో సుదీర్ఘ కాలంగా ఎమ్మెల్యేగా ఉన్న కేసీఆర్.. గజ్వేల్ నియోజకవర్గ ప్రజలకు కూడా అందుబాటులో ఉండటం లేదు. దీంతో స్థానికులు ఆందోళన బాట పట్టారు. మరోవైపు యూత్ కాంగ్రెస్ నేతలు ఠాణాలో ఫిర్యాదు చేశారు.

# రాబిన్‌హుడ్‌తో మాజీమంత్రి మల్లారెడ్డి

## మరోసారి డ్యాన్స్ అదరగొట్టేశాడు!

నితిన్, శ్రీలీల జంటగా నటించిన తాజా చిత్రం రాబిన్‌హుడ్. రిలీజ్ తేదీ దగ్గర పడడంతో చిత్రబృందం ప్రమోషన్లతో బిజీగా ఉంది. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్‌లోని మల్లా రెడ్డి మెడికల్ సైన్సెస్ కాలేజీలో మీట్ అండ్ గ్రీట్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి మల్లా రెడ్డి కూడా హాజరయ్యారు. ఇంకేముంది మల్లన్న తన టాలెంట్‌ను మరోసారి ప్రదర్శించారు. వేదికపై నితిన్‌తో కలిసి స్టెప్పులు వేశారు. రాబిన్‌హుడ్ మూవీలోని అదిదా సర్‌ప్రైజ్ అంటూ సాగే ఐటమ్ సాంగ్‌కు డ్యాన్స్ చేశారు. దీనికి సంబంధించిన వీడియోను మైత్రి మూవీ మేకర్స్ ట్విటర్ ద్వారా షేర్ చేశారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇది చూసిన నెటిజన్స్ మల్లన్నా మజాకా అంటూ కామెంట్స్ చేస్తున్నారు.




# ఆరు గ్యారంటీలకు.. కేటాయింపులు అదుర్స్

## రూ. 56,084 కోట్ల రికార్డు కేటాయింపులు

హైదరాబాద్, మహా: తెలంగాణ 202526 వార్షిక బడ్జెట్ లో కాంగ్రెస్ హామీనిచ్చిన ఆరుగ్యారంటీలకు అదిరిపోయే కేటాయింపులు చేసింది. తమను అధికారంలోకి తీసుకొచ్చిన ఆరు గ్యారంటీలకు కేటాయింపుల్లోనూ సిక్సర్లు కొట్టి.. తగ్గేదెలే అని చాటింది. ఆరు గ్యారెంటీలను అమలు చేసేందుకు ఏకంగా రూ. 56,084 కోట్లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. ఇందులో..

| | |
|---|---|
| మహాలక్ష్మి పథకానికి | రూ. 4,305 కోట్లు |
| గృహ జ్యోతి పథకానికి | రూ. 2,080 కోట్లు |
| సన్న బియ్యంకు | రూ.500 బోనస్ |
| పథకానికి | రూ.1800 కోట్లు |
| రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకానికి | రూ. 1,143 కోట్లు |
| గ్యాస్ సిలిండర్ సబ్సిడీ పథకానికి | రూ. 723 కోట్లు |
| ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి | రూ. 600 కోట్లు |
| రైతు భరోసా పథకానికి | రూ.18,000 కోట్లు |
| చేయుత పథకానికి | రూ. 14,861 కోట్లు |
| ఇందిరమ్మ ఇళ్లు పథకానికి | రూ. 12,571 కోట్లు |

# ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం

## ప్రభాకర్‌రావుపై రెడ్‌కార్నర్ నోటీస్.. మరో నిందితుడు శ్రవణ్‌రావుపై కూడా

**మహా :** ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ప్రధాన నిందితుడు, స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ (ఎస్ఐబీ) మాజీ ఓఎస్డీ ప్రభాకర్‌రావు, మరో ముఖ్య నిందితుడు అరువెల శ్రవణ్‌రావును విదేశాల నుంచి రప్పించేందుకు మార్గం సుగమమైంది. వారిద్దరిపై రెడ్‌కార్నర్ నోటీసు జారీ అయింది. ఈ మేరకు ఇంటర్నేషనల్ పోలీస్ (ఇంటర్‌పోల్) నుంచి సీబీఐ ద్వారా తెలంగాణ సీఐడీకి తాజాగా సమాచారం అందింది. ఈ నేపథ్యంలో వారిద్దరిని వీలైనంత తొందరగా తీసుకొచ్చే విషయమై హైదరాబాద్ పోలీసులు కేంద్ర హోం, విదేశీ వ్యవహారాల శాఖల ద్వారా సంప్రదింపులను ముమ్మరం చేశారు. రెడ్‌కార్నర్ నోటీసుల జారీ అంశాన్ని యునైటెడ్ స్టేట్స్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీకి సమాచారం అందించే పనిలో నిమగ్నమయ్యారు. ఈ సమాచారం డీహెచ్ఎస్‌కు చేరితే వారిద్దరిని అమెరికాలో ప్రొవిజినల్



(తాత్కాలిక) అరెస్ట్ చేయొచ్చు. అనంతరం డిపోర్టేషన్ ప్రక్రియ ద్వారా భారత్‌కు పంపించే అవకాశముంది. అయితే ప్రొవిజినల్ అరెస్ట్‌ను అక్కడి న్యాయస్థానంలో వారు సవాల్ చేసే అవకాశం లేకపోలేదు. రాజకీయ కక్ష సాధింపులో భాగంగా తమను వేధిస్తున్నారని నిందితులు పిటిషన్ దాఖలు చేసిన నేపథ్యంలో అక్కడి న్యాయస్థానం ఆ అంశాన్ని పరిగణనలోకి తీసుకోవచ్చని భావిస్తున్నారు. అక్కడ ఊరట లభించకపోతే డిపోర్ట్ చేయడం ఖాయమనిపిస్తోంది.

### దుర్గం చెరువు, మియాపూర్ చెరువు ఆక్రమణలపై చర్యలేవీ ?

**మహా :** హైడ్రాపై తెలంగాణ హైకోర్టు మరోసారి ఆగ్రహం వ్యక్తం చేసింది. నిబంధనలకు విరుద్ధంగా ఉంటే కేవలం పేదల ఇళ్లే కాకుండా పెద్దలవి కూడా కూల్చాలని హైకోర్టు వ్యాఖ్యానించింది. పెద్దల భవనాలను కూల్చినప్పుడే ప్రభుత్వ భూములను రక్షించినట్లు అవుతుందని పేర్కొంది. మీరాలం ట్యాంకు పరిసరాల్లో ఇళ్ల యజమానులకు రాజేంద్రనగర్ తహసీల్దార్ ఇచ్చిన నోటీసులపై హైకోర్టులో పిటిషన్ చేశారు. విచారణ చేపట్టిన జస్టిస్ సీవీ భాస్కర్ రెడ్డి ధర్మాసనం.. దుర్గం చెరువు, మియాపూర్ చెరువుల్లోని ఆక్రమణలను ఎందుకు తొలగించడం లేదని హైడ్రాను ఉన్నత న్యాయస్థానం ప్రశ్నించింది. చెరువుల పరిరక్షణ మంచి విషయమే అయినా చట్టం దృష్టిలో అందరూ సమానమేనని తెలిపింది. మీరాలం ట్యాంకు చెరువు పరిసరాల్లో నిర్మాణాలు ప్రభుత్వ స్థలంలో ఉంటే తగిన చర్యలు తీసుకోవాలని న్యాయస్థానం ఆదేశించింది.

# చిన్నారులను విక్రయిస్తున్న 9 మంది అంతరాష్ట్ర ముఠా సభ్యుల అరెస్టు

## 10 మంది చిన్నారులను రెస్క్యూ చేసిన పోలీసులు

### వివరాలు వెల్లడించిన రాచకొండ సిపి సుధీర్ బాబు

**ఎల్బీ నగర్,మహా:** చిన్నారులను విక్రయిస్తున్న అంతరాష్ట్ర ముఠాలోని మరో 9 మందిని రాచకొండ ఎస్ఓటీ పోలీస్ లు, చైతన్యపురి పోలీసులు అరెస్టు చేసి వారి నుండి 10 మంది చిన్నారులను కాపాడారు. బుధవారం ఎల్బీనగర్ లోని సీపీ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాచకొండ సిపి సుధీర్ బాబు వివరాలు తెలిపారు. ఫిబ్రవరి నెలలో చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో కందుల కృష్ణవేణి, తన గ్యాంగ్ సభ్యులైన దీప్తితో పాటు మరికొంత మంది గ్యాంగ్ సభ్యులతో కలిసి దేశంలో వివిధ రాష్ట్రలల్లో చిన్నారులను అక్రమ రవాణా చేస్తు విక్రయిస్తున్నారు.వీరిపై నిఘా పెట్టిన చైతన్యపురి పోలీసులు, మల్కాజిగిరి ఎస్ఓటీ పోలీసులు చిన్నారులకు అమ్మే మాఫీయాను ఫిబ్రవరి 24న అరెస్టు చేసి 11 మంది గుజరాత్ ముఠాను కటకటాల్లోకి పంపించారు.ఈ మూఠాపై ప్రత్యేక నిఘా పెట్టిన పోలీసులు జైలులో ఉన్న కోలా కృష్ణవేణి, దీప్తి, వందనలను కస్టడీలోకి తీసుకుని మరింత విచారణ చేశారు.దీంతో పోలీస్ కస్టడిలో వివిధ ప్రాంతాల్లో ఎక్కువ సంఖ్యలో శిశు అమ్మకాలకు పాల్పడినట్లు అంగీకరించారు. మొత్తం 25 మంది శిశువులను అక్రమంగా సేకరించి విక్రయించినట్లు ఒప్పుకున్నారు. పోలీస్ల కస్టడిలో ఉన్న కోలా కృష్ణవేణి, దీప్తి ఇచ్చిన సమాచారం మేరకు మలక్ పేట్ చెందిన సోము అమూల్య (29) నగరంలో ఆశా వర్కర్ గా పని చేస్తుంది. గతంలో దీప్తితో కలిసి అమూల్య 10 మంది శిశువులను (4 బాలురు) 6 బాలికలను వివిధ ప్రాంతాలను తీసుకువచ్చి విక్రయించినట్లు సమాచారం ఇచ్చింది. ఈ మేరకు పోలీసులు ప్రధాన నిందితురాలు అయిన అమూల్యను బుధవారం అరెస్టు చేసి విచారణ చేయగా ఆమె 8 మంది శిశువలను 4 బాలురు, 4



బాలికలు అక్రమ సేకరణ చేసి విక్రయించినట్లు అంగీకరించింది. వీరిలో పోలీసులు 3 బాలికలు, 1 బాలురు రక్షించినట్లు పోలీసులు తెలిపారు. దేశంలోని ముంబై, కాన్పూర్, రాయ్పూర్, మహారాష్ట్రలోని అమరావతి, హైదరాబాద్ నుండి శిశువులను కొనుగోలు చేసి కోల్కత్తా, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, గుంటూరు ప్రాంతాల్లో చిన్నారులకు విక్రయించినట్లు తెలిపారు. ఆడపిల్లకు రూ.3 లక్షలు,మగ పిల్లాడికి రూ.5 లక్షల వరకు విక్రయిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. చిన్నారులను విక్రయిస్తున్న ముఠా లోని కొత్తపేట మారుతినగర్.కు చెందిన జాన్పల్లి కార్తీక్ గాంధీ హాస్పిటల్ ల్యాబ్ టెక్నీషియన్ గా పనిచేస్తున్నాడు. కార్తీక్ తో పాటు, నగరంలోని ఘాన్సీ బజార్ కు చెందిన సజ్జన అగర్వాల్, అబ్దుల్లాపూర్ మెట్ కు చెందిన బాణాల మంగయ్య, ఆసిపాబాద్ కు చెందిన బోదాసు నాగరాజు, నేరేడ్ మెట్ చెందిన రామారం అశోక్, మైలార్ దేవులపల్లి కి చెందిన షేక్ ఇస్మాయిల్, నిజాంపేటకు చెందిన మాచర్ల వంశీ కృష్ణను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ చేశారు. ఇందులో పిల్లలను దత్తత తీసుకున్న మరో 17 మంది తల్లిదండ్రులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు వారి వద్ద 9 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.ఈ మేరకు పిల్లలని సీడబ్ల్యూసీ (చైల్డ్ వెల్ఫేర్ కమిటి) అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.



# ఎల్బీనగర్ కారు భీభత్సం

## ఇద్దరికి తీవ్ర గాయాలు

### మద్యం మత్తులో బైక్ ను కిలోమీటర్ వరకు ఈడ్చుకెళ్లిన తాగుబోతు

**ఎల్బీనగర్,మహా:** ఎల్బీనగర్ మన్సూరాబాద్ లో కారు భీభత్సం సృష్టించింది.సహారా సమీపంలో ఓ బైక్ ను ఢీకొన్న కారు కిలో మీటర్ మెరా ఆ బైక్ ను ఈడ్చుకెళ్తున్న ఈడ్చికెళ్తున్న అయ్యప్ప స్వామి టెంపుల్ వరకు వెళ్లి అక్కడ పలు బైక్ లను ఢీకొని కారును ఢీకొని ఆగిపోయింది.అయితే మొదట ఢీకొట్టిన బైక్ పై దివ్యాన్స్ అనే యువకుడికి తీవ్ర గాయాలు అయ్యాయి.కారు నడిపిన వ్యక్తి రాక్ టౌన్ కాలనీలో నివాసం ఉంటున్న బోర్ వెల్ వ్యాపారీ ప్రభాకర్ రెడ్డి కాగా మద్యం మత్తులో ఇలా భీభత్సం సృష్టించాడు.ఈ ప్రమాదం లో ప్రభాకర్ రెడ్డికి సైతం గాయాలు అయ్యాయి.గాయమపడిన ఇద్దరిని పోలీసులు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అయితే కారు బైక్ ను ఈడ్చుకెళ్లిన సమయంలో నిప్పుల కక్కుతూ వెళ్ళింది దీంతో ఆ రోడ్డున వెళ్లే వాహనదారులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు.

# ప్రజారంజక బడ్జెట్

## టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర అభివృద్ధికి ఊతం కల్పించే విధంగా బడ్జెట్ రూపకల్పన జరిగిందన్నారు. బడ్జెట్లో సాగునీటికి.. మున్సిపల్ పట్టణాభివృద్ధి కి అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ప్రారంభించాలని నిర్ణయించడం..విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తుంది అనడానికి నిదర్శనమన్నారు. దావోస్ లో 1.78 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించిన తెలంగాణ పారిశ్రామిక రంగంలో మరింత ప్రోత్సాహానికి రూ.3527 కోట్లు కేటాయించిందని, గత బిఆర్ఎస్ ప్రభుత్వం వలే ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను పక్కదారి పట్టించకుండ కఠినమైన చర్యలు తీసుకుందన్నారు. ఎస్సీ సంక్షేమానికి 40,234 కోట్లు ,ఎస్టీ సంక్షేమానికి 17169 కోట్లు వెనకబడిన తరగతుల శాఖకు 11405 కోట్లు, మైనార్టీ సంక్షేమానికి 3591 కోట్లు కేటాయించి బడుగు బలహీనవర్గాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. ఇప్పటికే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు,ఎస్సీ వర్గీకరణ చేపట్టి మాది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వం అని నిరూపించుకున్నామన్నారు.

# రాహుల్‌గాంధీ ఆదేశాలతోనే ఎస్సీ వర్గీకరణ



(మొదటిపేజీ తరువాయి)

199 పేజీలతో ఓ నివేదికను కమిషన్ ఇచ్చిందని అన్నారు. ఎస్సీలను మూడు గ్రూపులుగా విభజించారని తెలిపారు. వర్గీకరణ..ఎవరికీ వ్యతిరేకం కాదు.. మాదిగలకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దడమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. గతంలో వర్గీకరణపై తాను అసెంబ్లీలో ప్రశ్నిస్తే.. తనను సభ నుంచి బయటకు పంపించారని గుర్తుచేశారు. వర్గీకరణపై సుప్రీంకోర్టులో బలంగా తమ ప్రభుత్వం వాదన వినిపించడంతోనే సాధ్యమైందని ఉద్ఘాటించారు. ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ తనకు మంచి మిత్రుడని..ఆయన అంటే తనకు ఎంతో అభిమానమని తెలిపారు. మంద కృష్ణకు తనపై కంటే కూడా ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్రమంత్రి కిషన్ రెడ్డిలపై అభిమానం పెంచుకున్నారని చెప్పారు.

**బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడా వర్గీకరణ జరగలేదు**

బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడ వర్గీకరణ జరగలేదు.. మందకృష్ణ ఈ విషయం గుర్తించుకోవాలని అన్నారు. వర్గీకరణ తేల్చేవరకు కొత్త నోటిఫికేషన్ ఇవ్వలేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. మాదిగ బిడ్డను ఓయూకు, బాసర ఐఐటీకి వీసీలుగా తాము నియమించామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. ఏది ఏమైనా సరే అనే తమ ప్రభుత్వం వర్గీకరణ చేసిందని చెప్పారు. అవకాశం వచ్చిన దానిని మీరు ఉపయోగించుకోండి. పది మందికి సహాయం చేసేలా పనిచేయాలని సూచించారు. అప్పుడే మరో పదిమందికి అవకాశాలు వస్తాయన్నారు. తాను సీఎంగా ఉన్నంత వరకు మీవాడే ఉన్నారనుకోవాలని చెప్పారు. తాను కేవలం పేరు మాత్రమే కోరుకుంటానని తెలిపారు. ఈ ప్రభుత్వం మీదే.. మీ సంక్షేమం, అభివృద్ధికి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. పిల్లలను బాగా చదివించండి.. ప్రభుత్వం అండగా ఉంటుందని మాటిచ్చారు. రాహుల్‌గాంధీ కోసం ఒక భారీ బహిరంగ సభ పెట్టాలని కోరారు. విజయోత్సవ సభ పెట్టండి..అభినందనలు చెప్పాలని అన్నారు. గాంధీ కుటుంబం మీ నుంచి కోరుకునేది అభినందనలు మాత్రమేనని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# మైహోమ్స్ అధినేత పై చర్యలు తీసుకోవాలి

## న్యాయవాది కమతం నాగార్జున



**మేళ్లచెరువు, మహా:** మేళ్లచెరువు రెవిన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 876లో10 ఎకరాల ప్రభుత్వ భూమికి ఫోర్జరీ పత్రాలతో సేల్ డీడ్ నిర్వహించిన మైహోమ్ సిమెంట్స్ చైర్మన్ జూపల్లి రామేశ్వరావు, ప్రభుత్వ భూమి రిజిస్టర్ కు సహకరించిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ న్యాయవాది కమతం నాగార్జున హుజూర్నగర్ ఆర్డిఓ శ్రీనివాసులు కు మంగళవారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ప్రభుత్వ భూమిని ఏ విధంగా ఫోర్జరీ పత్రాలతో రిజిస్ట్రేషన్ నిర్వహించారు..?ఆ భూమిలో అక్రమంగా చేపట్టిన నిర్మాణాల వివరాలు, గ్రామ పంచాయతీ పన్ను ఎగవేతపై ఆధారాలతో లిఖిత పూర్వకంగా వినతి పత్రం ఆర్డీవోకు అందజేశారు. అనంతరం న్యాయవాది కమతం నాగార్జున మాట్లాడుతూ మైహోమ్ సిమెంట్స్ అధినేత జూపల్లి రామేశ్వరరావు బంధువు రౌతు భుజంగరావు పేరిట మేళ్లచెరువు రెవిన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 876 లో గల 10ఎకరాల ప్రభుత్వ భూమికి ఫోర్జరీ పత్రాలు సృష్టించారని ఆరోపించారు.ఈ సర్వే నెంబర్లు మొత్తం 446 ఎకరాల ప్రభుత్వ బంచారాయి భూమి ఉండగా, 10 ఎకరాల ప్రభుత్వ భూమి హైదరాబాద్ కు చెందిన రౌతుభుజంగరావు అనే వ్యక్తి మైహోమ్ అధినేత జూపల్లి రామేశ్వరావుకు విక్రయించినట్లుగా రెవిన్యూ, సబ్ రిజిస్టర్ అధికారులను తప్పుదోవ పట్టించి ప్రభుత్వ భూమికి సెల్ డిడ్ నిర్వహింసినట్లు పేర్కొన్నారు.అనంతరం సేల్ డిడ్ నిర్వహించిన ప్రభుత్వ భూమిని లావుని పట్టాగా మైహోమ్ సిమెంట్స్ పేరిట రెవిన్యూ రికార్డులు,పహానిల్లో అధికారులు నమోదు చేశారు. ఎటువంటి క్రయవిక్రయాలకు అవకాశం లేని, నిషేధిత జాబితాలో ఉన్న ప్రభుత్వ భూమికి ఫోర్జరీ పత్రాలు సృష్టించి అట్టి భూమిని కబ్జా చేసి మైహోమ్ సిమెంట్ పరిశ్రమ ప్రధాన గేటు నిర్మించారని, అట్టి అక్రమ నిర్మాణాలను వెంటనే కూల్చివేయాలని ఫిర్యాదు దారుడు పేర్కొన్నాడు.10 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేయడమే కాకుండా, అక్రమ నిర్మాణాలు చేపట్టి గ్రామపంచాయతీకి పన్ను కూడా చెల్లించడం లేదని న్యాయవాది నాగార్జున ఆరోపించారు. ప్రస్తుతం ఈ పది ఎకరాలకు దక్షిణ హద్దుగా ఉన్న డొంకదారిని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని, అట్టి అక్రమ నిర్మాణాలను వెంటనే నిలుపుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూమికి సేల్ డీడ్ నిర్వహించిన మైహోమ్స్ అధినేత జూపల్లి రామేశ్వరరావు సహా మరో 6 మందిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. మైహోమ్ సిమెంట్స్ యాజమాన్యం నుండి 10 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని ఆయన ఆర్డిఓను కోరారు.

# మిషన్ భగీరథ నీటీ సరఫరాలో ఆటంకాలు ఉండవద్దు





కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అగ్రహారం

**వేములవాడ, మహా:** జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు సరఫరాలో ఆటంకాలు ఉండకుండా చూసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. బుధవారం అగ్రహారం సమీపంలోని మిషన్ భగీరథ ఫిల్టర్ బెడ్, వాటర్ ట్రీట్ మెంట్ ప్లాంట్, నీటి శుద్ధి, సరఫరా, ల్యాబ్ ను పరిశీలించారు. నీటిని శుద్ధి చేసే ప్రక్రియను క్షుణ్ణంగా కలెక్టర్ కు మిషన్ భగీరథ ఇంజనీర్లు వివరించారు. పంపింగ్ సామర్థ్యం, స్టోరేజి వంటి వివరాలను జిల్లా కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. ప్రస్తుత వేసవి ఉన్నందున ప్రతి ఇంటికి నల్ల నీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. రోజు నీటి శుద్ధి కేంద్రాల నుండి నీరు సరఫరా జరిగేలా మిషన్ భగీరథ ఇంజనీర్లు చర్యలు తీసుకోవాలన్నారు. రోజూ రెండు సార్లు జిల్లాలోని OHSR లను మిషన్ భగీరథ గ్రిడ్ ఇంజనీర్ నింపాలన్నారు. నీటి నాణ్యతను ప్రతి రోజూ నాలుగు సార్లు పరిశీలించాలని సూచించారు. జిల్లాలో ఏఏ గ్రామాలకు త్రాగునీరు వెళ్లడం లేదు. పూర్తిగా తెలుసుకోవాలన్నారు. త్రాగునీరు వెళ్లని గ్రామాలకు.మిషన్ భగీరథ నీరు వెళ్లేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. తనిఖీలో మిషన్ భగీరథ ఇంట్రా, గ్రిడ్ కార్య నిర్వాహక ఇంజనీరులు జానకి, శేఖర్ రెడ్డి, వేములవాడ మున్సిపల్ కమిషనర్ అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.



# రైతులను ఆత్మ బలిదానాలుగా మారుస్తున్న ప్రజా పాలన

### షేక్ మహబూబ్ అలీ

**హుజూర్ నగర్, మహా:** రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా పడ్డాయి నీళ్లు ఉన్నాయి ఎండల వల్ల పంటలు ఎండుతున్నాయని అని కాంగ్రెస్ నాయకులు మాట్లాడటం సిగ్గు చేటు అని పాలకవీడు మండల షోషల్ మీడియా అధ్యక్షులు షేక్ మహబూబ్ అలీ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వాటర్ మేనేజ్మెంట్ తెలియక రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కేసీఆర్‌మిషన్‌కాకతీయద్వారాచెరువులునింపారని కాంగ్రెస్ పాలనలో ఆయకట్టు కింద ఉన్న పొలాలు కూడా ఎండిపోతున్నాయి. మార్చి లోనే ఇలా ఉంటే ఏప్రిల్ మేలో రైతుల పరిస్థితి దయనీయంగా ఉంటుంది ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయడు 10వేల క్యూసెక్కుల నీళ్లు ఎత్తుకుపోతుంటే చూస్తూ ఊరుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీ అసమర్థత వల్లనే రాష్ట్రంలో కరువు వచ్చింది. హైద్రాబాద్ లో వాటర్ ట్యాంకర్లు పెరిగాయి కేసీఆర్ రైతుల కోసం కాళేశ్వరం ప్రాజెక్ట్ కట్టించారు కేసీఆర్ మీద కోపంతో ఆ నీళ్లు వాడుకోక పోవడం కరెక్ట్ కాదు.

# తెలంగాణ సాయుధ రైతాంగ ఉద్యమకారునీ మల్లు స్వరాజ్యం



**మెల్లచెర్వు, మహా :** మేళ్లచెరువు మండల కేంద్రంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ యోధురాలు కామ్రేడ్ మల్లు స్వరాజ్యం మూడవ వర్ధంతి సందర్భంగా సిపిఎం పార్టీ మండల కార్యదర్శి వటేపు సైదులు సమక్షంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఇట్టి కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఆమె రైతాంగానికి ఎనలేని సేవలు చేశారని చెప్పుకొచ్చారు వారిని ఈరోజు గుర్తు చేసుకోవడం అనందదాయ కమని సిపిఎం పార్టీ తరపున రైతాంగం తరపున ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నామని అన్నారు.ఇట్టి కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు కార్యకర్తలు అన్ని విభాగాల సంఘాల నేతలు పాల్గొన్నారు.






# చక్రయ గౌడ్ హత్యను సీరియస్ గా తీసుకుంటున్నాం

- సొంత బంధువులే దారుణానికి పాల్పడడం బాధాకరం
- తెలంగాణ రాష్ట్ర ఐజి సత్యనారాయణ

**సూర్యాపేట, మహా:** సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం మిరియాల గ్రామంలో మాజీ సర్పంచ్ మంచు చక్రయ గౌడ్ హత్యను పోలీస్ శాఖ సీరియస్ గా తీసుకుంటున్నట్లు తెలంగాణ రాష్ట్ర ఐజి సత్యనారాయణ వెల్లడించారు. బుధవారం ఉదయం మిరియాల గ్రామాన్ని సందర్శించి కుటుంబాన్ని పరామర్శించి మాట్లాడుతూ సొంత అల్లుళ్ళు మనవళ్లు కలిసి బంధువులే అతి కిరాతకంగా హత్య చేయడం దారుణమని అన్నారు. కుమార్తె ఫిర్యాదు మేరకు 19 మంది పై కేసు నమోదు చేసి, విచారణ చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం గ్రామంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులకు పోలీస్ శాఖ ఎల్లవేళల అండదండగా ఉంటుందని తెలిపారు. ఆయన వెంట జిల్లా ఎస్పీ నరసింహ డీఎస్పీ రవికుమార్ సీఐ శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ అద్భుతంగా ఉంది

## కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి చకిలం రాజేశ్వర రావు



**సూర్యాపేట, మహా:** తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ 3,04,965రు వ్యయంతో సమగ్ర అభివృద్ధి, సామాజిక న్యాయం పాటిస్తూ, ప్రజలకు ఆర్థిక స్థైర్యాన్నిస్తూ, ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తిదాయకంగా ఉంది అని రాష్ట్ర కాంగ్రెస్ అధికారప్రతినిధి చకిలం రాజేశ్వర రావు అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత ప్రవేశ పెట్టిన బడ్జెట్ లో కెల్లా ఇది అత్యున్నతమైన బడ్జెట్ అని ఆయన అన్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తెలంగాణ శాసనసభలో బుధవారం ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్ర అభివృద్ధికి సూచికగా ఉంటూ నభూతో న భవిష్యత్ గా ఉందనీ, ఇంత అత్యుత్తమమైన బడ్జెట్ ప్రవేశపెట్టడం వలన బిఆర్ఎస్ పార్టీ వారికి కంటిమీద కునుకు లేకుండా పోయిందని రాజేశ్వర రావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సునిశిత దృష్టితో పలుమార్లు క్షుణ్ణంగా అధ్యయనం చేసి, ఆలోచించి, ఈ బడ్జెట్ లో అతిముఖ్యమైన రంగాలవారికి మునుపెన్నడూ లేని విధంగా షెడ్యూల్డ్ కులాల సంక్షేమానికి, పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధికి, వ్యవసాయం, నీటిపారుదల రంగాలకు, ఎలక్ట్రిసిటీ , సాంప్రదాయ ఇతర ఇంధనాలకు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కు, షెడ్యూల్డ్ తెగల సంక్షేమానికి, ఆరోగ్య రంగానికి, వెనుకబడిన తరగతుల సంక్షేమానికి, రోడ్లు అండ్ భవనాల అభివృద్ధికి, పౌర సరఫరాలకు, మైనార్టీ సంక్షేమం కోసమే కాకుండా ఇంకా అనేక రంగాలకు సమృద్ధిగా తగిన నిధులు కేటాయించడం పట్ల తెలంగాణ రాష్ట్ర ప్రజలు సంతృప్తిగా ఉన్నారని ఆయన తెలియజేశారు. ఈ బడ్జెట్ లో గ్రామీణ పునరుద్ధరణ, వ్యవసాయాధారిత ఆర్థిక వ్యవస్థను బలపరచడం, ప్రాథమిక సేవల పై సంపూర్ణ ప్రాధాన్యతనిచ్చి. విద్య, ఆరోగ్యం, మహిళా సాధికారత మరియు యువజనుల సంక్షేమానికి సంబంధించి విస్తృత కేటాయింపులు జరపడమనేది రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వ కార్యక్రమాలను ప్రతిబింబిస్తున్నాయి అని చెప్పవచ్చని చకిలం అన్నారు. పర్యావరణ సంరక్షణ, చేనేత వంటి సాంప్రదాయిక రంగాలకు కూడా మద్దతు ఇవ్వడం ద్వారా సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడే లక్ష్యం కూడా ఈ బడ్జెట్లో స్పష్టంగా కనిపిస్తుంది అని అన్నారు. ఒక పక్క ఆర్థికంగా ఇబ్బందికర పరిస్థితి ఉన్నా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఎస్సి, ఎస్టీ, బిసి, మైనారిటీ వర్గాల అభివృద్ధే ధ్యేయంగా కేటాయింపులు జరపడం, అదే విధంగా నీటిపారుదల, విద్య, వ్యవసాయం, ఆరోగ్యం, లాంటి రంగాలకు కూడా తాము చెప్పిన విధంగా బడ్జెట్ లో పూర్తిస్థాయి కేటాయింపులు జరపడం అనేది ప్రభుత్వం తమకు ఈ వర్గాల పట్ల ఉన్నటువంటి చిత్తశుద్ధిని తెలియజేస్తుంది అని ఆయన అన్నారు. మొత్తానికి ఈ బడ్జెట్ ను పరిశీలిస్తే తెలంగాణ ప్రజల అభివృద్ధి సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యతనిచ్చి, సమతుల్య పురోగతిని ఈ బడ్జెట్ నిర్ధారిస్తుంది అని తెలిపారు. ఈ ప్రణాళికల అమలు ద్వారా రాష్ట్రం అన్ని రంగాలలో మరింత ఎదగడానికి సహాయపడుతుంది అని చకిలం రాజేశ్వర రావు అన్నారు.



# సుందరయ్య కాలనీలో నాసిరకం డ్రైనేజీ నిర్మాణం

**మోత్కూర్, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలోని సుందరయ్య కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణంలో భారీ అక్రమాలు వెలుగుచూశాయి. కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా పనులను నిర్వహిస్తూ, ఇసుకకు బదులుగా డస్ట్, కంకర కలిపి మోరిని నిర్మిస్తున్నట్లు స్థానికులు గుర్తించారు. కాంట్రాక్టర్ పనితీరును నిలదీసిన కాలనీవాసులకు అతను నిర్లక్ష్యంగా స్పందించాడు. క్వాలిటీ కంట్రోలర్ వారు వచ్చి పరిశీలిస్తారు, మీకు ఏంటని అంటూ సమాధానం ఇచ్చాడు. పనుల్లో నాణ్యతా లోపం స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ, అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రజాధనం వృథా అవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ తీరును నిరసించిన కాలనీవాసులు, తక్షణమే కాంట్రాక్టర్‌ను తొలగించి కొత్త కాంట్రాక్టర్ ద్వారా నాణ్యమైన నిర్మాణం చేపట్టాలని అధికారులను కోరుతున్నారు. ప్రజాధనం వృథా కాకుండా చూడాలని, నాణ్యత ప్రమాణాలను పాటించేలా చర్యలు తీసుకోవాలని పట్టణ అభివృద్ధి అధికారులను వేడుకుంటున్నారు. ఈ విషయంలో అధికారుల చర్యలు ఏంటో, కాంట్రాక్టర్‌పై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాలి. అని ప్రజలు అంటున్నారు

# రజాకార్లను ఎదురొడ్డి పోరాడిన వీర వనిత

- కామ్రేడ్ మల్లు స్వరాజ్యం..సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు బొమ్మిడి లక్ష్మీనారాయణ





**సూర్యాపేట, మహా:** తెలంగాణ సాయుధ పోరాటంలో విసునూరు దేశ్ ముఖ్‌లు, రజకారులు, భూస్వాములకు వ్యతిరేకంగా 13 సంవత్సరాల చిన్నతనంలోనే తుపాకిని చేతబట్టి పోరాడిన తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, ధైర్య శీలి, త్యాగశీలి వీరవనిత కామ్రేడ్ మల్లు స్వరాజ్య మని సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు బొమ్మిడి లక్ష్మీనారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని వాణిజ్య భవన్ 48వ వార్డు నందు సిపిఎం పార్టీ శాఖ ఆధ్వర్యంలో బుధవారం బొమ్మిడి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో కామ్రేడ్ మల్లు స్వరాజ్యం మూడవ వర్ధంతి సందర్భంగా మజ్జిగను పంపిణీ చేసి మాట్లాడారు. తెలంగాణ సాయుధ పోరాట యోధుడు భీమిరెడ్డి నరసింహారెడ్డి సోదరిగా ప్రజాస్వామ్యంలో ప్రజల మధ్య జీవిస్తూ సామ్రాజ్యవాదుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన ధీశాలి అని, తాడిత, పీడిత ప్రజల పక్షాన పోరాడిన మహనీయురాలని కొనియాడారు. మల్లు స్వరాజ్యం సోదరుడు తెలంగాణ సాయుధ పోరాట యోధులు భీమిరెడ్డి నరసింహారెడ్డి తో కలిసి పేద ప్రజలకు రెండు లక్షల ఎకరాల భూమిని పంపిణీ చేసి పేదల పెన్నిధిగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని కొనియాడారు.భూమి కొరకు, విముక్తి కొరకు పేద ప్రజల పక్షాన ఉద్యమానికి కదం తొక్కారని అన్నారు.ఈ కార్యక్రమంలో బొమ్మిడి అశోక్, దేవత్ కిషన్ నాయక్, బోళ్ల సోమిరెడ్డి, మోహన్ రెడ్డి, బంధు రుద్రమ్మ, చిత్రం భద్రమ్మ, సోమగాని శంభయ్య, చల్లా శ్రీనివాస్, చల్లా శేఖర్, అర్వపల్లి, తదితరులు పాల్గొన్నారు.

# భక్తుల ఇంటి వద్దకే భద్రాద్రి శ్రీ సీతారామ కళ్యాణ తలంబ్రాలు



వరంగల్ 2 డిపో మేనేజర్ జ్యోత్స్న

ములుగు, మహా : తెలంగాణ ఆర్టీసీ వరంగల్ 2డిపో లాజిస్టిక్ ద్వారా భక్తుల ఇంటి వద్దకే శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవ తలంబ్రాలు అందుబాటు లోకి వస్తాయని, బుకింగ్ చేసుకునే అవకాశం కల్పించినట్టు వరంగల్ 2 డిపో మేనేజర్ వి.జ్యోత్స్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తలంబ్రాలు కావాల్సిన భక్తులు బుకింగ్ కోసం ములుగు బస్టాండ్ కార్గో లాజిస్టిక్స్ ఆఫీస్ నందు, బస్టాండ్ కంట్రోలర్ బైకాని మోహన్ 9059662555 నెంబరుకు కానీ బుక్ చేసుకొని రూ. 151లు చెల్లించి రశీదు పొందాలని సూచించారు. శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణం అనంతరం తమ ఇంటి వద్దకు కార్గో ఏజెంట్ ద్వారా తలంబ్రాలు పంపిణీ చేస్తామని తెలిపారు. భద్రాచలంలోని శ్రీ సీతారాముల కళ్యాణానికి వెళ్లలేని భక్తులు ఈఅవకాశాన్ని వినియోగించుకొని రాములవారి ఆశీస్సులు పొందాలని తెలిపారు.

# ప్రశాంత వాతావరణంలో రంజాన్ ఉపవాస దీక్షలు జరుపుకోవాలని

- మహేశ్వరం డిసిపి సునీత రెడ్డి..ప్రార్థన మందిరాల వద్ద గుమ్మి కూడ వద్దు అసత్య ప్రచారాలను నమ్మవద్దు



**రంగారెడ్డి జిల్లా, మహా:** ప్రశాంత వాతావరణంలో రంజాన్ ఉపవాస దీక్షలు నిర్వహించుకోవాలని మహేశ్వరం డిసిపి పిలుపునిచ్చారు. మంగళవారం రాత్రి బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రాంతాన్ని సందర్శించిన మహేశ్వరం డిసిపి సునీత రెడ్డి. అనంతరం ఆమె మాట్లాడుతూ... ముస్లిం సోదరులు ప్రార్థన సమయాల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలను ఎవరు కూడా నమ్మవద్దని తెలిపారు. ప్రార్థన మందిరాల వద్ద ఎక్కువ మంది గుమ్మి కూడకుండా చూసుకోవాలని తెలిపారు. బాలాపూర్, పహాడీ షరీఫ్, ఎర్రకుంట, జల్పల్లి ప్రాంతాలలో అన్ని కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డిసిపి తెలిపారు. ఈ ప్రాంత ప్రజలు పోలీసులకు అన్ని విధాల సహకరించాలని ఆమె కోరారు. రంజాన్ మాసం పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని పోలీసులకు ఆమె సూచించారు.



# లొంగిపోయిన ఇద్దరు మావోయిస్టులకు రివార్డులు అందజేసిన ఎస్పీ శబరీష్

**ములుగు, మహా :** సరెండర్ కమ్ రిహాబిటేషన్ లో భాగంగా ములుగు జిల్లా ఎస్పీ ముందు లొంగిపోయిన ఇద్దరు మావోయిస్టులకు ఎస్పీ డాక్టర్ పి.శబరీష్ బుధవారం రివార్డులు అందజేశారు. ప్రభుత్వ నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీ నేషనల్ పార్క్ ఏరియా కమిటీ సభ్యురాలు, ఒడిస్సా రాష్ట్రం మల్కాన్ గిరి జిల్లా కలిమెల మండలానికి చెందిన అలువ స్వర్ణ అలియాస్ స్వర్ణక్క, ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం గ్రామానికి చెందిన మావోయిస్టు నేత దివంగత కటకం సుదర్శన్ భార్య పుల్సం పద్మ అలియాస్ ఊరే, అలియాస్ గంగక్క ఇటీవల ములుగు జిల్లా పోలీసుల ఎదుట లొంగిపోయారు. స్వర్ణకు రూ.4లక్షల విలువగల డీడీ, పుల్సం పద్మకు రూ.5లక్షల విలువ గల డీడీలను అందజేశారు. భవిష్యత్తులో ఏ అవసరం ఉన్నా ప్రభుత్వం తరఫున అండగా ఉంటామని, సహకరిస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వం కల్పించిన సరెండ్ కం రీహాబిలిటేషన్ స్కీం ను మావోయిస్టులు సద్వినియోగం చేసుకొని లొంగిపోవాలని, కుటుంబ సభ్యులతో ప్రశాంతంగా గడపాలని ఎస్పీ పిలుపునిచ్చారు.

# పార్టీ జెండాను ధ్వంసం చేయడం ఏమిటి..?

- షాద్ నగర్ కు కొత్త సంస్కృతి పరిచయం
- బీఆర్ఎస్ జెండా ధ్వంసంపై నటరాజన్ ఆగ్రహం
- షాద్ నగర్ పోలీస్ స్టేషన్లో బీఆర్ఎస్ శ్రేణుల ఫిర్యాదు
- దాడికి పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి



**రంగారెడ్డి జిల్లా, మహా :** షాద్ నగర్ ప్రాంతంలో మొట్టమొదటిసారిగా రాజకీయ సంస్కృతి చెడిపోతుందని కొత్త సంస్కృతిని పరిచయం చేస్తూ ఇతర పార్టీల జండా దిమ్మెలను ధ్వంసం చేయడం దురదృష్టకరమని టిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎమ్మెస్ నటరాజన్, పట్టణ మున్సిపల్ మాజీ చైర్మన్ కె నరేందర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఫరుక్ నగర్, సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద టిఆర్ఎస్ జండా దిమ్మెను ధ్వంసం చేయడం బాధాకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. జెండా ధ్వంసం పై షాద్ నగర్ పోలీస్ స్టేషన్లో టిఆర్ఎస్ శ్రేణులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పట్టణ పార్టీ అధ్యక్షుడు ఎమ్మెస్ నటరాజన్ మాట్లాడుతూ.. మునిపెన్నడూ లేనివిధంగా కొత్త సంస్కృతితో జెండా దిమ్మెలను ధ్వంసం చేయడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. ఎన్నికల సమయంలోనే రాజకీయ పార్టీలు ఉంటాయని, ఆ తర్వాత అందరూ కలిసికట్టుగా ఉంటారు. కానీ ఇలా పార్టీ జెండాలను ధ్వంసం చేయడం మొట్టమొదటిసారి అని అన్నారు. ఇలాంటి సంస్కృతి మునుపెన్నడు లేదని ఇప్పుడే కొత్తగా పరిచయం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసులు దీనిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని తెలిపారు. సమీపంలోని దర్గా వద్ద ఉన్న సీసీ కెమెరాలు పరిశీలించి, జెండా దిమ్మె పై దాడికి పాల్పడ్డ వారిపై కులంకుశంగా విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నటరాజన్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మన్నె కవిత నారాయణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు లక్ష్మణ్ నాయక్, మాజీ కౌన్సిలర్లు బచ్చలి నరసింహా, కానుగు అనంతయ్య, యుగంధర్, పిల్లి శేఖర్, చింటూ, జూపల్లి శంకర్, నంద కిషోర్, చిన్న యాదగిరి, నాయకులు చెట్ల జంగయ్య, నందిగామ శ్రీనివాస్, గుండు అశోక్, కొండ మల్లేష్, చెర్క శివ, మంగ శ్రీశైలం, వెంకటేష్ గుప్తా, సుశాంత్, రాజు, మహమూద్, నరేందర్, ఉమాపతి, తేజ యాదవ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

# పిచ్చుక ల ఆకలి తీర్చే బర్డ్ ఫీడర్లు

## ఇంట్లో సందడి చేస్తున్న పిచ్చుకలు - ఆనంతుల రమేష్







**కరీంనగర్, మహా:** పిచ్చుకలు ఒకనాడు పంటచేలల్లో, పల్లె ముంగిళ్లలో, ధాన్యపు రాశుల్లో కిలకిలమంటూ సందడి చేసేవి. నాడు గ్రామాలలోని ఇండ్ల ముంగిట ఇవి గుంపులుగుంపులుగా వాలడం ఏదో అలికిడి అవగానే తుర్రుమని ఎగిరిపోవడం వంటి దృశ్యాలు సందడిగా చూడముచ్చటగా ఉండేవి. ఇవి దిగుడు బావులలోకి వేలాడుతూ చెట్లపై కట్టుకున్న గూళ్లు చాలా అద్భుతంగా ఉండేవి. ఇవి పూరిళ్ల చూరులలో గూళ్లు కట్టుకొని జనావాసాలతో మమేకమై ఉండేవి. మానవుడు పెంచుకుంటున్న సాంకేతిక పరిజ్ఞానం వీటి మనుగడకు శాపంగా మారింది. సెల్ తరంగాల రేడియేషన్, కాలుష్యం కారణంగా ఇవి ప్రకృతి నుంచి కనుమరుగవుతున్నాయి. జనావాసాలతో మమేకమై జీవిస్తున్న వీటి విషయాలలో ఇవి మెత్తని పీచు వంటి వాటితో గూడు కట్టుకోవడంతో పాటు ఆ గూడులో గుడ్లను పొదగడం, నోటితో ఆహారాన్ని తెచ్చి తన పిల్లలకు అందిస్తుంటాయి. ఆ పిల్లలకు రెక్కలొచ్చి ఎగిరేంత వరకు జాగ్రత్తగా కాపాడుకుంటూ ఉండే దృశ్యాలు మనకు తరచూ కనిస్తూనే ఉంటాయి. పిచ్చుకలను గుర్తించిన ప్రపంచ దేశాలు ప్రతీ యేడాది మార్చి 20వ తేదిని ప్రపంచ పిచ్చుకల దినోత్సవంగా నిర్వహిస్తున్నాయి. ఈ పిచ్చుకల ప్రాధాన్యతను గుర్తించిన భారత ప్రభుత్వం తపాలా బిళ్లను కూడా విడుదల చేసింది. జనావాసాల మధ్య నివసిస్తున్న పిచ్చుకల మనుగడకు ప్రమాధ ఏర్పడితే అది మానవ మనుగడకు ఎందుకు ప్రమాదం కాదని గుర్తించిన ప్రపంచ దేశాలు ప్రపంచ పిచ్చుకల దినోత్సవంను నాడు పిచ్చుకల మనుగడకు అవసరమైన ప్రాధాన్యత అంశాపై చర్చించి అందుకు అవసరమైన కార్యక్రమాలను చేపడుతున్నారు.

### పిచ్చుక చిన్నదే అయినా దీన్ని బ్రతికించుకోవాలి

అభివృద్ధి చెందుతున్న సాంకేతిక జీవన విధానం వల్ల పిచ్చుకల సంఖ్య ప్రతీయేటా తగ్గుతూపోతోంది. మనిషితో కలిసి జవించే పిచ్చుక జాతి పూర్తిగా అంతరించిపోయే పరిస్థితి మరెంతో దూరం లేకపోలేదు. పిచ్చుక జాతిని రక్షించుకోకుంటే భవిష్యత్తు తరాలకు పిచ్చుక బొమ్మను చూపించి ఇది పిచ్చుక అనే పక్షి, మన ఇండ్లలోనే తిరిగేదని చెప్పాల్సిన పరిస్థితి రానుంది. అలాంటి పరిస్థితి రాకుండా ఉన్న పిచ్చుకలనైనా బ్రతికించుకుందాం.


# ఐపీవోకు సిద్ధంగా ఉన్న రెండు కంపెనీలు ఇవే..




క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా పబ్లిక్ ఇష్యూ చేపట్టేందుకు రెండు కంపెనీలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ జాబితాలో వైట్ గూడ్స్ దిగ్గజం ఎల్‌జీ ఎల్రక్ట్రానిక్స్ ఇండియాతోపాటు మానవ వనరులు, టోల్ ప్లాజా నిర్వాహక సర్వీసుల సంస్థ ఇన్నోవిజన్ లిమిటెడ్ చేరాయి. రెండు కంపెనీలు 2024 డిసెంబర్‌లో సెబీకి ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేశాయి. దక్షిణ కొరియా దిగ్గజం ఎల్‌జీ అనుబంధ సంస్థ ఎల్‌జీ ఎల్రక్ట్రానిక్స్ ఇండియా దేశీ స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్టింగ్‌కు సన్నద్ధమవుతోంది. ఇందుకు ఇప్పటికే రోడ్‌షోలు ప్రారంభించగా..తాజాగా సెబీ నుంచి అనుమతి పొందింది. ఐపీవోలో భాగంగా 15 శాతం వాటాకు సమానమైన 10.18 కోట్ల షేర్లను మాతృ సంస్థ విక్రయానికి ఉంచనుంది. తద్వారా సుమారు రూ.15,000 కోట్లు సమీకరించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఐపీవో పూర్తయితే కార్ల తయారీ దిగ్గజం హ్యుందాయ్ మోటార్స్ ఇండియా తదుపరి దేశీయంగా లిస్టయిన రెండో దక్షిణ కొరియా దిగ్గజంగా ఎల్‌జీ నిలవనుంది. హ్యుందాయ్ గతేడాది అక్టోబర్‌లో లిస్టయింది. ఎల్‌జీ ఇండియా ప్రధానంగా వాషింగ్ మెషీన్లు, లెడ్ టీవీలు, ఏసీలు, రిఫ్రిజిరేటర్లు, మైక్రోవేవ్స్ తదితర పలు కన్జూమర్ ప్రొడక్టులను విక్రయించే విషయం విదితమే. దేశీయంగా నోయిడా, పుణెల్లో తయారీ యూనిట్లను కలిగి ఉంది.

## రుణ చెల్లింపులకు..


టోల్‌ప్లాజా మేనేజ్‌మెంట్ సర్వీసుల కంపెనీ ఇన్నోవిజన్ లిమిటెడ్ ఐపీవోలో భాగంగా రూ.255 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా ప్రమోటర్లు మరో 17.72 లక్షల షేర్లను ఆఫర్ చేయనున్నారు. ఈక్విటీ జారీ నిధులను రుణ చెల్లింపులు, వర్కింగ్ క్యాపిటల్, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది. కంపెనీ ప్రధానంగా మానవ వనరులు, క్లయింట్లకు దేశవ్యాప్తంగా నైపుణ్యాభివృద్ధి శిక్షణ, టోల్ ప్లాజా మేనేజ్‌మెంట్ తదితర సర్వీసులు సమకూర్చుతోంది.



# మరిన్ని శాఖల్లో బంగారం రుణాలు

ప్రముఖ ఎన్‌బీఎఫ్‌సీ సంస్థ శ్రీరామ్ ఫైనాన్స్ బంగారం రుణాల్లో తన మార్కెట్ వాటాను పెంచుకోవడంపై దృష్టి పెట్టింది. బంగారం రుణాల మార్కెట్ వచ్చే ఐదేళ్లలో రెట్టింపు అవుతుందన్న అంచనాల నేపథ్యంలో.. మరిన్ని శాఖల్లో బంగారం రుణాలను ప్రవేశపెట్టనున్నట్టు సంస్థ డిప్యూటీ ఎండీ అన్బుసెల్వన్ తెలిపారు. '2024-25 మూడో త్రైమాసికంలో తమిళనాడులోని పలు ప్రాంతాల్లో శ్రీరామ్ ఫైనాన్స్ నిర్వహణలోని బంగారం రుణ ఆస్తులు (ఏయూఎం) గణనీయంగా పెరిగాయి. మరింత స్థిరీకరణతో రానున్న త్రైమాసికాల్లో మార్కెట్ వాటాను పెంచుకోవాలని అనుకుంటున్నాం. ఇందులో భాగంగా మరిన్ని శాఖలకు బంగారం రుణాల వ్యాపారాన్ని విస్తరించనున్నాం'అని అన్బుసెల్వన్ వివరించారు. బంగారం రుణాలకు డిమాండ్ పెరిగిందని.. వ్యక్తులు, చిన్న వ్యాపార సంస్థలు వేగంగా నిధులు కోరుకుంటున్నట్టు చెప్పారు. సంఘటిత రంగంలో బంగారం రుణ వ్యాపారం మరింత విస్తరించనున్నట్టు అన్బుసెల్వన్ తెలిపారు. తమ బంగారం రుణ కస్టమర్లలో ఎక్కువ మంది మధ్యతరగతి వారేనని, వేతన జీవులు, చిన్న వ్యాపారులు, గ్రామీణ ప్రాంతాల్లోని వర్తకులు ఇందులో ఉన్నట్టు చెప్పారు. ఏక మొత్తంలో రుణ చెల్లింపులు, మూడు నెలలకోసారి వడ్డీ చెల్లించడం, నెలవారీ ఈఎంఐ ఇలా పలు రూపాల్లో బంగారం రుణాలను ఆఫర్ చేస్తున్నట్టు తెలిపారు. వేగంగా రుణాలు జారీ చేసేందుకు వీలుగా ప్రక్రియలను ఆటోమేట్ చేసినట్టు పేర్కొన్నారు.

# భారత్ ఏఐ మిషన్ పార్లమెంట్‌తో ఒప్పందం



భారత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీలో స్వావలంబన దిశగా భారతఏఐ మిషన్ భారత పార్లమెంటుతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. చాట్ జీపీటీని పోలిన లార్జ్ ల్యాంగ్వేజీ మోడల్ (ఎల్ఎల్ఎం)తో సహా స్వదేశీ కృత్రిమ మేధ పరిష్కారాలను అభివృద్ధి చేయడానికి పార్లమెంటు విస్తృతమైన బహుభాషా డేటా సెట్లను ఉపయోగించుకోవాలని ఈ సహకారం లక్ష్యంగా పెట్టుకుంది. స్వదేశీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీలను సృష్టించే అవసరాలను నొక్కి చెబుతూ కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ 'రైసినా డైలాగ్ 2025' సందర్భంగా ఈమేరకు వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ.. 'ఇండియా ఏఐ మిషన్ దేశం ప్రత్యేక అవసరాలను తీర్చే ఏఐ సామర్థ్యాలను నిర్మించడంపై దృష్టి సారించింది. ఓపెన్ ఏఐ వంటి గ్లోబల్ సంస్థల నుంచి ఓపెన్ సోర్స్ టెక్నాలజీల వాడకం దీర్ఘ కాలంలో నిలకడగా ఉండకపోవచ్చు. సొంత దేశీయ ఎల్ఎల్ఎంను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. అందులో భాగంగానే పార్లమెంటుతో భాగస్వామ్యం డేటా సెట్లకు అవకాశం కల్పిస్తుంది. ఇది కృత్రిమ మేధ నమూనాలకు శిక్షణ ఇవ్వడానికి కీలకమైన వనరుగా పనిచేస్తుంది. దూరదర్శన్, ఆలిండియా రేడియో వంటి సంస్థల నుంచి అదనపు డేటాసెట్లు ఈ చొరవకు మరింత తోడ్పాడు అందుతుంది' అని చెప్పారు. లాభాపేక్షలేని సంస్థ నుంచి లాభాపేక్ష సంస్థగా ఓపెన్ఏఐని మార్చడంపై ఎలాన్ మస్క్ తీవ్ర విమర్శలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో నిబంధనలను అతిక్రమించి లాభాపేక్ష సంస్థగా మారితే ఓపెన్ఏఐ తన పేరును కూడా మార్చుకోవాలని వైష్ణవ్ పేర్కొన్నారు. దేశంలో సొంత జీపీయూ (గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్) చిప్‌ను అభివృద్ధి చేయడం చాలా ముఖ్యమని, దీనిపై ప్రభుత్వం ఇప్పటికే పరిశ్రమతో కలిసి పనిచేయడం ప్రారంభించిందని మంత్రి చెప్పారు. స్వదేశీ జీపీయూ సామర్థ్యాన్ని సాధించేందుకు పట్టే కాలపరిమితి గురించి అడిగినప్పుడు వైష్ణవ్ మాట్లాడుతూ మూడు నుంచి ఐదేళ్లలో సహేతుకమైన మంచి సామర్థ్యాన్ని పొందడానికి వీలైన జీపీయూ సాధిస్తామన్నారు.

ఇండోయూఎస్ వెంచర్ పార్ట్‌నర్స్ ఫౌండర్, ఎగ్జిక్యూటివ్ మేనేజింగ్ పార్ట్‌నర్ వినోద్ ధామ్ మాట్లాడుతూ జీపీయూ అభివృద్ధికి మంత్రి ఇచ్చిన గడువు చాలా సహేతుకంగా ఉందన్నారు. భారత్ తన సొంత ఏఐ మోడల్‌ను నిర్మించుకోవడానికి ఓపెన్ఏఐ వంటి ఓపెన్‌సోర్స్ మోడల్స్‌ను ఉపయోగించుకోవాలని, కానీ రహస్య కార్యకలాపాలకు పాశ్చాత్య ఏఐ నమూనాలను ఉపయోగించరాదని ఆయన అన్నారు. భవిష్యత్తులో కంప్యూటింగ్ అవసరాలు పెరుగుతాయని చెప్పారు. అందుకోసం జీపీయూ వృద్ధి చెందాల్సి ఉందని తెలిపారు. ఇండియా సెమీకండక్టర్ మిషన్ తరహా ఫండింగ్‌ను ఈ విభాగంలో ప్రవేశపెట్టాలని సూచించారు. వచ్చే 23 ఏళ్ల పాటు ఏఐకు ఇదే తరహా నిధులు అవసరమవుతాయని అంచనా వేశారు.



# స్టాక్ మార్కెట్లు.. హ్యాట్రిక్


భారతీయ బెంచ్‌మార్క్ ఈక్విటీ సూచీలు వరుసగా మూడో సెషన్లో లాభాలతో ముగిశాయి. బుధవారం ఇంట్రాడేలో 75,568.38 పాయింట్ల గరిష్ఠాన్ని తాకిన సెన్సెక్స్ 147.79 పాయింట్లు (0.20 శాతం) పెరిగి 75,449.05 వద్ద స్థిరపడింది. అలాగే నిఫ్టీ 73.30 పాయింట్లు (0.32 శాతం) పెరిగి 22,907.60 వద్ద ముగిసింది. బుధవారం ఈ సూచీ 22,940.70 నుంచి 22,807.95 శ్రేణిలో ట్రేడ్ అయింది. శ్రీరామ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, అపోలో హాస్పిటల్స్, టాటా స్టీల్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ షేర్లు 3.91 శాతం వరకు లాభపడ్డాయి. నిఫ్టీ 50లో టెక్ మహీంద్రా, బ్రిటానియా, టీసీఎస్, ఇన్ఫోసిస్, సన్ ఫార్మా షేర్లు 2.32 శాతం వరకు నష్టపోయాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ 100, నిఫ్టీ స్మాల్ క్యాప్ 100 సూచీలు 2 శాతానికి పైగా లాభపడ్డాయి. నిఫ్టీ ఎఫ్ఎంసీజీ, ఐటీ మినహా ఎన్ఎస్ఈలోని అన్ని రంగాల సూచీలు లాభాల్లో ముగిశాయి.



## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL



# ఎవరి మాటా వినని సీతయ్య!



**మాస్కో:** ప్రపంచ అధినేతల్లో.. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు ఓ సెపరేట్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. అందుకు ఆయన జీవన.. వ్యవహార శైలులు, నడవడికలు కారణాలని చెప్పొచ్చు. అదే సమయంలో ఇతర అధినేతలతో ఆయన వ్యవహరించే తీరు కూడా చాలా ప్రత్యేకంగా ఉండి.. తీవ్ర చర్చనీయాంశంగా మారుతుంటుంది కూడా. తాజాగా.. ఉక్రెయిన్ సంక్షోభంలో శాంతి నెలకొల్పే ప్రయత్నాలకు అడుగులు ముందుకు పడుతున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వయంగా రంగంలోకి దిగి మధ్యవర్తిత్వం వహిస్తున్నారు. కాల్పుల విరమణ ఒప్పందం కోసం ఇరు దేశాలతో చర్చలు జరుపుతున్నారు. ఈ క్రమంలో.. ట్రంప్ పుతిన్‌తో ఫోన్‌లో మాట్లాడగాఆ సంభాషణకు ముందు జరిగిన ఓ ఆసక్తికర సన్నివేశం ఇప్పుడు బయటకు వచ్చింది.మన టైమింగ్స్ ప్రకారం.. మార్చి 18వ తేదీన సాయంత్రం 4గం. నుంచి 6గం. మధ్య ఇద్దరూ మాట్లాడుకోవాల్సి ఉంది. ఇందుకు సంబంధించి ముందస్తు సమాచారం మాస్కోకు కూడా వెళ్లింది. షెడ్యూల్ ప్రకారం వైట్‌హౌజ్ నుంచి క్రెమ్లిన్‌కు టైంకి ఫోన్ వచ్చింది. కానీ ఆ టైంలో పుతిన్ అధ్యక్ష భవనంలో లేరు!. ట్రంప్‌తో మాట్లాడిన విషయానికి పెద్దగా ప్రాధాన్యత ఇవ్వకుండా.. తీరికగా మాస్కో ఇంటర్నేషనల్ హాల్‌లో జరిగిన రష్యా ప్రముఖ వ్యాపారవేత్తల భేటీకి హాజరయ్యారు. అయితే.. అక్కడ జరిగిన పరిణామాన్ని కింది వీడియోలో చూసేయండి. ట్రంప్‌తో ఫోన్‌కాల్‌కు టైం దగ్గర పడుతుండడంతో క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్.. ఆ కార్యక్రమానికి హోస్ట్‌గా వ్యవరించిన మాజీ ప్రధాని అలెగ్జాండర్ షోకిన్ ద్వారా పుతిన్‌కు సమాచారం చేరవేశారు. అయితే.. పుతిన్ ఆ విషయాన్ని పెద్దగా పట్టించుకోలేదు. సరికదా నవ్వుతూ "అతని మాటలేం పట్టించకోవద్దు.. అతనికి ఇదే పని" అని అనడంతో అక్కడంతా నవ్వులు పూశాయి. దీనికి కొనసాగింపుగా.. 'ట్రంప్‌కి ఈ విషయం తెలిస్తే ఎలా స్పందిస్తారో?" అని షోకిన్ అనడంతో మళ్లీ నవ్వులు పూశాయి. అయితే తాను ట్రంప్ గురించి అనలేదని.. పెస్కోవ్‌ను ఉద్దేశించి అన్నానని పుతిన్ చెప్పడంతో ఆ హాల్ మొత్తం నవ్వులతో నిండిపోయింది. ఇదంతా జరిగాక కూడా.. పుతిన్ ఆ మీటింగ్‌లోనే ఉండిపోయారు. ఆ తర్వాత నిదానంగా క్రెమ్లిన్ వెళ్లి ట్రంప్‌తో ఫోన్ మాట్లాడారు. ఉక్రెయిన్‌రష్యా మధ్య ఉద్రిక్తతల వేళ.. ట్రంప్‌తో కాల్ చాలా ముఖ్యమైందే. అయినా కూడా పుతిన్ అలా వ్యవహరించారు. అలాగని పుతిన్‌కు ఇలా తన కోసం ఎదురు చూసేలా చేయడం కొత్తేం కాదు. గతంలో.. జర్మనీ ఛాన్సలర్ ఏంజెలా మోర్కెల్, మత గురువు పోప్ ఫ్రాన్సిస్.. ఆఖరికి క్వీన్ ఎలిజబెత్‌ను కూడా తన కోసం వెయిట్ చేయించారు.

## ఫోన్ కాల్ సారాంశం ఇదే..

ట్రంప్ ప్రతిపాదించిన 30 రోజుల కాల్పుల విరమణకు ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీ అంగీకరించారు. అయితే రష్యా మాత్రం ట్రంప్ ప్రతిపాదనలను వ్యతిరేకించకుండా.. కొన్ని షరతులు పెడుతోంది. అలాగే పూర్తి స్థాయి కాల్పుల విరమణకు దిగిరావాలంటే.. ఉక్రెయిన్‌కు విదేశీ సాయం నిలిపివేయాలని పుతిన్, ట్రంప్‌ను కోరినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే.. ఈ ఫోన్ సంభాషణ ద్వారా పుతిన్‌తో జరిపిన చర్చలు ఫలవంతమయ్యాయని ట్రంప్ అంటున్నారు. ఈ క్రమంలో ఇతర అంశాలపై రష్యాతో తమ ప్రతినిధి బృందం చర్చలు జరుపుతుందని ఆయన ప్రకటించారు.

# విజయకేతనం.. సునీత విలియమ్స్ వచ్చేసింది






**కేప్ కెనావెరాల్:** సుదీర్ఘ నిరీక్షణ తర్వాత అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) నుంచి భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్ భారత కాలమానం ప్రకారం బుధవారం తెల్లవారుజామున 3:27 గంటలకు అమెరికాలోని ఫ్లోరిడా తీరంలో సాగర జలాల్లో దిగారు. స్పేస్ఎక్స్‌కు చెందిన క్రూ డ్రాగన్ 'ఫ్రీడమ్'.. వారిని సురక్షితంగా వారిద్దరినీ భూమి మీదకు తీసుకొచ్చింది. సునీత, విల్మోర్‌లతో పాటు నాసాకు చెందిన కమాండర్ నిక్ హేగ్, రష్యా వ్యోమగామి అలెగ్జాండర్ గోర్బునోవ్ కూడా ఐఎస్ఎస్ నుంచి ఇదే వ్యోమనౌకలో భూమికి చేరుకున్నారు.

**యాత్ర ఇలా కొనసాగింది..**

- భారత కాలమానం ప్రకారం మంగళవారం ఉదయం 8.15 గంటలకు క్రూ డ్రాగన్ వ్యోమనౌక తలుపు (హ్యాచ్) మూసివేత ప్రక్రియ జరిగింది.
- ఉదయం 10.15 గంటలకు క్రూ డ్రాగన్.. ఐఎస్ఎస్‌తో విడిపోవడం (అన్‌డాకింగ్) మొదలైంది.
- 10.35 గంటలకు పూర్తిగా విడిపోయింది.
- భూమి దిశగా 17 గంటల ప్రయాణాన్ని మొదలు పెట్టింది.
- ఇందుకోసం పలుమార్లు రాకెట్ ప్రజ్వలన విన్యాసాలు చేపట్టింది.
- ఆ వెంటనే భూమిపై ల్యాండింగ్ ప్రదేశం దిశగా కోసం క్రూ డ్రాగన్ ముందుభాగంలోని నాలుగు డ్రాకో ఇంజిన్ల ప్రజ్వలన మొదలైంది.
- ఏడున్నర నిమిషాలపాటు ఈ ప్రక్రియ కొనసాగింది.
- 2.17: స్పేస్ క్రాఫ్ట్ భూమికి తిరిగొచ్చే ప్రక్రియ షురూ
- 2.18: లీకేజీలు ఉన్నాయా అనే చెకింగ్ పూర్తి
- 2.35: కక్ష్య నుంచి విడిపడే ప్రక్రియ మొదలైంది.
- 2.51: కక్ష్య నుంచి విడివడే ప్రక్రియ పూర్తయి.. స్పేస్‌క్రాఫ్ట్ కిందకు దిగడం ప్రారంభమైంది.
- 3.10: డ్రాగన్ ఫ్రీడమ్ మాడ్యూల్ భూవాతావరణంలోకి ప్రవేశించింది.
- 3:11 అత్యంత వేగంగా ప్రయాణిస్తుండటంతో స్పేస్ ఎక్స్ గ్రౌండ్ స్టేషన్‌తో సిగ్నల్ కట్ అయిపోయింది.
- 3.21కి సిగ్నల్ కలిసింది.
- 3.26: భూమికి 5 కి.మీ. ఎత్తులో ఉండగా పారాచూట్‌లు తెరుచుకున్నాయి.
- 3.28: డ్రాగన్ మాడ్యూల్ సురక్షితంగా సముద్రంలో దిగింది.

రీ ఎంట్రీ తర్వాత రేడియో సైలెన్స్‌ను ఛేదిస్తూ కమాండర్ నిక్ హేగ్ మాట్లాడటంతో... కమాండ్ సెంటర్‌లో అందరిలో ఆనందం వెల్లివిరిసింది. సాగర జలాలకు 18 వేల అడుగుల ఎత్తులో ఉండగా వ్యోమనౌకలోని రెండు డ్రోగ్‌చూట్లు విచ్చుకున్నాయి. ఆ సమయంలో వ్యోమనౌక వేగం గంటకు 560 కిలోమీటర్లు. డ్రోగ్‌చూట్లు సమర్థంగా పనిచేయడంతో క్రూడ్రాగన్ వేగం గణనీయంగా తగ్గిపోయింది. వ్యోమనౌక వేగం గంటకు 190 కిలోమీటర్లకు చేరుకోగానే.. సాగర జలాల నుంచి 6,500 అడుగుల ఎత్తులో రెండు ప్రధాన పారాచూట్లు విచ్చుకున్నాయి. డ్రోగ్‌చూట్లు, పారాచూట్లు క్రూ డ్రాగన్ వేగానికి సమర్థంగా కళ్లెం వేయడంతో కమాండ్ సెంటర్‌లో చప్పట్లు మార్మోగాయి. ఆపై ఫ్లోరిడాలోని తలహాసీ తీరంలో సముద్ర జలాల్లో వ్యోమనౌక నెమ్మదిగా దిగింది. నిమిషాల వ్యవధిలోనే స్పీడ్‌బోట్లలో అక్కడికి రికవరీ సిబ్బంది దూసుకొచ్చారు. పరిస్థితులన్నీ సాధారణ స్థితిలోనే ఉన్నాయని నిర్ధారించుకున్నాక.. వ్యోమనౌకను మేగన్ నౌకపైకి చేర్చారు. ఆపై లోపల ఉన్న నలుగురు వ్యోమగాములను స్పేస్‌ఎక్స్ సిబ్బంది జాగ్రత్తగా ఒక్కొక్కరినీ బయటకు తీసుకొచ్చారు. తొలుత కమాండర్ నిక్ హేగ్, ఆ తర్వాత వరుసగా అలెగ్జాండర్, సునీతా విలియమ్స్, విల్మోర్ వ్యోమనౌక నుంచి బయటకు వచ్చారు. క్రూ డ్రాగన్ నుంచి బయటకు రాగానే సునీత.. ఆనందంతో చేతులు ఊపుతూ అభివాదం చేశారు.




## సునీతా విలియమ్స్‌ను స్వాగతించిన డాల్ఫిన్లు

**వాషింగ్టన్:** అమెరికన్ వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్‌లను సముద్రంలోని డాల్ఫిన్లు స్వాగతించాయి. దాదాపు తొమ్మిది నెలల తర్వాత అంతరిక్షం నుండి భూమికి తిరిగి వచ్చిన ఈ వ్యోమగాములను చూసి అందరూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీనికి డాల్ఫిన్ల ఆనందం కూడా తోడయ్యింది. పలు ఇబ్బందుల అనంతరం అంతరిక్ష నౌక చివరకు వ్యోమగాములతో పాటు ఫ్లోరిడా బీచ్‌లో దిగింది. భారత కాలమానం ప్రకారం ఈ ల్యాండింగ్ (బుధవారం తెల్లవారుజామున జరిగింది. ఈ సమయంలో నాసా బృందం వ్యోమగాములను స్వాగతించడానికి చిన్నపాటి షిప్‌లతో సిద్ధమయ్యింది. ఈ సమయంలో సముద్రంలో అరుదైన దృశ్యం కనిపించింది. సునీతా విలియమ్స్ ఉన్న క్యాప్స్యూల్‌ను పలు డాల్ఫిన్లు చుట్టుముట్టాయి. డాల్ఫిన్ల గుంపు అంతరిక్ష నౌక చుట్టూ ఈదుతూ కనిపించింది. సునీతా విలియమ్స్‌తో పాటు ఆమె సహచరులను క్యాప్సూల్ నుండి బయటకు తీసుకువస్తున్నప్పుడు పలు డాల్ఫిన్లు క్యాప్సూల్ చుట్టూ గుమిగూడాయి. దీనికి సంబంధించిన వీడియోను నాసా సిబ్బంది సాయర్ మెరిట్ ట్విట్టర్‌లో షేర్ చేశారు. 'స్పేస్ ఎక్స్‌కు చెందిన డ్రాగన్ క్యాప్సూల్ చుట్టూ డాల్ఫిన్లు ఈదుతున్నాయి' అని రాశారు. దీనిపై సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది.

# ఖగోళ యుద్ధంలో శనిదే ఘన విజయం

'చంద్ర సైన్యం' (మూన్స్ ఆర్మీ) సంఖ్యాపరంగా రారాజు శనిని కొట్టే గ్రహం ఇక దరిదాపుల్లో లేదు, ఉండబోదు! శని గ్రహానికి నిన్నటిదాకా 146 చంద్రుళ్లు ఉండేవి. అవి కాకుండా కొత్తగా మరో 128 చందమామలు శని చుట్టూ పరిభ్రమిస్తున్నట్టు శాస్త్రవేత్తలు తాజాగా కనుగొన్నారు. దీంతో శని గ్రహపు మొత్తం మూన్స్ సంఖ్య 274కి చేరింది. ఈ పరిశోధనను అంతర్జాతీయ ఖగోళ సంఘం కూడా గుర్తించింది. మన సౌరకుటుంబంలో శని తర్వాత పెద్ద సంఖ్యలో మూన్స్(More Moons) కలిగిన గ్రహం గురుడు (బృహస్పతి). గురుడికి 95 మూన్స్ ఉన్నాయి. శాస్త్రవేత్తలు ఎప్పటికప్పుడు ఈ రెండు గ్రహాలకు కొత్త చంద్రుళ్లను కనుగొంటూ వస్తుండటంతో చంద్రుళ్ళ సంఖ్యాపరంగా నువ్వా? నేనా? అన్నట్టు గురుడు, శని మధ్య దశాబ్దాల తరబడి యుద్ధం కొనసాగింది. అయితే.. శనికి తాజాగా ఒకేసారి భారీగా శతాధిక చంద్రుళ్లను కనుగొనడంతో ఈ రేసులో గురుడు ఓడిపోయాడనే చెప్పాలి. శనికి సంబంధించి కొత్తగా కనుగొన్న 128 చంద్రుళ్లలో 63 చంద్రుళ్లను 2019-2021 మధ్య కాలంలోనే చూచాయగా గుర్తించారు. మిగతావాటిని 2023లో వరుసగా మూడు నెలలపాటు పరిశీలించి కనుగొన్నామని అకడెమియా సిన్సియా (తైవాన్) ఖగోళ శాస్త్రవేత్త ఎడ్వర్డ్ ఆస్టన్ వెల్లడించారు. అయితే ఈ 128 కొత్త మూన్స్ మన భూగ్రహపు(Earth) చంద్రుడు ఉన్నంత పరిమాణంలో లేవు. పైగా మన చంద్రుడిలా గోళాకారంగానూ లేవు. అవి చిన్న సైజులో బంగాళదుంపల్లా వంకరటింకర ఆకృతిలో ఉన్నాయి. సౌరకుటుంబం ఆవిర్భవించిన తొలినాళ్లలో ఈ చిన్నపాటి ఖగోళ వస్తువుల సమూహాన్ని శని కక్ష్యలోని గురుత్వాకర్షణ శక్తి బంధించి ఉంటుందని, అనంతరం అవి ఎన్నోసార్లు ఢీకొని అంతిమంగా బుల్లి చంద్రుళ్లుగా మారి ఉంటాయని భావిస్తున్నారు. ఇలా చిట్టచివరిగా, లేటెస్టుగా అవి ఢీకొన్న సంఘటన 10 కోట్ల ఏళ్ల క్రితం జరిగి ఉంటుందని అంచనా వేస్తున్నారు.

274 చంద్రులతో గ్రహాల్లో కింగ్ ఆఫ్ మూన్స్‌గా లేటెస్ట్ ఫీట్ సాధించిన శని 2,80,000 కి.మీ కంటే ఎక్కువ వ్యాసంలో విస్తరించినప్పటికీ.. సన్నగా ఉండే వలయాలు అద్భుతంగా, ప్రకాశవంతంగా కనిపిస్తాయిబాప్‌రే.. టబ్‌లో తేలుతుందంట!గ్రహాల్లో కెల్లా అత్యంత తేలికైన గ్రహం ఇది. ప్రధానంగా హైడ్రోజన్, హీలియంతో నీటి కంటే తక్కువ సాంద్రత కలిగి ఉంటుంది. తగినంత పెద్ద టబ్ దొరికితే, శని నిజానికి దానిలో తేలుతుందట! శని గ్రహం మీద గంటకు 1,800 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయంట!



## నా సూర్యుడివి.. నా చంద్రుడివి నువ్వే..

# తండ్రికి మంచు మనోజ్ బర్త్ డే విషెస్

టాలీవుడ్ హీరో మంచు మనోజ్ తన తండ్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సోషల్ మీడియా వేదికగా మోహన్ బాబు ఫోటోను షేర్ చేస్తూ పుట్టినరోజు విషెస్ చెప్పారు. తన తండ్రితో సినిమాల్లో నటించిన జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ వీడియోను కూడా పంచుకున్నారు. ఈ వీడియోను 'నా సూర్యుడివి.. చంద్రుడివి.. నా దేవుడివి నువ్వే' అంటూ యానిమల్ సాంగ్‌తో తండ్రి తన ప్రేమను చాటుకున్నారు. మంచు మనోజ్ తన ఇన్‌స్టాలో రాస్తూ..'హ్యాపీ బర్త్ డే నాన్న.. ఈ రోజు నీ పక్కన ఉండి సెలబ్రేట్ చేసుకునే అవకాశాన్ని మిస్సవుతున్నా.. నీ వెంట నడిచేందుకు ఎంతో ఆసక్తిగా వేచి ఉన్నా. నీతో ఉన్న ప్రతి క్షణాలను ప్రేమిస్తా నాన్న' అంటూ తన ప్రేమను వ్యక్తం చేశారు. ఈ పోస్ట్ చూసిన మోహన్ బాబు కూతురు మంచు లక్ష్మి లైక్ కొట్టింది. ఇది చూసిన అభిమానులు తండ్రిపై తన ప్రేమను మరోసారి చాటుకున్నారని ప్రశంసిస్తున్నారు. మీరిద్దరు త్వరలోనే కలిసిపోవాలని కోరుకుంటున్నట్లు మరికొందరు కామెంట్స్ చేస్తున్నారు. టాలీవుడ్ హీరో మంచు మనోజ్ తన తండ్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సోషల్ మీడియా వేదికగా మోహన్ బాబు ఫోటోను షేర్ చేస్తూ పుట్టినరోజు విషెస్ చెప్పారు. తన తండ్రితో సినిమాల్లో నటించిన జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ





వీడియోను కూడా పంచుకున్నారు. ఈ వీడియోను 'నా సూర్యుడివి.. చంద్రుడివి.. నా దేవుడివి నువ్వే' అంటూ యానిమల్ సాంగ్‌తో తండ్రి తన ప్రేమను చాటుకున్నారు. మంచు మనోజ్ తన ఇన్‌స్టాలో రాస్తూ..'హ్యాపీ బర్త్ డే నాన్న.. ఈ రోజు నీ పక్కన ఉండి సెలబ్రేట్ చేసుకునే అవకాశాన్ని మిస్సవుతున్నా.. నీ వెంట నడిచేందుకు ఎంతో ఆసక్తిగా వేచి ఉన్నా. నీతో ఉన్న ప్రతి క్షణాలను ప్రేమిస్తా నాన్న' అంటూ తన ప్రేమను వ్యక్తం చేశారు. ఈ పోస్ట్ చూసిన మోహన్ బాబు కూతురు మంచు లక్ష్మి లైక్ కొట్టింది. ఇది చూసిన అభిమానులు తండ్రిపై తన ప్రేమను మరోసారి చాటుకున్నారని ప్రశంసిస్తున్నారు. మీరిద్దరు త్వరలోనే కలిసిపోవాలని కోరుకుంటున్నట్లు మరికొందరు కామెంట్స్ చేస్తున్నారు.


# ఒడిశా షెడ్యూల్ పూర్తి.. ఫొటోలు వైరల్



గత కొన్నిరోజులు ఒడిశాలోని కోరాపుట్ లో జరుగుతున్న మహేశ్ బాబురాజమౌళి సినిమాకు సంబంధించిన షెడ్యూల్ పూర్తయింది. ఈ క్రమంలో పలువురు అధికారులు, అభిమానులు టీమ్ ని కలవగా ఆ ఫొటోలు వైరల్ అవుతున్నాయి. మరోవైపు రాజమౌళి థ్యాంక్యూ నోట్ కూడా రిలీజ్ చేశాడు. మహేశ్ బాబు హీరోగా రాజమౌళి ఓ పాన్ ఇండియా సినిమా చేస్తున్నాడు. చాన్నాళ్ల క్రితమే హైదరాబాద్ లో షూటింగ్ మొదలుపెట్టారు కానీ ప్రకటించలేదు. ఒడిశాలోని కోరాపుట్ కొండలపై మహేశ్‌పృథ్వీరాజ్‌ప్రియాంక చోప్రా తదితరులపై కీలక సన్నివేశాలు చిత్రీకరించారు. ఇందుకు సంబంధించి ఓ వీడియో కూడా ఆ మధ్య లీకైంది. అలా వార్తల్లో నిలిచిన SSMB 29 ఇప్పుడు ఒడిశా షెడ్యూల్ ముగించుకుంది. ఈ మేరకు కోరాపుట్ హాస్పిటాలిటీకి రాజమౌళి ధన్యవాదాలు చెప్పాడు. మరిన్ని అడ్వెంచర్స్ చేసేందుకు మళ్లీ ఇక్కడికి వస్తానని అన్నాడు. దిగువన రాజమౌళి, ప్రియాంక చోప్రా సంతకాలు చేసిన ఓ నోట్ ఇప్పుడు వైరల్ అవుతోంది. అలానే సెట్ లో మహేశ్, ప్రియాంక, రాజమౌళి తో పలువురు దిగిన ఫొటోలు కూడా సోషల్ మీడియాలో ఉన్నాయి.

# రూ.120 కోట్లతో అమితాబ్ టాప్!

మన దేశంలో పలువురు సెలబ్రిటీలు సినిమాలు, యాడ్స్, షోలు చేస్తూ రెండు చేతులా సంపాదిస్తారు. అదే టైంలో ప్రభుత్వానికి ట్యాక్స్ (పన్ను) కూడా కడుతుంటారు. అదీ కోట్లలోనే ఉంటుంది. తాజాగా ఈ లిస్టులో అగ్రస్థానానికి బిగ్ బీ అమితాబ్ వచ్చినట్లు తెలుస్తోంది. ఇంతకీ గత ఏడాది కాలంలో ఎంత సంపాదించారంటే? 82 ఏళ్ల వయసులోనే ఫుల్ ఎనర్జీతో పనిచేస్తున్న అమితాబ్ బచ్చన్.. గతేడాది 'కల్కి'లో ప్రభాస్ కి ధీటుగా నటించి ఆకట్టుకున్నారు. మరోవైపు 'కౌన్ బనేగా కరోడ్ పతి' షోతోనూ అలరిస్తున్నారు. కొన్ని యాడ్స్ కూడా చేస్తున్నారు. అలా 2024-25 సంవత్సరానికి గానూ దాదాపు రూ.350 కోట్ల వరకు సంపాదించారట. ఇందులోనూ రూ.120 కోట్ల ట్యాక్స్ ఈ మధ్యే కట్టారట. మన దేశంలో అత్యధిక ట్యాక్స్ కట్టే సెలబ్రిటీల్లో గతేడాది షారుక్ ఖాన్ (రూ.92 కోట్లు) అగ్రస్థానంలో నిలిచినట్లు వార్తలొచ్చాయి. ఇతడి తర్వాత తమిళ హీరో దళపతి విజయ్ (రూ.80 కోట్లు), సల్మాన్ ఖాన్ (రూ.75 కోట్లు) ఉండగా.. నాలుగో స్థానంలో అమితాబ్ ఉన్నాడు. ఈసారికి వచ్చేసరికి ఎక్కువ పన్ను కట్టి టాప్ లోకి వచ్చేశాడని సమాచారం.






# కూలీ కంప్లీట్

'కూలీ' సినిమా షూటింగ్ పూర్తయింది. రజనీకాంత్ హీరోగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'కూలీ'. ఈ చిత్రంలో నాగార్జున, ఉపేంద్ర, సత్యరాజ్, శ్రుతీహాసన్, షౌబిన్ షాహిర్ ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. ఓ గెస్ట్ రోల్‌లో ఆమిర్ ఖాన్, స్పెషల్ సాంగ్‌లో పూజా హెగ్డే నటించారు. సన్ పిక్చర్స్ ఈ సినిమాను నిర్మించింది. కాగా ఈ సినిమా చిత్రీకరణ ముగిసిన విషయాన్ని 'ఎక్స్' వేదికగా ధృవీకరించారు మేకర్స్. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ మొదలయ్యాయి. ఈ చిత్రాన్ని ఈ ఏడాది దీపావళి సందర్భంగా రిలీజ్ చేయాలని అనుకుంటున్నారట. మరోవైపు రజనీకాంత్ హీరోగా 'జైలర్ 2' సినిమా షూటింగ్ ఇటీవల ప్రారంభమైన విషయం తెలిసిందే.

## సగం బాలీవుడ్ ఐపీఎల్ కోసం..



మన దేశంలో జనాలు ఏది ఎక్కువ ఇష్టపడతారో అంటే టక్కున చెప్పే మాట సినిమాలు, క్రికెట్. మరీ ముఖ్యంగా ఐపీఎల్ ప్రారంభోత్సవానికి బాలీవుడ్ సెలబ్రిటీల ఆటపాట ఉండాల్సిందే. స్టార్ హీరోహీరోయిన్లు వస్తారు, తమదైన డ్యాన్సులతో ఫుల్లుగా ఎంటర్ టైన్ చేస్తారు. మిగతా సీజన్ల మాటేమో గానీ ఈ సీజన్ ప్రారంభోత్సవానికి సగం బాలీవుడ్ వచ్చే ప్లాన్ చేశారట. ప్రతి సీజన్ లోనూ తొలి మ్యాచ్ ప్రారంభానికి ముందు స్టేడియంలో 23 గంటల ప్రోగ్రామ్ ఉంటుంది. ఈసారి తొలి మ్యాచ్ కోల్ కతా vs బెంగళూరు మధ్య జరగనుంది. కోల్ కతా జట్టు ఓనర్ షారుక్ ఎలానూ ఉంటాడు. మరోవైపు సల్మాన్ ఖాన్, విక్కీ కౌశల్, సంజయ్ దత్, వరుణ్ ధావన్ పెర్ఫార్మెన్స్ ఇవ్వబోతున్నట్లు తెలుస్తోంది. హీరోయిన్లలో ప్రియాంక చోప్రా, కత్రినా కైఫ్, 'యానిమల్' తృప్తి, శ్రద్ధా కపూర్, తమన్నా, ఊర్వశి రౌతేలా, కరీనా కపూర్, పూజా హెగ్డే.. ఇలా లిస్ట్ చాలా పెద్దగానే ఉన్నట్లు సమాచారం. వీళ్లతో పాటు స్టార్ సింగర్స్ అర్జిత్ సింగ్, శ్రేయా ఘోషల్, అమెరికన్ పాప్ బ్యాండ్ వన్ రిపబ్లిక్ కూడా పెర్ఫార్మ్ చేయనుంది. అయితే వీళ్లేం ఊరికే రారుగా. ఐపీఎల్ మేనేజ్ మెంట్ లేదా ఆయా ఫ్రాంఛైజీలు కోట్ల రూపాయల పారితోషికం చెల్లిస్తాయట. మొత్తంగా రెండు మూడు గంటల పాటు జరిగే ప్రోగ్రామ్ కోసం రూ.4050 కోట్ల వరకు ఖర్చు చేయనున్నారని టాక్. వీటిలో నిజమెంతనేది తెలియాల్సి ఉంది.

## క్రీడా వార్తలు SPORTS NEWS

# డైనమైట్లతో నిండిన పంజాబ్ బ్యాటింగ్ విభాగం.. వీరిని ఆపతరమా..?

ఈ ఏడాది ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్ బ్యాటింగ్ విభాగం విధ్వంసకర డైనమైట్లతో నిండుకుని ఉంది. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ జట్టు బ్యాటింగ్ విభాగం అత్యంత పటిష్టంగా, ప్రమాదకరంగా కనిపిస్తుంది. కొత్త కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ మొదలు మార్కస్ స్టోయినిస్, గ్లెన్ మ్యాక్స్‌వెల్, శశాంక్ సింగ్, జోస్ ఇంగ్లిస్, ప్రభ్‌సిమ్రన్ సింగ్, ఆరోన్ హార్డీ, అజ్మతుల్లా ఒమర్‌జాయ్, మార్కో జన్సెన్.. ఇలా జట్టు మొత్తం విధ్వంసకర వీరులే ఉన్నారు. బౌలింగ్ విభాగం కాస్త బలహీనంగా కనిపిస్తున్నా.. బ్యాటింగ్ బలగం చూసి పంజాబ్‌ను టైటిల్ ఫేవరెట్లలో ఒకటిగా చెప్పవచ్చు. జట్టులో చాలామంది మిడిలార్డర్ బ్యాటర్లు ఉండటంతో తుది జట్టు కూర్పు సమస్యగా మారవచ్చు. ఓపెనర్లుగా జోస్ ఇంగ్లిస్, ప్రభ్‌సిమ్రన్ సింగ్ రావచ్చని అంచనా. వన్‌డౌన్‌లో శ్రేయస్ అయ్యర్, నాలుగో స్థానంలో నేహల్ వధేరా, ఐదో ప్లేస్‌లో శశాంక్ సింగ్ బ్యాటింగ్‌కు దిగే అవకాశం ఉంది. ఆరో స్థానంలో మ్యాక్స్‌వెల్, ఏడో ప్లేస్‌లో అజ్మతుల్లా ఒమర్‌జాయ్/మార్కో జన్సెన్, బౌలర్లుగా అర్షదీప్ సింగ్, లోకీ ఫెర్గూసన్, యుజ్వేంద్ర చహల్, జేవియర్ బార్ట్‌లెట్ తుది జట్టులో ఉండవచ్చు.కాగా, ఈ నెల 22 నుంచి ఐపీఎల్ 18వ సీజన్ ప్రారంభం కానుండగా... పంజాబ్ కింగ్స్ మార్చి 25న గుజరాత్ టైటాన్స్‌తో తమ తొలి మ్యాచ్ ఆడనుంది. లీగ్ ఆరంభం నుంచి ఒక్కసారి కూడా ట్రోఫీ చేజిక్కించుకోలేకపోయిన







పంజాబ్ కింగ్స్... ఈసారి తమ చిరకాల స్వప్నం నెరవేర్చుకోవాలనే లక్ష్యంతో ఉంది. గతేడాది కోల్‌కతా నైట్‌రైడర్స్‌ను చాంపియన్‌గా నిలిపిన శ్రేయస్ అయ్యర్ ఈసారి పంజాబ్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఆసీస్ దిగ్గజం రికీ పాంటింగ్ హెడ్‌కోచ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. వీరిద్దరి కాంబినేషన్‌లో పంజాబ్ తమ టైటిల్ కల నేరవేర్చుకుంటుందేమో చూడాలి.

### ఐపీఎల్ 2025 సీజన్‌లో పంజాబ్ కింగ్స్ జట్టు..

శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), నేహల్ వధేరా, ప్రియాన్ష్ ఆర్య, హర్నూర్ సింగ్, పైలా అవినాశ్, ముషీర్ ఖాన్, మార్కస్ స్టోయినిస్, గ్లెన్ మ్యాక్స్‌వెల్, శశాంక్ సింగ్, ఆరోన్ హార్డీ, అజ్మతుల్లా ఒమర్‌జాయ్, మార్కో జన్సెన్, సూర్యాంశ్ షేడ్గే, ప్రవీణ్ దూబే, జోస్ ఇంగ్లిస్, ప్రభ్‌సిమ్రన్ సింగ్, విష్ణు వినోద్, హర్‌ప్రీత్ బ్రార్, అర్షదీప్ సింగ్, యుజ్వేంద్ర చహల్, లోకీ ఫెర్గూసన్, విజయ్‌కుమార్ వైశాక్, కుల్దీప్ సేన్, యశ్ ఠాకూర్, జేవియర్ బార్ట్‌లెట్

# ముంబై ఇండియన్స్ కెప్టెన్‌గా సూర్యకుమార్ యాదవ్



ఐపీఎల్ 2025లో ముంబై ఇండియన్స్ తమ తొలి మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్ చెన్నైలోని చిదంబరం స్టేడియం వేదికగా మార్చి 23న జరుగనుంది. ఆ రోజు డబుల్ హెడర్ మ్యాచ్‌లు జరుగనుండగా.. ఎంఐ, సీఎస్‌కే మ్యాచ్ రాత్రి 7:30 గంటలకు ప్రారంభమవుతుంది. ఈ మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ తమ రెగ్యులర్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా సేవలు కోల్పోనుంది. గత సీజన్‌లో చేసిన తప్పుల కారణంగా హార్దిక్ సీఎస్‌కేతో మ్యాచ్‌కు దూరం కానున్నాడు. గత సీజన్‌లో ముంబై ఇండియన్స్ మూడు మ్యాచ్‌ల్లో స్లో ఓవర్ రేట్ తో బౌలింగ్ చేసింది. దీంతో ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ ముంబై కెప్టెన్‌గా ఉన్న హార్దిక్ పాండ్యాకు రూ.30 లక్షల జరిమానాతో పాటు ఓ మ్యాచ్ ఆడకుండా నిషేధం విధించింది. గత సీజన్‌లో ముంబై గ్రూప్ దశలోనే నిష్క్రమించడంతో హార్దిక్‌పై నిషేధం సాధ్యం కాలేదు. ఈ క్రమంలో ఈ సీజన్‌లో తొలి మ్యాచ్‌లోనే అతను నిషేధం ఎదుర్కొంటున్నాడు.హార్దిక్ గైర్హాజరీలో ముంబై ఇండియన్స్ తాత్కాలిక సారధిగా సూర్యకుమార్ యాదవ్ ఎంపికయ్యాడు. ఈ విషయాన్ని రెగ్యులర్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా ఇవాళ (మార్చి 19) స్వయంగా ప్రకటించాడు. సూర్యకుమార్‌కు భారత టీ20 జట్టు కెప్టెన్‌గా అనుభవం ఉండటంతో ఎంఐ మేనేజ్‌మెంట్ అతనికే సారథ్య బాధ్యతలు కట్టబెట్టింది. కాగా, ముంబై ఇండియన్స్‌ను ఐదు సార్లు ఛాంపియన్‌గా నిలబెట్టిన రోహిత్ శర్మ కెప్టెన్సీపై అయిష్టతతో 2023 సీజన్ తర్వాత తప్పుకున్న విషయం తెలిసిందే. మరో సీనియర్ ఆటగాడు జస్ప్రీత్ బుమ్రా ఈ సీజన్ ఆరంభ మ్యాచ్‌లకు దూరం కానున్నాడని తెలుస్తుంది. ఈ నేపథ్యంలో సీనియర్లలో ఒకరైన సూర్యకుమార్‌కే సీఎస్‌కేతో మ్యాచ్‌లో ముంబై కెప్టెన్‌గా వ్యవహరించే అవకాశం వచ్చింది. టీ20ల్లో సూర్య కుమార్ యాదవ్‌కు అద్భుతమైన ట్రాక్ రికార్డు ఉంది. స్కై సారథ్యంలో భారత్ 18 మ్యాచ్‌ల్లో కేవలం నాలుగింట మాత్రమే ఓడింది. ఓవరాల్‌గా స్కై 39 టీ20 మ్యాచ్‌ల్లో సారథ్యం వహించి 28 మ్యాచ్‌ల్లో తన జట్టును గెలిపించుకున్నాడు. స్కై.. గతంలోనూ ఓ సందర్భంలో (2023 సీజన్‌లో) ముంబై ఇండియన్స్ కెప్టెన్‌గా వ్యవహరించాడు. స్కై తన కెప్టెన్సీలో బ్యాటర్‌గానూ విశేషంగా రాణించాడు. 37 ఇన్నింగ్స్‌ల్లో సెంచరీ, 8 హాఫ్ సెంచరీల సాయంతో 164.56 స్ట్రయిక్‌రేట్ తో 1068 పరుగులు చేశాడు. కాగా, ఐపీఎల్ 2025 సీజన్‌లో ముంబై ఇండియన్స్ దేశీయ స్టార్లపై ఆధారపడి ఉంది. మెగా వేలానికి ముందు ఆ జట్టు రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్యా, తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్, జస్ప్రీత్ బుమ్రాను రీటైన్ చేసుకుంది. మెగా వేలంలోనూ ఆ జట్టు పెద్దగా విదేశీ స్టార్ల కోసం పాకులాడలేదు. విల్ జాక్స్, మిచెల్ సాంట్నర్, ముజీబ్ ఉర్ రెహ్మాన్, కార్బిన్ బాష్, ర్యాన్ రికెల్టన్ లాంటి ఆటగాళ్లు కొత్తగా జట్టులోకి చేర్చుకుంది. ఈసారి జట్టులోకి వచ్చిన ట్రెంట్ బౌల్ట్‌కు గతంలో ముంబై ఇండియన్స్‌తో అనుబంధం ఉంది. మెగా వేలంలో దక్కించుకున్న రీస్ టాప్లే గాయం కారణంగా ఈ సీజన్‌కు దూరమయ్యాడు. దేశీయ పేసర్ దీపక్ చాహర్‌ను ముంబై సీఎస్‌కేతో పోటీపడి దక్కించుకుంది.

## విరాట్ కోహ్లి ఘాటు విమర్శలు..

# స్పందించిన బీసీసీఐ





ఆటగాళ్ల కుటుంబ సభ్యులను విదేశీ పర్యటనలకు అనుమతించే విషయంలో తమ నిర్ణయం మారదని భారత క్రికెట్ నియంత్రణ మండలి (BCCI) స్పష్టం చేసింది. జట్టుతో పాటు బోర్డుకు కూడా ఇదే మంచిదని పేర్కొంది. ఈ విషయంలో ఆటగాళ్లకు భిన్నాభిప్రాయాలు ఉండవచ్చని.. అయితే, తాము జట్టు ప్రయోజనాల కోసం కఠినంగా వ్యవహరించక తప్పదని తెలిపింది. ఈ మేరకు బోర్డు తరఫున.. బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా (Devajit Saikia) తమ స్పందన తెలియజేశారు. కాగా ఆస్ట్రేలియా పర్యటనలో టీమిండియా ఘోరంగా విఫలమైన విషయం తెలిసిందే. దాదాపు పదేళ్ల తర్వాత తొలిసారి బోర్డర్ గావస్కర్ ట్రోఫీని చేజార్చుకుంది. 31తో ఓడి ఇంటిబాటపట్టింది.

ఈ పరాభవం తర్వాత.. విదేశీ పర్యటనలకు ఆటగాళ్ల కుటుంబ సభ్యులను అనుమతించే విషయమై బీసీసీఐ కఠిన నిబంధనలు ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. నలభై ఐదు రోజుల్లోపు విదేశీ పర్యటనలో ఆటగాళ్లు, సహాయ సిబ్బంది కుటుంబ సభ్యులను వారం రోజులు మాత్రమే అనుమతిస్తారు.

అంతకు మించి పర్యటన కొనసాగితే రెండు వారాల పాటు సన్నిహితులకు అక్కడే ఉండే వెసలుబాటు ఉంటుంది. అయితే, ఈ విషయంలో టీమిండియా సూపర్‌స్టార్ విరాట్ కోహ్లి (Virat Kohli) బీసీసీఐ తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. సన్నిహితులే సగం బలమని.. ఆటగాడి విజయం వెనుక కుటుంబ సభ్యుల పాత్రను అందరికీ వివరించలేమని పేర్కొన్నాడు.

మైదానంలో దిగని వాళ్లు, అక్కడ ఏం జరుగుతుందో తెలియని వాళ్లు ఇలాంటి నిర్ణయం తీసుకోవడం నిరాశ కలిగించిందని కోహ్లి ఘాటుగా విమర్శించాడు. ప్రతి ఆటగాడు తన కుటుంబ సభ్యులు వెంట ఉంటే మరింత బాధ్యతగా ఆడతారని ఈ సందర్భంగా పేర్కొన్నాడు. ఈ నేపథ్యంలో బీసీసీఐ ఈ విషయంలో యూటర్న్ తీసుకోనుందనే వార్తలు వచ్చాయి. అయితే, అలాంటిదేమీ లేదని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా తాజాగా కొట్టిపడేశారు. ''మేము ప్రవేశపెట్టిన నిబంధనలో ప్రస్తుతం ఎలాంటి మార్పులు చేయడం లేదు. బీసీసీఐకి, వ్యవస్థకి, జట్టుకు, దేశానికి ఇదే మంచిది. ఈ అంశంలో ఆటగాళ్ల నుంచి భిన్నాభిప్రాయాలు, మిశ్రమ స్పందన వస్తుందని తెలుసు. ఇక్కడంతా ప్రజాస్వామ్యం ఉంటుంది కాబట్టి.. ఎవరైనా తమ గొంతును వినిపించవచ్చు. తమ భావాలను నిర్భయంగా పంచుకోవచ్చు.

అయితే, ఈ నిబంధన విషయంలో అందరు ఆటగాళ్లూ సమానమే. జట్టులోని ప్రతి సభ్యుడు, కోచ్‌లు, మేనేజర్లు, సహాయక సిబ్బంది.. ఇలా అందరికీ రూల్స్ వర్తిస్తాయి. ఇందుకు ఎవరూ మినహాయింపు కాదు. జట్టు ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకునే ఈ నిర్ణయం తీసుకున్నాం. రాత్రికి రాత్రే హడావుడిగా ఈ విధానాన్ని మేము ప్రవేశపెట్టలేదు. దశాబ్దాలుగా జరుగుతున్న విషయాలను పరిగణనలోకి తీసుకుని మా అధ్యక్షుడు రోజర్ బిన్నీ ఈ పాలసీ తీసుకువచ్చారు. నిజానికి గతంతో పోలిస్తే విదేశీ పర్యటనల సమయంలో కుటుంబ సభ్యులను అనుమతించే విషయమై మేము ఆటగాళ్లకు చాలా వరకు మినహాయింపులు ఇచ్చాం. అయితే, ఇప్పుడు ఈ రూల్ కాస్త కఠినంగా అనిపించినా.. తప్పక అమలు చేస్తాం'' అని దేవజిత్ సైకియా స్పష్టం చేశారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com

## ఆహార నాణ్యతపై విరివిగా తనిఖీలు నిర్వహించాలి

■ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలి.. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



**కరీంనగర్, మహా:** జిల్లాలోని ప్రైవేటు, ప్రభుత్వ హాస్టళ్లు, హోటళ్లు, ఆహారం తయారు చేసే కేంద్రాల్లో విరివిగా తనిఖీలు చేసి ఆహార నాణ్యత పాటించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. ఆహార నాణ్యత పై ఫుడ్ సేఫ్టీ జిల్లాస్థాయి సలహా కమిటీ సమావేశం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ ఆహార కల్తీ, నాసిరకమైన ఆహారం తయారు చేయడం పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని కమిటీ సభ్యులను ఆదేశించారు. ఫుడ్ సేఫ్టీ విషయంలో అనుబంధ శాఖల సమన్వయంతో కొన్ని బృందాలను నియమించుకోవాలని, వాటి ఆధ్వర్యంలో తనిఖీలు ముమ్మరం చేయాలని సూచించారు. ముఖ్యంగా హోటళ్లు, ఐస్ పాయింట్లు, పండ్ల మార్కెట్లలో తనిఖీలు చేయాలని అన్నారు. ప్రభుత్వ వసతి గృహాలు, అంగన్వాడీ కేంద్రాలకి సరఫరా అవుతున్న ఆహార వస్తువులు, వంటకు వినియోగిస్తున్న సరుకులను పరిశీలించాలని సూచించారు. జిల్లాలో చిరు తిండి అమ్మకాలు సాగిస్తున్న చిన్న వ్యాపారుల వివరాలు సేకరించాలని, ఆహారం తయారు చేయడంలో తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యల గురించి వారికి అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని అన్నారు. ఆహార సంబంధిత వ్యాపారం చేస్తున్న వ్యాపారం చేస్తున్నవారు నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆహారం అమ్మకాలు సాగించే చోట పరిశుభ్రమైన తాగునీరు, నాణ్యమైన ఆహారం వినియోగదారులకు అందజేయాలని అన్నారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ ప్రభుత్వ ప్రైవేటు ఆధ్వర్యంలో నడుస్తున్న ఆహార తయారీ కేంద్రాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని అన్నారు. హోటల్లు, హాస్టల్లో వంటగది, వాష్ ఏరియా శుభ్రంగా ఉంచాలని సూచించారు. వీధి అమ్మకం దారులకు పూర్ సేఫ్టీ పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీ కిరణ్, డిఆర్ఓ వెంకటేశ్వర్లు, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ సునీత, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, డిప్యూటీ డి ఎం హెచ్ ఓ సుజాత, డిడబ్ల్యూఓ సబిత, డిఎస్ఓ శ్రీనివాస్, డీఏవో భాగ్యలక్ష్మి, డిఇఓ జనార్ధన్ పాల్గొన్నారు.

## ఎల్.ఆర్.ఎస్. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**ఈ నెల 31వ తేదీలోగా ఫీజు చెల్లిస్తే 25% రాయితీ**

జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.



**ములుగు, మహా :** అనధికార లే ఔట్ల క్రమబద్ధీకరణకు, ప్లాట్ల రెగ్యులరైజేషన్ కు 2020 సంవత్సరంలో ఎల్.ఆర్.ఎస్ రిజిస్ట్రేషన్ చేసుకున్నవారు ప్రస్తుతం ఫీజు చెల్లించుటకు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన 25 శాతం రాయితీ అవకాశాన్ని జిల్లాలోని అర్హులైన వారందరూ గడువులోగా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. బుదవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్.ఆర్.ఎస్ ప్రక్రియను సులభతరం చేసేందుకు ప్రభుత్వం కొన్ని నూతన నిర్ణయాలు తీసుకుందని, ఎఫ్.టి.ఎల్, నిషేధించిన సర్వే నెంబర్లు మినహా ఎల్.ఆర్.ఎస్ 2020 కు దరఖాస్తు చేసుకున్న అందరికీ రెగ్యులరైజేషన్ రుసుము నిర్ణయించామని తెలిపారు. రుసుము ఎంత అనేది ఎవరైనా తమ సెల్ నెంబర్ ద్వారా లాగిన్ అయ్యి పరిశీలించ వచ్చని అన్నారు. ఫీజు చెల్లించేందుకు అర్హత ఉన్న ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తు దారులు ఎవరైనా ఈనెల 31వ తేదీ లోగా చెల్లిస్తే 25 శాతం మినహాయింపు ఉంటుందని తెలిపారు. రుసుము చెల్లించిన వారి దరఖాస్తు అధికారులు పరిశీలించి రెండు రోజుల్లోనే అనుమతి మంజూరు చేస్తారని తెలిపారు. అనధికారికంగా లేఅవుట్లు చేసి అందులో 10 శాతం ప్లాట్లను విక్రయించిన వారికి మిగతా ప్లాట్లను క్రమబద్ధీకరించుకునే అవకాశం ఉందని అన్నారు. ప్లాట్ రిజిస్ట్రేషన్ సమయంలో కూడా ఎల్.ఆర్.ఎస్ రుసుము చెల్లించి క్రమబద్ధీకరణ చేసుకోవచ్చని తెలిపారు. క్రమబద్ధీకరించని భూములలో ఎటువంటి రిజిస్ట్రేషన్లకు, నిర్మాణాలకు అనుమతించడం ఉండదని తెలిపారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా క్రమబద్ధీకరణ చేసుకోవాలని, ఈ నెల 31వ తేదీ వరకు ప్రభుత్వం అందించిన అవకాశాన్ని వినియోగించుకొని 25% రాయితీ పొందాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



## లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో కలెక్టర్ ప్రత్యేక పూజలు

**హుజూర్ నగర్, మహా:** లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానం, మట్టపల్లి మహాక్షేత్రములో సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందల్ పవార్ వారు కుటుంబ సమేతముగా విచ్చేసినందున వారికి దేవస్థాన అర్చకులు మరియు అనువంశిక ధర్మకర్త చెన్నూరు విజయ్ కుమార్ ,మట్టపల్లిరావు మరియు కార్యనిర్వహణాధికారి సిరికొండ నవీన్ వారలు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. తదుపరి దేవాలయములో శ్రీ స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమములు నిర్వహించినారు. వీరికి దేవస్థాన అర్చకులు వేదమంత్రములతో అశీర్వచనము చేసి శేషవస్త్రములు మరియు దేవస్థాన పాలకవర్గము వారు మెమెంటో బహుకరించినారు. ఇట్టి కార్యక్రమములో హుజూర్నగర్ ఆర్.డి.ఓ., సి.ఐ, మఠంపల్లి తహశీల్దార్ దేవస్థాన అర్చకులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## వేసవిలో నీటి పొదుపు కోసం కమీషనర్ చాహాత్ బాజ్ పాయ్ అవగాహన



**కరీంనగర్, మహా:** కరీంనగర్ లోని పలు డివిజన్ లలో బుధవారం రోజు కమీషనర్ చాహాత్ బాజ్ పాయ్ పర్యటించారు. నగరంలోని సప్తగిరి కాలనీ, రాంనగర్, శివనగర్ ప్రాంతాల్లో పర్యటిస్తూ.... నగరపాలక సంస్థ మంచి నీటి సరఫరా ను తనిఖీ చేసి పరిశీలించారు. పలు ప్రాంతాల్లో త్రాగు నీటి సరఫరా లో ప్రెషర్ తక్కువగా ఉందని ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదు మేరకు నీటి సరఫరా సమయంలో పలు నివాస గృహాలను సందర్శించి...నీటి సరఫరా అవుతున్న తీరును తనిఖీ చేసి పరిశీలించారు. పలు నివాస గృహాల్లో నల్లాలకు ఆన్ ఆఫ్ లేక వృధాగా నీటిని వదిలేయడంతో పాటు మోటార్లు బిగించి నీటి చౌర్యానికి పాల్పడుతున్న తీరును స్వయంగా పరిశీలించి... అధికారులను ఆదేశించారు. అనంతరం రాంనగర్ వాటర్ ట్యాంక్ లో మంచి నీటి సరఫరా విభాగం ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. పలు సూచనలు చేస్తూ... అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నగర వ్యాప్తంగా రిజర్వాయర్ల వారిగా విధులు నిర్వర్తించే ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది మంచి నీటి సరఫరా సమయంలో తప్పని సరిగా పర్యవేక్షించాలన్నారు. నీటి సరఫరాను సమయం ప్రకారం సరఫరా చేస్తూ...త్రాగు నీరు సరఫరా సమయంలో కాలనీల్లో నివాస గృహాలను తనిఖీ చేయాలన్నారు. సరఫరా లో ప్రెషర్ సరిగా లేకుంటే వెంటనే తగిన చర్యలు తీస్కోవాలన్నారు. ఏరియాల వారిగా పైపు లైన్ లీకేజీలు ఉంటె వెంటనే అరికట్టాలన్నారు. మోటార్లు బిగించి నీటి చౌర్యానికి పాల్పడుతున్న వారికి జరిమాన విధించాలని ఆదేశించారు. నీటి సరఫరా సమయంలో నల్లా నీరు వృధాగా పోకుండ చర్యలు తీస్కోవాలని ఆదేశించారు. ఎవరైన నల్లాలకు ఆన్ ఆఫ్ బిగించు కోకుండా నీటిని వృధాగా వదిలేసే వారిని గుర్తించాలని అలాంటి వారికి జరిమాన విధించాలని ఆదేశించారు. రిజర్వాయర్ల వారిగా లైన్ మెన్, పిట్టర్లు, ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేయాలన్నారు. నీటి సరఫరా లో ప్రజలకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీస్కోవాలన్నారు. వాల్స్ లీకేజీలు ఉంటే వెంటనే వాల్స్ రీపేర్ చేయించి సక్రమంగా నీటి సరఫరా చేయాలని కోరారు. నగర ప్రజలు వేసవి కాలంలో నీటిని వృధా చేయకుండ పొదుపుగా వాడుకోవాలని సూచించారు. వృధగా నీరు వదిలేస్తే అలాంటి వారి పై చర్యలు తీస్కుంటామని తెలిపారు. నల్లాలకు ఆన్ ఆఫ్ బటన్ లు తప్పకుండా బిగించుకొవాలని... మోటార్లు బిగించి నీటి చౌర్యం కు పాల్పడవద్దని సూచించారు. మీ నివాస గృహాలకు నీరు సరిపోతే నల్లాలు ఆప్ చేయాలని... మిగితా గృహాలకు ప్రెషర్ తో నీరు వెల్లేలా సహకరించాలని కోరారు. మానేరు డ్యాంలో రోజు రోజుకు నీటి మట్టం తగ్గుముఖం పడుతుండటంతో ప్రజలు నీటిని వృధా చేయకుండ పొదుపుగా వాడుకొవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారులు, లైన్ మెన్ లు, పిట్టర్లు పాల్గొన్నారు.




## గ్రామాలలో అస్తవ్యస్థంగా గ్రామ పంచాయితీ పాలన

**గ్రామాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి**

**మోత్కూర్, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోనీ పాటినట్ల గ్రామంలో సర్పంచ్ ల పాలన ముగిసి సంవత్సరం గడచినప్పటికి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించక పోవడంతో గ్రామాలలో సమస్యలు పేరుకుపోయాయని సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. సిపిఎం పార్టీ పోరుబాటలో భాగంగా పాటిమట్ల గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామ ప్రత్యేక అధికారి కీర్తి, కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. గ్రామంలో ఎస్సీ కాలనీ అనుకోని ఉన్న బృందావన్ కాల్వ చెత్త కంప చెట్లతో ప్లాస్టిక్ వ్యర్థాలతో కూరుకు పోయిందని, గ్రామంలోని రైతు వేదికలో నీటి వసతి, వాష్ రూమ్, విద్యుత్ సౌకర్యం కల్పించాలని, వృద్దులు, వికలాంగులు, కొత్త పెంక్షన్ కోసం ఎదిరిచుస్తున్నారని, ప్రభుత్వం ప్రకటించిన ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు వెంటనే మంజూరు చెయ్యాలని కోరారు, ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు రాచకొండ కనకయ్య, కురిమేటి యాదయ్య, దొండ నాగరాజు, మెతుకు సాయిలు, కురిమేటి సోమయ్య,అన్నవరం వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## మైనార్టీల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్యాచరణ



**ములుగు, మహా :** మైనారిటీల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని, సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమశాఖా మంత్రి దనసరి అనసూయ (సీతక్క) పిలుపునిచ్చారు. రంజాన్ పండుగ ఉపవాస దీక్షలతో సహృద్భావ వాతావరణంలో జరుగుతోందని పేర్కొన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకొని ప్రభుత్వం ములుగులోని లీలా గార్డెన్లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో మంత్రి సీతక్కతో పాటు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఎస్పీ డాక్టర్ పి.శబరీష్ పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ముస్లిం సోదరులను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నారని, పలు రంగాలలో ప్రతిభ చాటిన యువతి యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. ముస్లిం మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం కలిపిస్తున్న అవకాశాలను అన్ని వర్గాల ముస్లింలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముస్లింలకు రంజాన్ పండుగఎంతో పవిత్రమైనదని, నెలరోజులపాటు ఉపవాస దీక్షలు చేయడం చెప్పుకోదగ్గ విషయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సిహెచ్. మహేందర్ జీ, సంపత్ రావు, గ్రంధాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, ఆర్డీఓ వెంకటేష్, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి రవీందర్ రెడ్డి, డిపిఆర్ఓ రఫీక్, డిపిఓ దేవ్ రాజ్, ముస్లిం మత పెద్దలు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.




**సోలార్ సిస్టం ద్వారా 139 గ్రామాల్లో నీరందిస్తున్నాం : మంత్రి సీతక్క**


సోలార్ సిస్టం ద్వారా జిల్లాలో 139గ్రామాల్లో సోలార్ సిస్టం ద్వారా నీరందిస్తున్నామని, రాష్ట్ర వ్యాప్తంగా మండల కేంద్రము లలో ఏర్పాటు చేసిన చలి వేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మంత్రి సీతక్క అన్నారు. బుధవారం రాత్రి జిల్లా కేంద్రంలోని గాంధీ పార్క్ వద్ద గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలి వేంద్రాన్ని జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్ లతో కలిసి ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ.. మండుతున్న ఎండల సమయంలో పలు మండలాల నుండి ప్రజలు తమ అవసరాలు నిమిత్తం జిల్లా కేంద్రానికి చేరుకున్న సమయంలో తాగు నీటికి ఇబ్బంది ఏర్పడకుండా ఇలాంటి చలివేంద్రాలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయితీ అధికారి దేవ్ రాజ్, ఎంపిడిఓ రామక్రిష్ణ, ఎంపిఓ రహీం, ఈవో పి.రఘు, ప్రజాప్రతినిధులు గ్రామ పంచాయితీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా బుధవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు నల్లెల్ల కుమారస్వామి జ్ఞాపకార్థం జిల్లా ఆస్పత్రి ఎదుట గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంత్రి సీతక్క ప్రారంభించారు. చిన్నపిల్లలు, వృద్ధులు ఎండలో బయట తిరగొద్దని, వడదెబ్బ తగిలే అవకాశం ఉందన్నారు. ప్రజలు వీలైనంత వరకు పగటి పూట ఇంటి వద్దనే గడపాలని, అత్యవసర పనులకు మాత్రమే బయటకు రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, నాయకులు పాల్గొన్నారు.

## మాతృమూర్తే! కన్న పేగును కడతేర్చుకుందా?

■ మద్యానికి బానిసై హింసించే కొడుకును శాశ్వత నిద్రలోకి సాగనంపిందా?
■ హన్మాపూర్ హత్య ఘటనలో విస్తుపోయే వదంతులు?

**కట్టుకున్న భార్య కాటికి పంపించిందా?**





**రంగారెడ్డి జిల్లా, మహా:** నవమాసాలు మోసి పురిటినొప్పులను భరించి జన్మనిచ్చి,పెంచి పోషించి పెద్దవాడిని చేసి, వృద్ధాప్యంలో ఎలాంటి కష్టాలు లేకుండా కొడుకు ఆలనా పాలన చూసుకుంటాడనుకున్న, ఆ మాతృమూర్తికి నాడు అనుభవించిన పురిటినొప్పుల కన్నా ఎక్కువ బాధపెడుతూ, జులాయిగా తిరుగుతూ మద్యానికి బానిసై, భార్య పిల్లలను సైతం చిత్రహింసలకు గురిచేస్తున్న కన్న పేగునే కన్నతల్లి (కడతెర్చి) జోలపాట పాడి శాశ్వత నిద్రలోకి పంపిందంటూ వికారాబాద్ జిల్లా, పెద్దేముల్ మండలం, హన్మాపూర్ గ్రామంలో బుధవారం జరిగిన హత్య కేసులో స్థానిక గ్రామస్తులు చర్చించుకోవడం విస్తుపోయే వసంతులు వినిపించడం కొసమెరుపు?


పెద్దేముల్ మండలం, హన్మాపూర్ గ్రామంలో జరిగిన హత్యకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మృతుడు బక్కని వెంకటేశం తమ్ముడు బక్కని శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు, తన అన్న బక్కని వెంకటేశ్ వివాహమైన నాలుగు ఐదు సంవత్సరాల నుండి మద్యానికి బానిసై జులాయిగా తిరుగుతూ, ప్రతిరోజు మద్యం తాగి వచ్చి ఇంట్లో వారితో నిత్యం గొడవలు పడుతూ ఉండేవాడని తెలిపాడు. ఇట్టి విషయమై గతంలో ఎన్నోమార్లు పెద్దమనుషుల సమక్షంలో కూర్చోబెట్టి నచ్చజెప్పే ప్రయత్నం చేసినా, మా అన్న బక్కని వెంకటేష్ ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదని అన్నారు. ఈ నేపథ్యంలో బుధవారం మార్చి 19 తెల్లవారుజామున, మా అమ్మ వదిన ఇద్దరూ వచ్చి అన్నను ఎవరో కొట్టి చంపారంటూ తెలపడంతో, నేను వెళ్లి చూసేసరికి రక్తపు మడుగులో ఉన్న మా అన్న ఇంటి ఆవరణలో విగతజీవిగా పడి ఉన్నాడు. తలపై శరీర భాగాలపై తీవ్రంగా గాయాలున్నట్లు పేర్కొంటూ తన అన్న హత్య కేసులో తన తల్లి లక్ష్మమ్మ, వదిన సబితను ఏమైందంటూ ప్రశ్నించగా వివరాలు చెప్పకుండా ఆందోళన చెందుతూ తడబాటు పడడంతో, మా అన్న హత్య కేసులో అమ్మ వదినలపై అనుమానాలు ఉన్నాయని పోలీసుల ఫిర్యాదులో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా హత్య జరిగిన సమాచారం అందుకున్న తాండూరు డిఎస్పి బాలకృష్ణా రెడ్డి, రూరల్ సీఐ నగేష్, పెద్దేముల్ ఎస్సై శ్రీధర్ రెడ్డి హన్మాపూర్ గ్రామానికి చేరుకొని, హత్యకు దారి తీసిన కారణాలను అన్వేషిస్తూ, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## సామాజిక న్యాయానికి కాంగ్రెస్ కట్టుబడి ఉంది



**మోత్కూర్, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మున్సిపల్ కేంద్రం తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ లో ఎస్సీ వర్గీకరణ, బీసీ కులగణన బిల్లులను ఏకగ్రీవంగా ఆమోదించడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం సామాజిక న్యాయాన్ని మరింత బలపరిచిందని వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎండి సమీరుద్దీన్ తెలిపారు. ఎస్సీ వర్గీకరణతో ఎస్సీ సామాజిక వర్గాల్లో ఉన్న వర్గాలకు న్యాయం జరిగిందని, బీసీ కులగణన వల్ల బీసీలకు విద్య, ఉపాధి, రాజకీయ ప్రాతినిధ్యం పెరిగే అవకాశం లభిస్తుందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేస్తూ, సామాజిక సమానత్వాన్ని నెలకొల్పే నిర్ణయాలను తీసుకుంటోందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి సీఎం నుంచే మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రజా సంక్షేమాన్ని ప్రథమ లక్ష్యంగా పెట్టుకుని, ఎన్నికల హామీలను అమలు చేస్తూ ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు.

## పల్లెర్ల కళ్యాణి వెంకన్న గుప్త ఆధ్వర్యంలో విద్యార్థులకు పెన్నులు, కంపాస్ బాక్సుల పంపిణీ



**మోత్కూర్, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జడ్పిహెచ్ఎస్) లో పల్లెర్ల కళ్యాణి వెంకన్నగుప్త 10వ తరగతి విద్యార్థులకు పెన్నులు, కంపాస్ బాక్సులు పంపిణీ చేశారు. విద్యార్థులకు చదువులో మరింత సౌలభ్యంగా ఉండేలా సహాయ పడేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో చదివి మంచి విజయాలు సాధించాలని, తమ భవిష్యత్తును ఉత్తమంగా తీర్చిదిద్దుకోవాలని ఆకాంక్షించారు. సామాజిక బాధ్యతగా విద్యా అభివృద్ధికి నిరంతరం తోడ్పాటు అందిస్తానని పేర్కొన్నారు. పదవ తరగతిలో ఉత్తమ విద్యార్థులకు 1st 10116/ 2nd 5116/ 3rd 2116/ పారితోషికం అందిస్తామని అన్నారు. కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పైళ్ల సోమిరెడ్డి, మాట్లాడుతూ, విద్యాభివృద్ధి సమాజ అభివృద్ధికి కీలకమని, ఇలాంటి సహాయాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని అన్నారు. విద్యార్థులు కృషి చేసి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. యువతకు మద్దతుగా నిలిచే వెంకన్న సేవా మనోభావాన్ని ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు అరవిందరాయుడు, అంజయ్య, రాంప్రసాద్, విద్యార్థులు పాల్గొని వెంకన్న కి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు తమకు అందిన సహాయాన్ని ఉపయోగించుకుని ఉత్తమ ఫలితాలు సాధిస్తామని హామీ ఇచ్చారు.

## ప్రతి 30 కిలో మీటర్లకు ఒక సాండ్ బజార్

■ సామాన్యులకు అందుబాటులో ఇసుక
■ దళారీ వ్యవస్థకు చెక్ పెట్టినట్టే
■ ఆన్ లైన్ బుకింగ్ తో ఇంటి వద్దకే ఇసుక
■ కార్పొరేషన్ చైర్మన్ అనిల్ కుమార్ ఏరావతారి






**రంగారెడ్డి జిల్లా, మహా :** సామాన్య ప్రజల ఇంటి నిర్మాణానికి అందుబాటులో ఉండే విధంగా నగరం చుట్టూ ప్రతి 30 కిలో మీటర్లకు ఒక సాండ్ బజారును ఏర్పాటు చేస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్ కుమార్ ఏరావతారి తెలిపారు. బుధవారం తెలంగాణ రాష్ట్ర మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్ కుమార్ ఏరావతారి, రాష్ట్ర గనులు భూగర్భ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, డైరెక్టర్ శశాంకలతో కలిసి రాజేందర్ నగర్ నియోజకవర్గం వట్టినాగుల పల్లిలో సాండ్ బజార్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ అనిల్ కుమార్ ఏరావతారి మాట్లాడుతూ దళారులు వారి ఇష్టానుసారం రేట్లు పెంచుతూ మోసాలకు పాల్పడుతున్నారని దీనిని గమనించిన ప్రభుత్వం సన్న ఇసుకకు రూ.1800/లకు అదే విధంగా, దొడ్డు ఇసుకకు రూ.1600/లకు చొప్పున ఆన్లైన్లో బుక్ చేసినట్లయితే వారికి ఇసుక పంపడం జరుగుతుందని తెలిపారు. ఇక్కడ నుండి తీసుకెళ్ళే రవాణా చార్జి అదనంగా ఉంటుందని తెలియజేశారు. ఈ ఇసుక 365 రోజులు వినియోగదారులకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్ మాట్లాడుతూ... గృహ నిర్మాణాలు చేసుకునే ప్రజలకు అతి తక్కువ ధరలకు అందుబాటులోకి తేవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ముందుకు వచ్చి ఈ ధరలను నిర్ణయించిందని ఆయన అన్నారు. ఇష్టానుసారంగా రేట్లు పెంచుతూ ప్రజలకు ఇసుకను అందుబాటులో లేకుండా ఎక్కువ ధరకు అమ్మడాన్ని అరికట్టుటకు ప్రభుత్వం ధర నిర్ణయించిందని అన్నారు. టీజీఎండిసి ద్వారా హైదరాబాద్ నగరానికి మూడు ప్రాంతాల్లో సాండ్ బజార్లను ఏర్పాటు చేయడంతోపాటు నగరం చుట్టూ ప్రతి 30 కిలోమీటర్లకు ఒక సాండ్ బజారును ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ ప్రక్రియ ద్వారా దళారి వ్యవస్థ ఉండదని సరసమైన ధరలకే ప్రజలకు ఇసుక లభిస్తుందని ఆయన తెలిపారు. రాష్ట్ర గనులు, భూగర్భ శాఖ డైరెక్టర్ శశాంక మాట్లాడుతూ... ఇసుక అనేది ఈ రోజుల్లో నిత్యావసర వస్తువులాగా నగరంలో ఎక్కువగా ఉపయోగంలో ఉన్నందున ప్రభుత్వం దీన్ని గమనించి నగరం చుట్టుపక్కల సాండ్ బజారును ఏర్పాటు చేసి ప్రజలకు నాణ్యమైన ఇసుకను తక్కువ ధరలకే ఇచ్చేందుకు ఈ సాండ్ బజార్లను నెలకొల్పడం జరిగినదని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజీఎండిసి ఎండి సుశీల్ కుమార్, ఎడి మైన్స్ నర్సిరెడ్డి, ఆర్డీఓ వెంకట్ రెడ్డి, బిల్డర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.